thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 64 కరీంనగర్ గురువారం, 15 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### మేకిన్ ఇండియా విఫలం..మోదీ గుర్తించాలి

పట్నా : జీడీపీలో తయారీ రంగం వాటా 2104లో 15.3 శాతంగా ఉంటే ఇప్పుడది 12.6శాతానికి పడిపోయిందని.. ఇది గత 60ఏళ్లలో అత్యంత కనిష్ఠం అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ పేర్కొన్నారు. లోక్ సభలో మోదీ తన ప్రసంగంలో ఎక్కడా 'మేకిన్ ఇండియా' గురించి మాట్లాడలేదని.. ఈ 'మేక్ ఇన్ ఇండియా' మంచి కార్యక్రమమే అయినా అది విఫలమైందనే విషయాన్ని ప్రధాని గుర్తించాలని అన్నారు.

ప్రధాని మోదీ మాట్లాడితే.. ఎన్నికల్లో అణగారిన వర్గాలకు టికెట్లు ఇవ్వడం ద్వారా వారికి ప్రాతినిధ్యం కల్పించామని గొప్పగా చెబుతుంటారని.. అయితే ఆ వర్గం ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి అన్ని అధికారాలనూ ఆయన లాగేసుకున్నారని ఆరోపించారు. కేంద్రమంత్రులు కూడా పేరుకే ఉన్నారని.. ఆర్ఎస్ఎస్ సిఫారసు చేసిన ఓఎస్డీలే శాఖలపై పెత్తనం చెలాయిస్తున్నారని మండిపడ్డారు.

# ప్రాజెక్టు ఎలా కట్టకూడదో కాళేశ్వరంను చూసి నేర్చుకోండి




హైదరాబాద్ : కట్టిన మూడేళ్లలో కుప్పకూలిన ప్రాజెక్టు భూ ప్రపంచంలో కాళేశ్వరం మాత్రమేనని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. నీళ్ల అవసరమే తెలంగాణను సాధించిందన్న రేవంత్.. గతంలో తెలంగాణ ఉద్యమాన్ని భావోద్వేగంగా మార్చి రాజకీయ ప్రయోజనం పొందారన్నారు. అనేక విషయాలపై ముక్కుసూటిగా మాట్లాడిన రేవంత్ రెడ్డి అనేక విషయాలపై సమగ్రంగా వివరించారు. విపక్ష బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు సెటైర్లు వేస్తూ ముప్పేటదాడి చేశారు. అటు ఉద్యోగుల గురించి కూడా సీఎం రేవంత్ కుండబద్ధలు కొట్టారు. "ఎవరు చేయాల్సిన పని వారు చేయాలి. నాయకులు చెప్పారని చేస్తే అధికారులు ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుంది. అప్పటి సీఎం హెలికాప్టర్లో వెళుతూ ఎక్కడ ప్రాజెక్టు కట్టాలో చెప్పారట. విజిలెన్స్ NDSA నివేదికల్లో అధికారులను ఉరితీయాలని చెప్పారు." "ప్రాజెక్టు ఎలా కట్ట కూడదో కాళేశ్వరంను చూసి తెల్సుకోవాలి. ఎలా నిర్మించాలో నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను చూసి నేర్చుకోవాలి. కొందరు కోర్టుల్లో కేసులు వేసి ఉద్యోగ నియామకాలు అడ్డుకుంటున్నారు. గ్రూప్ వన్ పరీక్షలకు ఏర్పాట్లు అన్ని పూర్తి అయ్యాయి. కానీ కొందరు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారు. నీళ్లు మన నాగరికత.. నీళ్ల కోసమే తెలంగాణ ఉద్యమం పుట్టింది. నీళ్ల కోసం మొదలైన మన ఆకాంక్షనే రాష్ట్రాన్ని సాధించి పెట్టింది. ఇది ఉద్యోగం కాదు.. ఒక భావోద్వేగం.. ఆ భావోద్వేగానికి మీరే ప్రతినిధులు. భావోద్వేగంతో కొన్ని పార్టీలు రాజకీయ లబ్ది పొందాయి." అని సీఎం రేవంత్ అన్నారు. " రెండు లక్షల కోట్లు ఖర్చుపెట్టినా తెలంగాణలో ఉమ్మడి రాష్ట్రంలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు పూర్తి కాలేదు. గతంలో కట్టిన సాగునీటి ప్రాజెక్టులు ఎన్ని ఉపద్రవాలు వచ్చినా ఇప్పటికీ చెక్కు చెదరలేదు. కానీ కాళేశ్వరం మూడేళ్ళలోనే కట్టడం, కూలడం రెండూ జరిగిపోయాయి. ఎలా కట్టకూడదో, ఎలా కడితే ప్రజలకు నష్టం జరుగుతుందో అనే దానికి ఉదాహరణ కాళేశ్వరం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు కట్టిన చోట కనీసం సాయిల్ టెస్ట్ చేయలేదు. 80 వేల పుస్తకాలు చదివిన వ్యక్తి ఇంజనీరుగా మారి కట్టిన కాళేశ్వరం పరిస్థితి ఇది. త్వరలోనే గ్రూప్స్ ఉద్యోగాల నియామకాలు పూర్తి చేస్తాం" అని సీఎం రేవంత్ అన్నారు. జలసౌధలో కొలువుల పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు. హాజర య్యారు. నీటిపారుదల శాఖలో కొత్తగా నియమితులైన AE, JTO లకు సీఎంఈ సందర్భంగా నియామక పత్రాలు అందజేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కాబోతున్న మీ అందరికీ అభినందనలు. అని సీఎం కొత్త ఉద్యోగులను సాదరంగా ఆహ్వానించారు.

## సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఆర్. గవాయ్ ప్రమాణస్వీకారం



జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ 52వ భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా ప్రమాణ స్వీకారం చేశారు. దేశంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిని అధిష్టించిన తొలి బౌద్ధుడు, రెండవ షెడ్యూల్డ్ కులాల న్యాయమూర్తిగా ఈయన నిలిచారు. జస్టిస్ గవాయ్ తో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణస్వీకారం చేయించారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ విరమణతో జస్టిస్ బి.ఆర్. గవాయ్ ఆ బాధ్యతలు చేపట్టారు. ఈయన ఆరు నెలలకు పైగా అంటే నవంబర్ 23, 2025 వరకు చీఫ్ జస్టిస్ గా కొనసాగనున్నారు. జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ తర్వాత షెడ్యూల్డ్ కులాల నుండి ప్రధాన న్యాయమూర్తి అయిన రెండవ వ్యక్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్.

**ఎవరీ జస్టిస్ గవాయ్ :** భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ బి.ఆర్. గవాయ్ 1960, నవంబర్ 24 లో మహారాష్ట్రలో జన్మించారు. ఆయన స్వస్థలం అమరావతి. ఈయన తండ్రి దివంగత ఆర్. ఎస్. గవాయ్ ప్రముఖ సామాజిక కార్యకర్త. బిహార్, కేరళ రాష్ట్రాలకు గవర్నర్ గా కూడా పనిచేసారు.జస్టిస్ బి.ఆర్. గవాయ్ న్యాయశాస్త్రంపై మక్కువతో లా చదువుకున్నారు. 1985 లో న్యాయవాది రాజా ఎస్. బోంస్లే వద్ద న్యాయ వృత్తిని ప్రారంభించారు. 1987లో బాంబే హైకోర్టులో స్వతంత్రంగా ప్రాక్టీస్ ప్రారంభించారు. రాజ్యాంగ, పరిపాలనా చట్టంపై దృష్టి సారించారు. నవంబర్ 14, 2003న అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. నవంబర్ 12, 2005న శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. 15 సంవత్సరాలకు పైగా ముంబై, నాగ్‌పూర్, ఔరంగాబాద్, పనాజీలలో బెంచ్‌లకు అధ్యక్షత వహించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న ఆయనను తదుపరి సిజెఐగా కొలిజియం సిఫారసు చేసింది. దీనికి కేంద్ర కేబినెట్, రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో ఇవాళ(బుధవారం) అధికారికంగా ఆయన బాధ్యతలు చేపట్టారు.



## తిరుపతి ఐఐటి విస్తరణ . కేంద్ర కేబినేట్ ఆమోదం

న్యూ ఢిల్లీ – కేంద్రం ఎపికి మరో శుభవార్త వినిపించింది.. తిరుపతిలోని ఐఐటి విస్తరించాలని నిర్ణయించింది.. ఈ మేరకు నేడు మోదీ అధ్యక్షత జరిగిన కెబినేట్ భేటిలో ఆమోద ముద్ర వేసింది.. ఇక ఈ కేబినేట్ లో సెమీ కండక్టర్ పరిశ్రమలను ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నారు.. అంతే కాకుండా ఉత్తర ప్రదేశ్ లో బేవర్ లో ఆరో సెమీ కండక్టర్ యూనిట్ నిర్మాణానికి నిధులు కేటాయించింది.. దీని వల్ల ప్రత్యక్షంగా రెండు వేల మందికి ఉపాధి లభిస్తున్నదని తెలిపింది.అలాగే డిస్ ప్లే చిప్స్ బెంగుళూరు , నోయిడాలలో ఏర్పాటుకు కేబినేట్ ఆమోద ముద్ర వేసింది. దీని కోసం నాలుగు వేల కోట్లు కేటాయించింది.. వాటి ద్వారా ప్రతి నెల 3.6 కోట్లు చిప్స్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

# శాంతి చర్చల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ సిద్ధమే!




## మోదీ ప్రభుత్వం ఇందుకు సుముఖమా, కాదా, స్పష్టం చేయాలి! ఆపరేషన్ కగార్ ను ఆపేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి శాంతి చర్చలు జరపాల్సిందిగా ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు ముందుకు రండి! : సీపీఐ మావోయిస్ట్ పార్టీ

చురకలు ప్రతినిధిహైదరాబాద్, మే, 14భారతదేశవాసులకు, ప్రజాస్వామికవాదులకు, శాంతికాములకు, అంతర్జాతీయ విప్లవ, ప్రజాస్వామిక శక్తులకు, పార్టీ కేంద్రకమిటీ తరపున, ప్రజా సమస్యల పరిష్కారానికి సమయావధితో కూడిన కాల్పుల విరమణ ప్రకటించి, శాంతి చర్చలు జరపాల్సిందిగా ఏప్రిల్ 25న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూ 2వ ప్రకటన విడుదల చేసాను, దీనిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి వెంటనే అనుకూలంగా ప్రతిస్పందించడం ఆహ్వానించదగిన అంశం అని సీపీఐ మావొయిస్ట్ పార్టీ కేంద్ర కమిటి అధికార ప్రతి నిధి అభయ్ పేర్కొన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం వైపు నుంచి గానీ, ఛత్తీస్ గఢ్ రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి గానీ వచ్చిన వ్యతిరేక ప్రతిస్పందన చింతనీయంగా ఉందని, కాల్పుల విరమణ ప్రసక్తే లేదనీ, మావోయిస్టులు ఆయుధాలు విడిచిపెట్టకుండా వారితో శాంతి చర్చలు జరిపే అవకాశం లేదని కేంద్ర హోంశాంఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఛత్తీస్ గఢ్ ఉపముఖ్యమంత్రి– రాష్ట్ర హోంమంత్రి విజయ్ శర్మ ప్రకటించారని అభయ్ పేర్కొన్నారు. ఎటువంటి షరతులు లేకుండా శాంతి చర్చలు జరపడానికి ప్రభుత్వం సిద్ధమని విజయ్ శర్మ పదే పదే చేసిన ప్రకటనలకు భిన్నంగా కాల్పుల విరమణ ప్రకటించకుండానే మావోయిస్టులు ఆయుధాలు విడిచిపెట్టాలని షరతు పెట్టారని, నిజానికి మా పార్టీ నాయకత్వంలో విప్లవోద్యమం తెలంగాణ, ఛత్తీస్ గఢ్ లకు పరిమితమైలేదని,దేశవ్యాప్తంగా దాదాపు 16 రాష్ట్రాల్లో మా పార్టీ పని చేస్తోందని,అందువల్ల శాంతి చర్చల విషయంలో కేంద్ర ప్రభుత్వ హోంమంత్రి అమిత్ షా ప్రతిస్పందించాల్సి వుందన్నారు. ఆయన ప్రతిస్పందిస్తే ఉపయోగం ఉంటుందన్నారు. మా పార్టీ 2002 నుంచే శాంతి చర్చల పట్ల తన వైఖరిని ప్రకటిస్తూ వచ్చిందని, 2004లో ప్రజల, ప్రజాస్వామికవాదుల డిమాండ్ మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అప్పటి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం మా పార్టీతో చర్చలు జరిపినప్పటికీ వాటిని చివరి వరకు కొనసాగించకుండా చర్చల నుంచి ఏకపక్షంగా వైదొలిగిందన్నారు.ఆనాడు ఈ విషయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే పరిమితమైందని,కానీ 2010లో దేశంలోని పౌరసమాజం, ప్రజాస్వామికవాదుల విజ్ఞప్తి మేరకు మా పార్టీ కేంద్రకమిటీ వైపు నుంచి కేంద్ర ప్రభుత్వంతో శాంతి చర్చలు జరిపేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసిందన్నారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం శాంతి చర్చల కోసం కృషి చేస్తున్న మా పార్టీ అధికార ప్రతినిధి కామ్రేడ్ ఆజాద్ ను కుట్రపూరితంగా పట్టుకుని హత్య చేసిందన్నారు. ఈ చర్చల ప్రక్రియలో భాగంగానే పశ్చిమ బెంగాల్ లో మా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ రాంజీ (మల్లోజుల కోటేశ్వర్లు)ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హత్య చేసాయని,శాంతి చర్చల ప్రక్రియను భగ్నం చేసాయన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు శాంతి చర్చల విషయంలో మా పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, మా పార్టీ ఎల్లప్పుడూ శాంతి చర్చలకు సిద్ధంగానే ఉందని అభయ్ పేర్కొన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం వైపు నుంచి ఎన్నడూ అలాంటి ప్రయత్నాలు చేయలేకపోవడం చింతనీయమని, నేడు ఆపరేషన్ కగార్ లో మా పార్టీ నాయకత్వం–కేడర్లతో పాటు పెద్ద సంఖ్యలో ఆదివాసుల్ని హత్య చేయడమే కాకుండా మా పార్టీకీ, ఆదివాసుల అస్తిత్వానికి పెనుసవాలు ఎదురైన మాట వాస్తవమేఅని, కానీ ఇందువల్లనే మా పార్టీ శాంతి చర్చలపై పత్రికా ప్రకటనలు గుప్పిస్తోందని గోదీ మీడియా చేస్తున్న విష ప్రచారంలో ఇసుమంత కూడా వాస్తవం లేదని అభయ్ పేర్కొన్నారు.బాధ్యత కలిగిన ఈ దేశవాసుల నుంచి వచ్చిన ప్రస్తావనను మేము హృదయపూర్వకంగా స్వీకరిస్తూ, వారికి ధన్యవాదాలు తెలుపుతూ వారికి నేను ఒక మెసేజ్ పంపానని, దానినే వారు పత్రిక ప్రకటనగా విడుదల చేసారని, అదే మార్చి 28న (2025) విడుదలైన పత్రికా ప్రకటన అని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రత్యేకించి అనేక వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు, శాంతికాముకులు సభలు, సమావేశాలు, సదస్సుల ద్వారా శాంతి చర్చలకు అనుకూల వాతావరణాన్ని ఏర్పరచేందుకు పలు ప్రయత్నాలు చేస్తున్నారన్నారని పేర్కొన్నారు. వీరిపై అర్బన్ నక్సల్స్ ముద్ర వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని,. ఇది సరైంది కాదని, తెలంగాణ ప్రభుత్వానికి (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో భాగంగా ఉండడం వలన) శాంతి చర్చల గురించి ముందు నుంచి తెలిసి వుండడం వలన శాంతి చర్చల ప్రస్తావనకు వెంటనే అనుకూలంగా స్పందించిందని పేర్కొన్నారు. కాల్పులు విరమించి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి కూడా విజ్ఞప్తి చేసారని అభయ్ పేర్కొన్నారు. కాకతాళీయంగా అదే సమయంలో జరుగుతున్న భారత రాష్ట్ర సమితి (బీ.ఆర్.ఎస్.) రజతోత్సవ సభలకు హాజరైన లక్షలాది మంది ప్రజలను ఉద్దేశించి ఆ పార్టీ అధినేత కేసీఆర్ అడిగిన ప్రశ్నకు జవాబుగా మావోయిస్టులతో చర్చల జరపాలని ప్రజలు నినదించారన్నారు.నేడు దేశంలో లక్షలాది మంది ప్రజలు శాంతి చర్చలను కోరుకుంటున్నారని, అంతర్జాతీయంగా పలు దేశాల్లో వివిధ మావోయిస్టు పార్టీల, ప్రజాస్వామిక సంస్థలతో పాటు కార్మికులు, రైతాంగం, మధ్యతరగతి ప్రజలు కూడా మన దేశంలో మావోయిస్టులతో మోదీ ప్రభుత్వం శాంతిచర్చలు జరపాలని డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే తాను ఏప్రిల్ 25న రెండవ ప్రకటన విడుదల చేసానని, శాంతి చర్చలకు నేను విడుదల చేసిన ప్రకటనలను మా పార్టీ బలహీనతగా గోదీ మీడియా విష ప్రచారం చేయడం వారి కార్పొరేట్ స్వభావాన్నే మరోసారి బహిర్గతం చేసింది తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. ఇకపోతే, తన 2వ ప్రకటనకు ప్రతిస్పందనగా బండి సంజయ్, విజయ్ శర్మల ప్రతిస్పందనలో మాట్లాడిన విషయాలు చింతనీయమని అభయ్ పేర్కొన్నారు.వాటిలో ఏమాత్రం వాస్తవాలు లేవని, రాజ్యహింసకు ప్రతిస్పందనగానే మా పార్టీ సాయుధ పోరాటానికి దిగిందనేది జగమెరిగిన సత్యమని,ప్రభుత్వమే చట్టాన్ని ఉల్లంఘిస్తూ మావోయిస్టులను, ఆదివాసీ– గైరాదివాసీ ప్రజలను వందలాది మందిని హత్య చేసిందని,చేస్తోందని, మే 7వ తేదీన **(మిగతా 3వ పేజీలో)**



# ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా : డిప్యూటీ సీఎం భట్టి

ఎర్రుపాలెం: ప్రజా ప్రభుత్వం లో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా కల్పించడం, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చెయ్యటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్, ఇంధన వనరుల శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తొలుత బుధవారం ఎర్రుపాలెంలో రూ.22 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 50 పడకల ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన,కండ్రిక నుంచి పెద్ద గోపవరం వరకు 2 కోట్ల 62 లక్షల రూపాయల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి, బనిగండ్లపాడు నుండి బంజర వరకు 5 కోట్ల 74 లక్షల వ్యయంతో బీటీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. 34 మంది కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రుపాలెంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు ప్రసంగించారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ, రైతు భరోసా, రాజీవ్ యువ వికాసం, సన్న బియ్యం ఇలా ప్రతి ఇంటికి వేలల్లో రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రతి ఇంటికి, ప్రతి ఊరికి ప్రభుత్వం ఖర్చు చేసిన వివరాలు లెక్కల తో సహా త్వరలో వెల్లడిస్తాం అన్నారు. ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే పదేళ్లు పాలించిన బి ఆర్ ఎస్ నాయకులు రాష్ట్రాన్ని గాలికి వదిలేసారని, 7 లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిపోయారాని విమర్శించారు. ఆదాయం లేకపోయినా వారు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ మొదటి ఏడాదిలోనే పెద్ద సంఖ్యలో ప్రజల కోసం ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య శాఖకు 11,600 కోట్లు ఖర్చు పెడుతున్నామని రాబోయే రోజుల్లో వైద్య రంగానికి మరింత నిధులు కేటాయిస్తాం అన్నారు. ఇల్లు ఇస్తామని బీఆర్ఎస్ నాయకులు 10 సంవత్సరాల పాటు రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. తమ ప్రజా ప్రభుత్వం ఐదు సంవత్సరాలలో రాష్ట్రంలో ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం అన్నారు. మొదటి సంవత్సరం ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్లు నిర్మిస్తున్నామని, ఇందుకోసం 22,500 కోట్లు కేటాయించామని అన్నారు. అడవి హక్కు చట్టం ద్వారా పట్టా పొందిన రైతులందరికీ ఇందిరా గిరి జల వికాసం ద్వారా ఉచితంగా బోర్లు, పంప్ సెట్లు, సోలార్ విద్యుత్, పామ్ ఆయిల్, అవకాడో మొక్కలు ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. అందులో భాగంగా మొదటి సంవత్సరం స్వయం సహాయక సంఘాలకు 21 వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందజేశాం అన్నారు. రాష్ట్రంలో 90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని వారందరికీ 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం అందిస్తున్నామని తెలిపారు. గతంలో పెద్ద రోగం వస్తే ఇల్లు వాకిలి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండేది అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచామని, అదనంగా కొత్త చికిత్సలను చేర్చామని రాష్ట్ర ప్రజలకు ప్రజా ప్రభుత్వం ఇస్తున్న పెద్ద భరోసా ఇది అన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబానికి వందరోజుల పని కల్పిస్తున్నామని, అదే కుటుంబంలో పిల్లలు చదువుకునేందుకు ప్రపంచ స్థాయి నైపుణ్యం కలిగిన యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభించామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తాం అన్నారు. ఈ పాఠశాల నిర్మాణానికి 11,600 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.




హైదరాబాద్ : కొత్త బార్ అండ్ రెస్టారెంట్లకు తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్? జారీ చేసింది. తెలంగాణలో కొత్త బార్ల అండ్ రెస్టారెంట్లకు జూన్ 6 వ తేది వరకు దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం ఇచ్చింది. కొత్తగా 28 కొత్త బార్ అండ్ రెస్టారెంట్స్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

తెలంగాణలో కొత్తగా బార్ అండ్ రెస్టారెంట్లకు దరఖాస్తు చేసుకొనేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 28 బార్ అండ్ రెస్టారెంట్లకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఒక్కో అప్లికేషన్‌కు ఫీజు రూ. లక్ష రూపాయిలు చెల్లించాలని... ఈ ఫీజు తిరిగి ఇవ్వబడదని తెలిపింది. ఈ మధ్యనే తెలంగాణ రూరల్ ప్రాంతంలో 25 కొత్త బార్లకుఎక్సైజ్ శాఖ అనుమతి ఇచ్చింది.

మూడు నెలల కాలంలో 53 కొత్త బార్ లకు తెలంగాణ ఎక్సైజ్ శాఖ అనుమతి ఇచ్చింది. ఈ అప్లికేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ. 14 కోట్ల రూపాయిల ఆదాయం వచ్చింది. ఇప్పుడు మరో 28 బార్ అండ్ రెస్టారెంట్ దరఖాస్తులకు కూడా ఆదాయం వస్తుందని ఎక్సైజ్ శాఖ అంచనా వేస్తుంది. తెలంగాణలో మొత్తం 1176 బార్లు ఉండగా.. ఇక బార్? అండ్ రెస్టారెంట్లు కొత్త వాటితో కలుపుకొని 1129 ఉన్నాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

# రాహుల్.. మీకు ఆ కంపెనీతో రహస్య ఒప్పందం ఉందా



హైదరాబాద్, మే 14: రేవంత్ సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విరుచుకుపడ్డారు. మిస్ వరల్డ్ పోటీలో పాల్గొంటున్న వారి పర్యటన కోసం పేదల ఇళ్లు కూల్చుతున్నారంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ విధానంపై ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పలు ప్రశ్నలు సంధించారు కేటీఆర్. వరంగల్‌లో కూల్చివేతలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన... అందాల పోటీల కోసం పేదల ఇళ్లను ధ్వంసం చేయడమే ప్రజాపాలననా అంటూ ఫైర్ అయ్యారు. వరంగల్‌లో దారి వెంట ఇళ్ల ధ్వంసంపై కేటీఆర్ మండిపడ్డారు. కూల్చివేతలకు సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేటీఆర్.. దీనికి సంబంధించి రాహుల్ గాంధీకి పలు ప్రశ్నలు సంధించారు. తెలంగాణ ప్రభుత్వ అమానవీయ చర్యలపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'హలో రాహుల్ గాంధీ, బుల్డోజర్ కంపెనీలతో మీకేమైనా రహస్య ఒప్పందం ఉన్నదా. ప్రతిరోజూ పేదల ఇళ్లతో పాటు వారి జీవితాలపై దాడి చేయడం ఏమిటి. అందాల పోటీల కోసం పేదవారి ఇళ్లను ధ్వంసం చేయడమే ప్రజాపాలననా. రూ.200 కోట్ల ప్రజా సొమ్ము ఖర్చుపెట్టి రాజభవనాల్లో విందులు పెట్టడం ప్రజాపాలనా. పేద ప్రజల జీవితాలు రాక్షస బుల్డోజర్ల కింద నలిగిపోతున్నాయి. పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపిస్తున్న సిగ్గులేని కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.


**వరంగల్‌లో పేదల ఇళ్లు ఎందుకు కూల్చుతున్నారు?:** వరంగల్‌లో కూల్చివేతలపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. బుల్డోజర్ కంపెనీలతో ప్రభుత్వం రహస్య ఒప్పందం చేసుకుందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. పేదల ఇళ్లు, దుకాణాలను ఎందుకు కూల్చుతున్నారని.. వారి జీవితాలను బుల్డోజర్ల కింద ఎందుకు నలిపేస్తున్నారని ఆయన నిలదీశారు.

# ఏపీ మద్యం కుంభకోణం.. గోవిందప్ప బాలాజీని కోర్టులో హాజరు పరిచిన సిట్



విజయవాడ: వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీని సిట్ అధికారులు ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్యపరీక్షల అనంతరం కోర్టుకు తరలించారు. ఈ కేసులో గోవిందప్ప బాలాజీ ఏ33గా ఉన్నారు. మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన రూ.వేల కోట్ల ముడుపుల సొత్తును డొల్ల కంపెనీలకు మళ్లించి 'అంతిమ లబ్ధిదారు'కు చేర్చడంలో గోవిందప్ప క్రియాశీలక పాత్ర పోషించారు. ఆయన మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు అత్యంత సన్నిహితుడు. జగన్ సతీమణి భారతి తరఫున ఆర్థిక వ్యవహారాలన్నీ చూస్తుంటారు. నెల రోజులుగా పరారీలో ఉన్న గోవిందప్ప బాలాజీ కోసం మూడు రాష్ట్రాల్లో గాలించిన సిట్ బృందాలు.. కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లోని చామరాజనగర జిల్లా బీఆర్‌హిల్స్ అటవీ ప్రాంతంలో ఉన్నారని గుర్తించి అక్కడే మాటు వేశాయి. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఎరకనగడ్డె కాలనీలోని ఓ వెల్‌నెస్ సెంటర్ బయట ఆయన్ను అరెస్ట్ చేశాయి. ట్రాన్సిట్ వారంట్ నిమిత్తం ఆయన్ను ఎలందూరు కోర్టులో హాజరుపరిచారు. అనంతరం విజయవాడకు తీసుకొచ్చి నేడు ఇక్కడి న్యాయస్థానంలో హాజరుపరిచారు. బాలాజీ అరెస్టుతో ఈ కుంభకోణంలో అసలైన కుట్రదారులు, సూత్రధారుల పేర్లు బయటకొచ్చే అవకాశం ఉంది.





# హైదరాబాద్ నడిబొడ్డున.. మాజీ సీఎం రోశయ్య కాంస్య విగ్రహం

తెలంగాణ రాజధాని హైదరాబాద్ నడిబొడ్డున మాజీ సీఎం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రోశయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు లక్డీకపూల్‌లో మాజీ ముఖ్యమంత్రి, దివంగత కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఈ మేరకు లక్డీకపూల్‌లో మెట్రో స్టేషన్ సమీపంలోని చౌరస్తాలో తొమ్మిది అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు కోసం బిడ్‌లు ఆహ్వానిస్తూ టెండర్ నోటిఫికేషన్ ప్రకటన విడుదల చేశారు. కాగా జూలై 4న మాజీ సీఎం రోశయ్య జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించాలని జీహెచ్ఎంసీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా దీనికి సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.




# 'ఆపరేషన్ సిందూర్'పై దుష్ప్రచారం.. భారత్‌లో గ్లోబల్ టైమ్స్ ఖాతా బ్లాక్

చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని మీడియా సంస్థ గ్లోబల్ టైమ్స్‌కు చెందిన ఎక్స్ ఖాతాను భారత్ నిలిపివేసింది. ఆపరేషన్ సిందూర్ గురించి అసత్య సమాచారాన్ని ప్రచురిస్తుందని పేర్కొంటూ దానిని బ్లాక్ చేసింది. ఆ ఖాతాను ఓపెన్ చేయగానే అకౌంట్ విత్‌హెల్డ్ అని కనిపిస్తోంది. అలాగే మరో చైనా మీడియా సంస్థ షిన్హువా సామాజిక మాధ్యమ ఖాతాను కూడా నిలిపివేసింది. అంతేగాకుండా తుర్కియేకు చెందిన 'టీఆర్‌టీ వరల్డ్'ను ఎక్స్ అకౌంట్‌పై కూడా వేటు వేసింది. పహల్గాం ఉగ్రదాడికి ఆపరేషన్ సిందూర్‌తో భారత్ బలగాలు బదులు ఇచ్చాయి. పాక్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. మన మిలిటరీ ఆపరేషన్‌పై గ్లోబల్ టైమ్స్ కవరేజ్‌ను ఉద్దేశించి చైనాలోని భారత దౌత్య కార్యాలయం ఇప్పటికే స్పందించింది. డియర్ గ్లోబల్ టైమ్స్ అంటూ నేరుగా పోస్టు పెట్టింది. ఈరకమైన తప్పుడు సమాచారాన్ని ప్రచురించే ముందు వాస్తవాలను ధ్రువీకరించుకోవాలని సిఫారసు చేస్తున్నామని రాసుకొచ్చింది. "ఆపరేషన్ సిందూర్ విషయంలో పాకిస్థాన్ అనుకూల ఖాతాలు నిరాధార కథనాలు వ్యాప్తి చేస్తున్నాయి. ధ్రువీకరణ లేకుండా సమాచారాన్ని షేర్ చేయడం బాధ్యతారాహిత్యాన్ని ప్రతిబింబిస్తుంది" అని పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో నెట్టింట్లో చక్కర్లు కొట్టిన అసత్య ప్రచారానికి ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఎప్పటికప్పుడు చెక్ పెట్టింది. ఫ్యాక్ట్‌చెక్ చేస్తూ వాస్తవాలను బయటపెట్టిన సంగతి తెలిసిందే.

# ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట



దిల్లీ: ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. మొయినాబాద్ వద్ద ప్రైవేటు భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్న కేసులో ఆయనకు సర్వోన్నత న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. మొయినాబాద్ భూ వ్యవహారంలో గతంలో తెలంగాణ హైకోర్టు జీవన్‌రెడ్డి పిటిషన్‌ను కొట్టేసి, దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పును ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. సర్వోన్నత న్యాయస్థానంలో విచారణ సందర్భంగా.. ఈ వ్యవహారంలో జీవన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు బెయిల్ మంజూరు చేశారని ఆయన తరఫు న్యాయవాది పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయస్థానం దర్యాప్తునకు పూర్తిగా సహకరించాల్సిందనని స్పష్టం చేసింది. జస్టిస్ పార్థివాలా ధర్మాసనం ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ తుది ఉత్తర్వులు ఇచ్చింది. దర్యాప్తునకు సహకరించకపోతే విచారణాధికారులు తగిన చర్యలు తీసుకునే వెసులుబాటును సుప్రీంకోర్టు కల్పించింది.



## ఓరుగల్లులో అందాల భామల సందడి

వరంగల్: మిస్ వరల్డ్ 2025 పోటీల్లో పాల్గొనే సుందరీమణులు చారిత్రక ఓరుగల్లు నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా అతిథులకు తెలంగాణ సంప్రదాయం ప్రకారం బతుకమ్మ, మేళతాళాలతో స్వాగతం పలికారు. రామప్ప ఆలయం వద్ద చీరకట్టులో మెరిసిన అందాల భామలు గ్రూప్ ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. అనంతరం రామప్ప ఆలయ విశిష్టతను టూరిజం గైడ్లు వారికి వివరించారు. అంతకుముందు హరిత కాకతీయ వద్ద మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు రెండు బృందాలుగా ఏర్పడి వరంగల్ నగరంలో పర్యటిస్తున్నారు.

# దమ్ముంటే.. 'స్థానిక' ఎన్నికలు జరపండి..

## – మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్: ప్రభుత్వానికి దమ్ముంటే లోకల్ బాడీ ఎన్నికలు జరిపించాలని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బుధవారం జల్పల్లి మున్సిపాలిటీ పహాడిషరీఫ్?లోని ప్రీమియర్ ఫంక్షన్ హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను 380 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి కష్టం వస్తే ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు ఈ ప్రభుత్వం ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. కానీ ఇవాళ ఆ హామీలను పూర్తిగా విస్మరించి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిందన్నారు. ఇప్పటికీ ప్రజల్లో వెళ్లే ధైర్యంలేక లోకల్ బాడీ ఎన్నికల నిర్వహణను వాయిదా వేస్తోందన్నారు. దమ్ముంటే వెంటనే ఎన్నికలు పెట్టాలని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మండిపడ్డారు. కార్యక్రమంలో బాలాపూర్ మండల తహసీల్దార్ ఇందిరాదేవి, జలపల్లి మున్సిపాలిటీ కమిషనర్ వెంకట్రామ్ రామ్, మాజీ కౌన్సిలర్లు, షేక్ ఆఫ్జల్, మాజీ చైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ చైర్మన్ యూసుఫ్ పటేల్, పల్లపు శంకర్, హాసన్ షా, బీఆర్ఎస్ నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, మహిళలు పాల్గొన్నారు.


# విప్లవ అమర వీరుడు సుఖ్‌దేవ్ - మే 15...సుఖ్‌దేవ్ జయంతి




భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ముగ్గురు అమర వీరుల త్యాగం మరువ లేనిది. పంజాబ్ కేసరి బిరుదాంకితులైన, ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు లాలా లజపత్ రాయ్ సైమన్ కమీషన్ కు వ్యతిరేకంగా లాహోర్ లో జరిగిన నిరసన ఊరేగింపులలో ఇంగ్లీషు పోలీసు సూపరింటెండెంట్ జేమ్స్ ఏ స్కాట్ చేతిలో ఘోరంగా లాఠీ దెబ్బలు తిని, 1928 నవంబరు 17న మరణించారు. ఈ క్రమంలో లజపత్ రాయ్ హత్యకు ప్రతీకారంగా, స్కాట్ ను హతమార్చే వ్యూహం అమలులో పొరపాటున స్కాట్ అనుకుని జె.పి.సాండర్స్ ను హత మార్చినందుకు గాను ముగ్గురికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు. భగత్ సింగ్, రాజ్‌గురు తో పాటు సుఖ్ దేవ్ థాపర్ ను 1931 మార్చి 23న లాహోరు సెంట్రల్ జైలులో సాయంకాలం ఉరి తీశారు. అలా ఆ ముగ్గురు త్యాగ మూర్తులు అమరులైనారు. సుఖ్ దేవ్ థాపర్ (15 మే 1907 – మార్చి 23, 1931) భారత స్వాతంత్ర్య సమర, ఉద్యమ కారుడు. ఆయన భగత్ సింగ్, రాజ్‌గురుల సహచరుడు. సుఖ్ దేవ్ హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అనే సంస్థలో ముఖ్యమైన నాయకుడు. లాహోర్ నేషనల్ కాలేజీలో భారత పురాతన ఔన్నత్యాన్ని అధ్యయనం చేయడానికి, ప్రపంచ విప్లవ పరిణామాలు పరిశీలించడానికి ఒక అధ్యయన కేంద్రాన్ని (స్టడీ సర్కిల్) ప్రాంభించాడంటారు. తన సహచరులైన భగత్ సింగ్ , కామ్రేడ్ రామచంద్ర, భగవతీ చరణ్ వోహ్రా లతో కలిసి లాహోరులో "నవ జవాన్ భారత సభ" ప్రారంభించాడు. దేశ స్వాంతంత్ర్యానికి యువతను ఉత్తేజితులను చేయడం, ప్రజలలో హేతు వాదాన్ని పెంపొందించడం, మత వైషమ్యాలను నిరోధించడం, అంటరానితనాన్ని అరికట్టడం ఆ సంస్థ ఆశయాలు. పండిట్ రామప్రసాద్ బిస్మిల్, చంద్రశేఖర ఆజాద్‌ల ప్రభావం సుఖదేవ్‌పై బలంగా ఉండేది. ఖైదీల పట్ల చూపుతున్న అమానుష విధానాలకు వ్యతిరేకంగా 1929లో జరిగిన నిరాహార దీక్షలో సుఖదేవ్ పాల్గొన్నాడు. 1927లో భారత దేశానికి వచ్చిన సైమన్ కమిషన్ లో ఒక్క భారతీయుడైనా లేనందుకు నిరసనగా, ఉద్యమంలో లాలా లజపత్ రాయ్ కీలక పాత్ర వహించి, సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలి అంటూ పంజాబ్ అసెంబ్లీలో ఆయన తీర్మానం పెట్టి గెలిపించారు. ఇది ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. అక్టోబర్ 30, 1928న ఆ కమిషన్ లాహోర్ రాగా, లాల్‌జీ కూడా అహింసతో, మౌనంగా సైమన్ వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌనంగా ఉద్యమిస్తున్న వారిపైన కూడా లాఠీ చార్జికి ఆదేశించాడు పోలీసు సూపరింటెండెంట్ జేమ్స్ ఏ స్కాట్. తను స్వయంగా లాల్‌జీ మీద దాడి చేసి, లాల్‌జీ ఛాతీ మీద లాఠీతో స్కాట్ తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలతోనే లాల్‌జీ నవంబర్ 17న చనిపోయాడు. ఈ సంఘటనను కళ్లారా చూసిన భగత్ సింగ్ ప్రతీకారం తీర్చు కోవాలని నిర్ణయించు కున్నాడు. పోలీసు అధికారి స్కాట్‌ను హత మార్చడానికి విప్లవ కారులు శివరామ్ రాజ్‌గురు, జై గోపాల్, సుఖ్‌దేవ్ థాపర్ లతో భగత్ సింగ్ చేతులు కలిపాడు. డీఎస్పీ జే. పీ. సాండర్స్ కనిపించినప్పుడు పొరపాటుగా స్కాట్ అనుకుని, జైగోపాల్ ఆయనను కాల్చమంటూ సింగ్‌కు సంకేతాలిచ్చాడు. ఫలితంగా స్కాట్‌కు బదులు సాండర్స్ హతమయ్యాడు. ఫిరోజ్ పూర్లో బ్రిటిష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హత మార్చినందుకు గాను వారికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు. భగత్ సింగ్ సహా ముగ్గురికి ఉరిశిక్ష ఖరారు చేసిన తీర్పు వివరాలను ప్రచురించారు. 'Warrant of Execution On Sentence Of Death' అనే విడుదల చేసిన పత్రంలో 1930 అక్టోబర్ 7వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పిచ్చినట్లు స్పష్టంగా ఉంది. 1931, మార్చి 23న ఉరిశిక్ష అమలు చేసినట్లు మరో పత్రంలో వివరాలు ఉన్నాయి. జైలు సూపరింటెండెంట్ సంతకం చేసిన పేపర్‌ను టైమ్స్ ఫ్యాక్ట్ చెక్ గుర్తించి బహిర్గతం చేసి, లాహోర్ లోని పంజాబ్ శాఖలో ఈ పత్రాలను ఇటీవల ప్రదర్శనకు ఉంచారు. 1930 అక్టోబర్ 7 న న్యాయ స్థానము తీర్పును వెలువరించింది. తీర్పు 281 పేజీల్లో ఇవ్వబడింది. విచారణ ఎదుర్కొన్న వారందరికీ వివిధ శిక్షలు ఇవ్వబడ్డాయి. ఉరిశిక్ష: 1.భగత్ సింగ్ 2. సుఖ్ దేవ్ 3. రాజగురులకుబీ అలాగే ఆజన్మాంతర జీవిత ఖైదు: 1.కిశోరీ లాల్ 2. మహావీర్ సింహ (అండమాన్లో 9 రోజులు నిరాహార దీక్ష చేసి అమరుడయ్యాడు. 3. విజయ్ కుమార్ సింహ 4. శివవర్మ 5. గయా ప్రసాద్ 6. జయ దేవ్ కపూర్ 7. కమల్ నాథ్ తివారి లకుబీ అలాగే జీవిత ఖైదు: 1.కుందాన్లాల్ ( 7 సంవత్సరాలు) 2. ప్రేమదత్ ( 5 సంవత్సరాలు)లకుబీ అలాగే అజయ్ ఘోష్, సురేంద్రనాథ్ పాండియ ఇంకా జితేంద్రనాథ్ సన్యాల్ లను విడిచి పెట్టారు. విచారణలో ఉన్న వారందరూ కోర్టులను బహిష్కరించడం వలన తీర్పును లాహోర్ లోని సెంట్రల్ జైలులో వినిపించారు. తమను యుద్ధ ఖైదీలుగా గుర్తించడం ద్వారా ఉరి తీయ కుండా కాల్పుల బృందం చేత హత మార్చాలని జైలులో ఉన్నప్పుడు భగత్ సింగ్ , మరో ఇద్దరు వైస్రాయికి లేఖ రాశారు. క్షమాభిక్ష ముసాయిదా లేఖపై సంతకం కోసం భగత్ సింగ్ మిత్రుడు ప్రన్నత్ మెహతా ఆయనను ఉరి తీయడానికి నాలుగు రోజుల ముందు మార్చి 20న జైలులో కలిశాడు. అయితే సంతకం చేయడానికి సింగ్ నిరాకరించాడు. మార్చి 23న ఉరి తీసినట్లు జైలు అధికారులు మరణ ధ్రువీకరణ పత్రాన్ని విడుదల చేశారు. అప్పటి సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ వి.ఎన్. స్మిత్ ప్రకారం, భగత్ సింగ్‌ను ముందుగానే ఉరితీశారు. సాధారణంగా ఉదయం 8 గంటలకు ఉరి తీసేవారు. అయితే ఏమి జరిగిందో ప్రజలు తెలుసుకునే లోగానే ఆయన్ను ఉరితీయాలని నిర్ణయించుకుని... సుమారు రాత్రి 7 గంటల ప్రాంతంలో ఉరి తీశారు. తాపర్ సుఖ్ దేవ్, శివరామ్ రాజ్‌గురు లను లాహోర్ సెంట్రల్ జైలులో తర్వాత ఉరి తీశారు. వారి మృత దేహాలను సట్లెజ్ నది ఒడ్డున రహస్యంగా దహనం చేశారు. సుఖ్ దేవ్ ను ఉరి తీయడానికి ముందు, ఆయన మహాత్మా గాంధీకి ఒక లేఖ వ్రాశాడు. విప్లవ మార్గంలో ఉద్యమిస్తున్న వారిపట్ల మహాత్మా గాంధీ అనుసరిస్తున్న ప్రతికూల ధోరణిని ఈ లేఖలో సుఖ్ దేవ్ విమర్శించాడు. సుఖ్ దేవ్‌కు ఉరి శిక్ష వేయడానికి ఆధారమైన ప్రధాన సాక్ష్యం హంసరాజ్ వోహ్రా ఇచ్చాడు. అయితే సుఖ్ దేవ్ స్వయంగా తన నేరాన్ని అంగీకరించాడని వోహ్రా వివరించాడు. ముగ్గురు త్యాగధనుల వీర మరణాలు వృథా కాలేదు, ఎందరో యువకులను భారత స్వాతంత్ర్యో ద్యమము వైపుకు మరల్చింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అపర భగీరథుడు ఆర్ధర్ కాటన్ - మే 15... సర్ ఆర్ధర్ కాటన్ జయంతి



"నిత్య గోదావరీ స్నాన పుణ్యదోయోమహామతిః, స్మరామ్యాంగ్లేయ దేశీయం కాటనుం తం భగీరథం" ఆంధ్ర ప్రదేశ్ లోని ఉభయ గోదావరి నదీ తీర వాసులు గోదావరీ స్నానాల సమయంలో సంకల్పం చేసేప్పుడు పఠించే సాంప్రదాయం ఆచరిస్తారు. అపర భగీరుథుడైన ఆంగ్లేయ ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్ కారణంగా తాము నిత్యం ఉదయాన్నే గోదావరి స్నానమా చరించే భాగ్యం కలిగిందన్నది దాని సారాంశం. కేవలం గోదావరి స్నానమాచరించే అవకాశమే కాదు, తమ జీవితాల్లో సమూల మార్పులకు మూలం ఆర్థర్ కాటన్ ఆలోచనే అని గోదావరి తీర వాసులు నేటికీ విశ్వసిస్తారు. అందుకు అనుగుణంగా ఆయనను నిత్యం తమ పూజా మందిరంలో కొలిచేవాళ్లు, తమ ఇంటి వద్ద, సమీపాలలో కాటన్ మహాశయుని విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఆరాధించేవాళ్లు చాలామంది కనిపిస్తారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రగతిలో అనేక అంశాలలో గోదావరి, కృష్ణా తీరం ముందు ఉండడంలో కాటన్ శ్రమ ఉందని భావించక తప్పదు. కాటన్ దొర అని గోదావరి ప్రజలు అభిమానంగా పిలుచుకొనే జనరల్ సర్ ఆర్థర్ కాటన్ (మే 15, 1803 – జూలై 24, 1899) బ్రిటిషు సైనికాధికారి, నీటిపారుదల ఇంజనీరు. కాటన్ తన జీవితాన్ని బ్రిటిషు భారత సామ్రాజ్యములో నీటిపారుదల, నావికాయోగ్యమైన కాలువలు కట్టించడానికి జీవితాన్ని ఫణంగా పెట్టిన మేధావి, కార్యశీలి. కాటన్ 15 ఏళ్ల వయసులో ఈస్ట్ ఇండియా కంపెనీ ఇంజనీరింగు సర్వీసుల్లో చేరి శిక్షణ పొందారు. 1819లో రాయల్ ఇంజనీర్స్ దళంలో సెకండ్ లెఫ్టినెంట్‌గా నియమితుడైన ఆయన విధి నిర్వహణలో భాగంగా 18 ఏళ్ల వయసులో భారత దేశానికి వచ్చి మొదటిసారిగా మద్రాస్‌లో ఉద్యోగిగా పనిచేశారు. అక్కడి నుంచి ఈస్ట్ ఇండియా కంపెనీ తరుపున దక్షిణ భారత చెరువుల శాఖకు ఇంజనీర్‌గా నియమితులయ్యారు. ఆ సమయంలో 1828–29 మధ్య కాలంలో కావేరీ నది వరద సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేశారు. కరువు పీడిత ప్రాంతం గోదావరి డెల్టాగా రూపాంతరం చెందడంలో ధవళేశ్వరం వద్ద నిర్మించిన ఆనకట్ట ప్రధాన పాత్ర పోషించింది. అప్పటి జిల్లా అధికారిగా ఉన్న సర్ హెన్రి మౌంట్ పంపించిన నివేదిక ఆధారంగా ఆనకట్ట నిర్మాణం ఆలోచన తెరమీదకు వచ్చింది. ఆర్థర్ కాటన్ అనే ఇంజనీరుకు సదరు ప్రతిపాదన అప్పగించి, సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని బ్రిటీష్ ప్రభుత్వం అప్పగించడంతో ఆయన అందుకు అనువైన ప్రాంతం కోసం సుదీర్ఘ అన్వేషణ చేశారు. అలా 1840లోనే కృష్ణా నదిపై ఆనకట్ట నిర్మాణ సాధ్యాసాధ్యాలపై ఆయన రూపొందించి, ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను అప్పటి మద్రాసు గవర్నరు మార్కస్ ట్వేల్ డేల్ ఆమోదించారు. లండన్‌లోని బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఆమోదానికి పంపించారు. ప్రాజెక్టు రిపోర్టును పరిశీలించిన తర్వాత, 1846 ధవళేశ్వరం వద్ద గోదావరిపై ఆనకట్టను కాటన్ ఆధ్వర్యంలో నిర్మించేందుకు లండన్ నుంచి అనుమతి లభించింది. 1847 ఏప్రిల్ నెలలో ఆనకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆనకట్ట నిర్మాణంలో పది వేలమంది కూలీలతో పాటుగా ఐదు వందల మంది వడ్రంగులు, ఐదు వందల మంది కమ్మరులను వినియో గించారు. ధవళేశ్వరం వద్ద గోదావరి సుమారుగా 6 కి.మీ. వెడల్పు ఉంటుంది. 1847 అగస్టు మూడో వారంలో రైల్వే వ్యాగన్ల ద్వారా ఉక్కు, రాయిని ధవళేశ్వరానికి తరలించారు. దాంతో యంత్ర సామాగ్రితో నిర్మాణపు పనులు ముమ్మర మయ్యాయి. నది ఒడ్డుకు చేర్చిన రాళ్లు, ఇతర సామగ్రిని పడవల ద్వారా నదిలోని నిర్మాణ ప్రాంతానికి రవాణా చేసేవారు. ఇందుకు 25 టన్నుల భారం మోయగల 18 నావలను వినియోగించారు. కాటన్ కు కూలీలతో పాటుగా ఇంజనీర్లయిన భారతీయులు కూడా కొందరు తోడుగా ఉన్నారు. వారిలో తొలి నాటి ఇంజనీర్లలో ఒకరైన రాజ్ బహదూర్ వీణం వీరన్న కూడా ఉన్నారు. కాటన్ పర్యవేక్షణలో ఈ ఆనకట్టను వేగంగా పూర్తి చేశారు. తర్వాత 1852 గన్నవరం అక్విడక్టు పనులు కూడా కాటన్ ప్రారంభించారు. ఐదేళ్ల లోనే నిర్మాణం జరగడంతో 1852 నాటికి అందుబాటు లోకి వచ్చింది. ధవళేశ్వరం వద్ద ప్రస్తుతమున్న సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌కి పూర్వ రూపంగా ఆనకట్ట ఉండేది. అనేక వరదల తాకిడికి ఆనకట్ట దెబ్బ తినడంతో చివరకు 1970వ దశకంలో కొత్తగా బ్యారేజ్ నిర్మాణం చేశారు. 20వ శతాబ్దం తొలినాళ్లలోనే ఆయా ప్రాంతాల్లో వెనువెంటనే ఆరు లక్షల ఎకరాల భూమి సాగు కిందికి రావడం తో పాటు, పారిశ్రామి కాభివృద్ధి, విస్తారంగా పంటలు, రవాణా సదుపాయాలు ధవళేశ్వరం ఆనకట్ట ద్వారా గోదావరి జల ప్రవాహం ద్వారా లభించాయి. కృష్ణానదిపై విజయవాడ వద్ద ఆనకట్టకు ప్రోద్బలం కూడా కాటన్ దే. ఆయన బెంగాల్, ఒడిసా, బీహారు, మొదలైన ప్రాంతాల నదులను మానవ ఉపయోగం చేయడానికి ఎన్నో పరిశోధనలు, పరిశీలనలు చేశాడు. తెలుగు వారే కాదు తమిళులు, ఒరియాలు, బెంగాలీలు, ఒరియాలు, బీహారీలు మొత్తం భారతీయులే ఆయనకు ఎంతో రుణ పడి ఉంటారు. తమపాలిట దుఖఃదాయినిగా ఉన్న గోదావరిని, ప్రాణదాతగా మార్చిన ఆర్థర్ కాటన్... అపర భగీరథునికి, ప్రాతః స్మర స్మరణ చేయడం తప్ప ఏమిచ్చుకో గలరు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ముక్తి దాయకం... పుష్కర స్నానం

## - 12 రోజులపాటు సార్ధ త్రికోటి సహిత సరస్వతి నదీ పుష్కరాలు - సరస్వతీ నది పుష్కరాలకు సర్వం సన్నద్ధం





మేషే గంగా వృషే రేవా మిథునేతు సరస్వతీ కర్కటే యమునా ప్రోక్తా సింహే గోదావరీ స్మృతా కన్యాయాం కృష్ణవేణీచ కావేరీ ధటకే స్మృతా వృశ్చికే తామ్రపర్ణీచ చాపే పుష్కర వాహినీ మకరే తుంగభద్రాచ కుంభే సింధునదీ స్మృతా మీనే ప్రణీతా నదీచ గురోస్సంక్రమణే స్మృతా పుష్కరాఖ్యౌ మునీనాంహి బుధై స్మృతా....."దేవగురువగు బృహస్పతి మేష రాశిలో ఉన్నప్పుడు గంగానదికి, వృషభరాశిలో ఉన్నప్పుడు నర్మదా నదికి, మిధున రాశిలో ఉన్నప్పుడు సరస్వతీ నదికి, కర్కాటక రాశిలో ఉన్నప్పుడు యమునా నదికి, సింహరాశిలో ఉన్నప్పుడు గోదావరి నదికి, కన్యారాశిలో ఉన్నప్పుడు కృష్ణా నదికి, తులారాశిలో ఉన్నప్పుడు కావేరి నదికి, వృశ్చిక రాశిలో ఉన్నప్పుడు తామ్రపర్ణి నదికి, ధనూరాశిలో ఉన్నప్పుడు బ్రహ్మపుత్రకు, మకర రాశిలో ఉన్నప్పుడు తుంగభద్రా నదికి, కుంభ రాశిలో ఉన్నప్పుడు సింధు నదికి, మీన రాశిలో ఉన్నప్పుడు ప్రణీతా నదికి, పుష్కరాలు చెప్పబడ్డాయి.పుష్కరం అనగా జల స్వరూపం జలాది దేవతగా సమస్త తీర్థములకు నెలవై ఉండి తీర్థరాజు అను పేరుతో లోక కళ్యాణ కారకు డైనట్లు శాస్త్రములు తెలుపు తున్నాయి. పూర్వము తుందిలుడనే బ్రహ్మణోత్తముడు మహేశ్వరుని గూర్చి తపస్సు చేసి తన అష్ట–మూర్తులతో ఒకటైన జల స్వరూపముతో పుష్కరుడు అను నామముతో పరమ శివుని ఐక్యమై ఉండుటకు వరము పొంది, పరమేశ్వరుని సాయుజ్యము పొంది ఉండగా బ్రహ్మదేవుడు సృష్టిని శక్తివంతము చేయుటకై శివుని వరముతో ఆ పుష్కరుని స్వీకరించి, తన కమండలము నందు ఉంచుకొని సృష్టి కార్యం నిర్వహిస్తుండగా, బృహస్పతి బ్రహ్మను వేడుకొని ఆ పుష్కరుని తన వెంట ఉండుటకై వరమును కోరెను. గ్రహాధి పత్యమును, ముక్కోటి దేవతలకు గురువుగాను ఆపుష్కరుని సన్నిదిని శక్తి వంతుడై యుండునట్లు కొరుకొనగా పుష్కరుడు బ్రహ్మను వీడి రాకకు సమ్మతించక పోగా బ్రహ్మదేవుడు, ఆ పుష్కరుని కోరికపై ముక్కోటి దేవతలతో మూడున్నర కోట్ల తీర్థములతో, మహర్షులతో, ఆ పుష్కరుని వెంట ఉండి, బృహస్పతి, ఆయా రాసులలో (మేషాది రాసులలో) చరించు చున్నప్పుడు ఆయా నదులకు (మేషేచ – గంగా) అను సూత్రాను సారం పుష్కరాలు నిర్వహిస్తారు. ప్రతి నదికి ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి పన్నెండు రోజులపాటు పుష్కరా లను ఎంతో వైభవంగా నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా 2025 మే 15 నుంచి మే 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు నిర్వహిస్తారు. సరస్వతీ నది హిందూ పురాణాలలో ఒక ముఖ్యమైన నది. ఋగ్వేదంలో ఈ నదిని ఎంతో పవిత్రంగా కీర్తించారు. తూర్పున యమునా నది, పశ్చిమాన శతద్రూ నది దీనికి సరిహద్దులుగా ఉండేవి. అయితే, మహాభారత కాలానికి ఈ నది ఎండిపోయినట్లు చెబుతారు. ప్రస్తుతం సరస్వతి పేరుతో ఒక చిన్న నది ఘగ్గర్ నదికి ఉపనదిగా ప్రవహిస్తోంది. చాలా మంది పండితులు ప్రాచీన సరస్వతీ నది ఇదే అయి ఉండవచ్చని భావిస్తున్నారు. సరస్వతీ దేవి తొలుత నదీ దేవతగా ఆరాధింపబడి, తరువాత విద్యా, జ్ఞాన, సంగీత, కళల అధిదేవతగా గుర్తింపు పొందింది. హిందువులు సరస్వతీ నదిని అంతర్వాహినిగా భావిస్తారు. గంగా, యమునా నదుల సంగమమైన త్రివేణి సంగమంలో సరస్వతి కూడా కలిసి ఉంటుందని విశ్వసిస్తారు.సరస్వతీ పుష్కరాల సమయంలో భక్తులు అనేక పవిత్ర కార్యకలాపాలలో పాల్గొంటారు. ధ్యానం చేయడం, సాంప్రదాయ ఆచారాలను పాటించడం, ప్రార్థనలు చేయడం, పవిత్ర స్నానాలు ఆచరించడం వంటివి ముఖ్యమైనవి. ఈ సమయంలో నదిలో స్నానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని, పాపాలు తొలగిపోతాయని భక్తులు నమ్ముతారు. 2025లో జరగబోయే సరస్వతీ పుష్కరాలు బద్రీనాథ్ సమీపంలోని మానా గ్రామంలో ముఖ్యంగా జరగనున్నాయి. ఇక్కడ ఈ నది అలకనంద నదిలో కలుస్తుంది. అలాగే ప్రయాగరాజ్ లో కూడా త్రివేణీ సంగమంలో పుష్కరాలు నిర్వహిస్తారు. అయితే, తెలంగాణ రాష్ట్రంలో కూడా సరస్వతీ పుష్కరాలను నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు. కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరంలో ఈ పుష్కరాలు జరగనున్నాయి. కాళేశ్వర క్షేత్రానికి ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడ గోదావరి, ప్రాణహిత నదులు సంగమిస్తాయి. ఈ సంగమ స్థానంలోనే అంతర్వాహినిగా సరస్వతీ నది కూడా కలుస్తుందని నమ్ముతారు. అందుకే కాళేశ్వరాన్ని దక్షిణ కాశిగా పిలుస్తారు. ఇక్కడ శివలింగంతో పాటు యమలింగం కూడా ఉండటం విశేషం. పూర్వం యముడు మనుషుల పాపాలను తొలగించి వారికి ముక్తిని ప్రసాదించమని శివుడిని ప్రార్థించగా, శివుడు ఆ కోరికను మన్నించాడు. అందువల్ల ఇక్కడ ఒకే ప్రాణమట్టంపై రెండు లింగాలు కొలువై ఉన్నాయి. కాళేశ్వరంలో సరస్వతీ నది గుప్త కామినిగా ప్రవహిస్తుందని చెబుతారు. ఆలయంలో శివలింగంపై పోసిన నీరు, ఆ లింగంలోని నాసికా రంధ్రాల ద్వారా భూమార్గంలో ప్రవహించి గోదావరి, ప్రాణహిత నదులతో కలుస్తుంది. అందుకే ఇక్కడ సరస్వతీ పుష్కరాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కాళేశ్వరం పెద్దల పిండ ప్రదానానికి కూడా ముఖ్యమైన క్షేత్రం. కాశీకి వెళ్లలేని వారు ఇక్కడ గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. ఇది కాశీలో జరిపినంత పుణ్యప్రదమని విశ్వసిస్తారు. అలాగే, కాళేశ్వరంలో దక్షిణ భారతదేశం లోనే అరుదైన సరస్వతీ దేవి ఆలయాలలో ఒకటి ఉంది. మరొక అరుదైన సూర్య దేవాలయం కూడా ఇక్కడే కొలువై ఉండటం విశేషం. పచ్చని ప్రకృతి మధ్య నెలకొని ఉన్న ఈ క్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది.మొత్తం మీద, సరస్వతీ నదీ పుష్కరాలు ఒక పవిత్రమైన సందర్భం. ఇది నదీమాతకు కృతజ్ఞతలు తెలుపుకునే సమయం, ఆధ్యాత్మిక చింతనకు, పవిత్ర స్నానాలకు ప్రాధాన్యతనిచ్చే సమయం. కాళేశ్వరం వంటి క్షేత్రాలలో ఈ పుష్కరాలను నిర్వహించడం ఆ ప్రాంతానికి మరింత పవిత్రతను చేకూరుస్తుంది. భక్తులు ఈ సమయంలో పాల్గొని పుణ్యం పొందాలని ఆశిస్తారు. సరస్వతీ నది కేవలం ఒక నీటి ప్రవాహం కాదు, అది జ్ఞానానికి, వివేకానికి, పవిత్రతకు చిహ్నం. ఈ పుష్కరాల సమయంలో ఆ నదిలో స్నానం చేయడం ద్వారా భక్తులు తమ అంతరంగిక శుద్ధిని పొందుతారని విశ్వసిస్తారు. ఈ పవిత్రమైన కార్యక్రమంలో పాల్గొనడానికి భక్తులు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివస్తారు. సరస్వతీ నదీ పుష్కరాలు ముక్తిని ప్రసాదించే ఒక గొప్ప అవకాశం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# శాంతి చర్చల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ సిద్ధమే!

**(మొదటి పేజీ తరువాయి)**కర్రెగుట్టల్లో ప్రభుత్వ సాయుధ బలగాలు పాశవికంగా నిర్వహించిన హత్యాకాండలో 22 మంది కామ్రేడ్స్ అమరులయ్యారని అభయ్ పేర్కొన్నారు. దీంతో కర్రెగుట్టల ఆపరేషన్ లో అమరులైనవారి మా కామ్రేడ్స్ సంఖ్య 26కు చేరుకుందని, ఒక వైపు చర్చల ప్రక్రియ కొనసాగుతుండగా ఈ విధంగా హత్యాకాండ కొనసాగించడాన్ని తీవ్రంగా ఖండించాల్సిందిగా దేశవాసులకు, ప్రజాస్వామికవాదులకు విజ్ఞప్తి చేశారు. నిజానికి తుపాకులు పట్టుకునే వారిని కాల్చిచంపే అధికారాన్ని ఏ చట్టమూ ప్రభుత్వానికి ఇవ్వలేదని, ఈ వాస్తవాన్ని వారు కప్పిపెట్టేందుకు, సత్యాన్ని తలకిందులు చేసేందుకు పడరాని పాట్లు ఎందుకు పడుతున్నారో వారికే తెలియాలని, కానీ ఇందులో వారు ఎన్నడూ సఫలం కాలేరని పేర్కొన్నారు. ఇక మేము ఆయుధాలను వదిలిపెట్టి జనజీవన స్రవంతిలో కలిసే విషయానికి వస్తే ఈ విషయంపై మా పార్టీలో ఏ ఒక్కరో నిర్ణయం తీసుకోలేరని, మా పార్టీ ప్రజాస్వామికంగా పని చేసే పార్టీ అని, ఆపరేషన్ కగార్ లో లక్షలాది మంది పోలీసు, పారామిలిటరీ, కమాండో బలగాలు మా ఉద్యమ ప్రాంతాలను చుట్టిముట్టి వున్న స్థితిలో మా పార్టీలో కనీసం కోర్ అయినా సమావేశమై ఈ విషయంపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం లేకుండా పోతోందని పేర్కొన్నారు.

అందువల్లనే సమయావధితో కూడిన కాల్పుల విరమణను నేను ప్రతిపాదించానని, ప్రజలకు గానీ, మా పార్టీ కేడర్లకు గానీ రక్షణ లేని పరిస్థితుల్లో ఆయుధాలు విడిచిపెట్టి ప్రభుత్వంతో చర్చలకు రావడం అసాధ్యమని పేర్కొన్నానని, కనుక రెండు పక్షాల నుంచి కాల్పుల విరమణ ప్రకటిస్తే మా పార్టీ కేంద్ర నాయకత్వం / కోర్ కలుసుకుని చర్చించుకుని,అన్ని విషయాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం లభిస్తుందని, ఈ విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్థం చేసుకుని ఇప్పటికైనా సమయావధితో కూడిన కాల్పుల విరమణ ప్రకటించి మా పార్టీతో శాంతి చర్చలకు అంగీకరించాల్సిందిగా కోరుతున్నాట్లు అభయ్ పేర్కొన్నారు.ఈ విషయాన్ని తమ పార్టీ దండకారణ్య ఉత్తర్ – పశ్చిమ్ సబ్ జోనల్ బ్యూరో ఇంచార్జ్ కామ్రేడ్ రూపేష్ పత్రికా ప్రకటనల ద్వారా, లెటర్స్ ద్వారా ఛత్తీస్ గఢ్ ఉపముఖ్యమంత్రి విజయ్ శర్మ కు తెలియజేసాడని,. వీటిపై ఎప్పటికప్పుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షా బ్రీఫింగ్ చేస్తూనే ఉన్నాడని, అయినప్పటికీ ఏవిధంగానైనా తమ పార్టీని మార్చి 31, 2026 నాటికి నిర్మూలించే లక్ష్యంతో ఆపరేషన్ కగార్ ను మోదీ ప్రభుత్వం కొనసాగిస్తున్నదని అభయ్ పేర్కొన్నారు. అయితే ఈ లక్ష్యాన్ని అది సాధించడం అసాధ్యమని ఈ సందర్భంగా మరోసారి స్పష్టం చేస్తున్నానని, కాల్పులు విరమణ చేస్తే మావోయిస్టుల బలపడతారని మోదీ ప్రభుత్వం, గోదీ మీడియా ప్రచారం చేస్తున్నాయని, ఇది వాస్తవం కాదని,ఏ దేశంలోనయినా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలే విప్లవకారులు బలపడేందుకు పునాది కల్పిస్తాయని, సమాజంలో భూమి సమస్య, ఆకలి, పేదరికం, సామాజిక ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, మహిళ సమస్య, దళిత సమస్య (అంటరానితనం), కుల సమస్య, జాతుల సమస్య తదితర మౌలిక సమస్యలున్నంత వరకూ ఈ పునాది ఉంటుందని, ప్రభుత్వ విధానాలు ప్రజలకు అనుకూలంగా ఉంటే విప్లవకారులు బలపడే అవకాశముండదని అభయ్ పేర్కొన్నారు. తమ పార్టీ ముందుకు తెచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరించే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే శాంతి చర్చలు జరపి, సమస్యలకు సరైన పరిష్కారాలను కనుగొని ఒక ఒప్పందానికి వస్తే విప్లవోద్యమ ప్రాంతాల్లో రాజ్యహింసకు, మా సాయుధ పోరాటానికి పునాది లేకుండా పోతుందని, శాంతి చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి మోదీ ప్రభుత్వం సముఖమా, కాదా, స్పష్టం చేయాలని, ఈ సందర్భంగా ఆపరేషన్ కగార్ ను ఆపేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి శాంతి చర్చలు జరపాల్సిందిగా మోదీ ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు ముందుకు రావాల్సిందిగా భారతదేశవాసులకు, విప్లవ, ప్రగతిశీల, ప్రజాస్వామికవాదులకు, శాంతికాముకులకు జర్నలిస్టులకు, సామాజిక సంస్థలకు, కార్యకర్తలకు, ఆదివాసీ శ్రేయోభిలాషులకు, అంతర్జాతీయ విప్లవ, ప్రజాస్వామిక శక్తులకు మావోయిస్టు కేంద్ర పార్టీ విజ్ఞప్తి చేస్తోందని అభయ్ పేర్కొన్నారు.

చురకలు

## సంపాదకీయం

## ఇందిరా...వాజ్ పేయి...మోడీ...

# తేడా ఏమిటి?

ఈ దేశాన్ని ఎందరో ప్రధానులు పాలించారు. ఆధునిక భారతంలో బలమైన ప్రధానులుగా ముగ్గురు మాత్రమే కనిపిస్తారు. వారే శ్రీమతి ఇందిరా గాంధీ, అటల్ బిహారీ వాజ్ పేయ్, నరేంద్ర మోడీ. ఈ ముగ్గురూ అత్యధిక కాలం ఈ దేశాన్ని ఏలిన వారుగా ఉన్నారు. ఇంకా చెప్పాలీ అంటే ప్రధానులుగా మూడు సార్లు ప్రమాణం చేసిన వారు కూడా వీరే కావడం విశేషం. వీరికి మరో సారూప్యత సైతం ఉంది. అదే భారత్ పాకిస్థాన్ ల మధ్య యుద్ధం ఈ ముగ్గురు సమయంలో మూడు సార్లు పాక్ యుద్ధానికి వచ్చింది. ఇందులో అతి పెద్ద యుద్ధంగా 1971లో జరిగిన దానిని చెప్పుకోవాలి. ఆనాడు పాకిస్థాన్ చెవులు మూసి బంగ్లాదేశ్ అన్న ఒక కొత్త దేశాన్ని సృష్టించి ఇందిర పాక్ రెక్కలు విరిచేశారు. అలా ఆమె అపర దుర్గామాత గా ప్రపంచంలోనే ఎనలేని ఇమేజ్ ని సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత 1999లో కార్గిల్ వార్ వచ్చింది. అపుడు బీజేపీ వరిష్ట నేత అటల్ బిహారీ వాజ్ పేయ్. ఆయన కూడా పాక్ పీచమణిచారు. దాయాదితో వచ్చిన యుద్ధంలో గెలుపు రుచి దేశానికి చూపించి హీరో ఇమేజ్ ని సాధించారు. సరిగా పాతికేళ్ళ తరువాత భారత్ ఇండియా మధ్య మరో పరిమిత యుద్ధం వచ్చింది. అది కాస్తా పెద్ద యుద్ధంగా మారే చాన్స్ ఉంది. అయినా ప్రస్తుతం ప్రధానిగా ఉన్న నరేంద్ర మోడీ సమయస్ఫూర్తితో కాల్పుల విరమణ ప్రకటించి యుద్ధాన్ని నివారించారు. అయితే ఇక్కడే చాలా మంది వ్యాఖ్యానాలు చేస్తున్నారు. భారత్ కి మంచి చాన్స్ వచ్చింది. ఈ దెబ్బతో ఇందిరా వాజ్ పేయ్ కంటే మిన్నగా మోడీ తన ఇమేజ్ ని పెంచుకోవచ్చు అని చరిత్రలో నిలిచేలా పాక్ కి గట్టి గుణపాఠం చెప్పవచ్చు అని అంతా అంటున్నారు. నెటిజన్లు అయితే భారత్ కాల్పుల విరమణకు అంగీకరించడాన్ని ఒకింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే మోడీ ప్రభుత్వం దూర దృష్టితో అన్నీ ఆలోచించే ఈ విధంగా చేసింది అని అంటున్నారు. యుద్ధం భారత్ లక్ష్యం కాదని ఉగ్ర శిబిరాలని అంతం చేయడమే ఉద్దేశ్యమని చెబుతున్నారు. అందువల్ల భారత్ ఎక్కడ ఆరంభించిందో అక్కడే ముగించింది అని చెబుతున్నారు. కానీ భారత్ కి బంగారం లాంటి అవకాశం అని పాక్ మళ్ళీ లేవకుండా దెబ్బ తీసే చాన్స్ ని మోడీ మిస్ చేసుకున్నారని ఆ విధంగా ఆయన ఇందిరా వాజ్ పేయి సరసన ఉండాల్సింది జస్ట్ అలా దూరం అయింది అని అంటున్నారు. అయితే నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ రోజున కాల్పుల విరమణకు అంగీకరించి ఉండవచ్చేమో కానీ ఏదో రోజున పాక్ కి చరిత్రలో నిలిచిపోయే గుణపాఠం చెప్పి తీరుతుందని ఆయన జాతిని ఉద్దేశించి చేసిన స్పీచ్ తో లోకానికి అర్థం అయింది అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే పాక్ విషయంలో కాంగ్రెస్ బీజేపీ ప్రధానమంత్రులు ఎవరైనా పై చేయినే సాధించి దాయాదికి తన దారి చూపించారు అని అంటున్నారు. ఇకపోతే పాకిస్థాన్ విషయం తీసుకుంటే ఉగ్రవాదాన్ని అణు బాంబులను మాత్రమే నమ్ముకుంది. ఒక విధంగా నిప్పుల కుంపటి మీద ఆ దేశం కూర్చుని ఉంది. దానికి వేరే వారు వచ్చి అంటించాల్సిన అవసరం లేదని మోడీ ప్రభుత్వం భావిస్తోంది. అందువల్ల పాక్ తాను ఉన్న ప్రమాదకరమైన చోటుని గ్రహించి దానికి తగిన విధంగా వివేచనతో ప్రజల మేలు కోరే చర్యలకు ఉపక్రమిస్తే ఒక దేశంగా మిగిలి ఉంటుందని అంటున్నారు. ఉగ్ర మూకలకు దూరంగా జరిగితే పాక్ కి భవిష్యత్తు అని అంతా అంటున్నారు. అలా కాదని పాక్ తోక జాడిస్తే ఈసారి మోడీ మూడో కన్ను తెరవడం ఖాయం. మరి ఆ అగ్నికీలలో దాయాది మాడి మసి అవుతుందా లేక ఇంకేమైనా జరుగుతుందా అంటే అది భవిష్యత్తు దర్శనమే అని అంటున్నారు. ఏది ఏమైనా ఈ దేశం ఇందిరను, వాజ్ పేయ్ ని మోడీని చరిత్ర పుటలలో గుర్తుంచుకుంటుందని అంతా అంటున్న మాట. ఇక పాక్ మోడీ సర్కార్ తో ఎపుడైనా పెట్టుకుంటే ఆ రోజుతోనే మూడినట్లే అని అంటున్నారు.

## స్వార్థమే పరమార్థం... కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తం - మే 15... అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం

కుటుంబం అనగా ఒకే గృహంలో నివసించే కొంత మంది బంధువుల సమూహం. వీరు సాధారణంగా పుట్టుకతో లేదా వివాహముతో సంబంధమున్నవారు. భారతీయ సంస్కృతికి, సంప్రదాయాలకు, నాగరికత పురోగతికి మూలమైనది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. నాగరికత విస్తరణకు పూర్వమే మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉందని వివిధ గ్రంథాలలో పొందు పరచబడి ఉంది. నాగరిక ప్రపంచంలోనూ మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లింది. ప్రాచీన కాలం నుండి ఉమ్మడి కుటుంబాలు సిరి సంపదలతో తూల తూగాయనడంలో సందేహం లేదు. ఒక కుటుంబంలో తాత మొదలు వారి పిల్లలు, వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉమ్మడి అనే గొడుగు కింద ఒదిగి పోయేవి. ఇంటి లోని పెద్దకు అందరూ గౌరవం ఇవ్వాల్సిందే. ఆయన మాటే వేదవాక్కు. అందరిదీ ఉమ్మడి వ్యవసాయమే. సమష్టి సంపదనే, సమష్టి భోజనాలే ఉండేవి. ఆత్మీయత అనురాగం, ఉట్టి పడేలా చేసేవి. తల్లిదండ్రులు, అత్తమామలు, అక్క చెల్లెళ్లు, అన్నదమ్ములు, బావా మరదళ్లు, బంధు మిత్రులు, తాతలు, బామ్మలు, మనవలు, మనవ రాండ్రతో కళకళలాడే ఉమ్మడి కుటుంబాలు సిరి సంపదల నిలయాలు. పిల్లలు చిన్న వయస్సులో ఉన్నపుడు తల్లిదండ్రుల చెంతనే ఉంటారు. వారు పెద్దవారై పెళ్ళిళ్ళు అయిపోతే ఎవరి కుటుంబాలు వారివే. అంటే ఒక కుటుంబం నుంచి మరిన్ని కుటుంబాలు ఉదయిస్తాయి. ఒక కుటుంబం మరెన్ని కుటుంబాలను సృష్టించినప్పటికీ వంశవృక్షపు వేళ్ల మూలాలు మాత్రం మొదటి కుటుంబంను అల్లుకునే ఉంటాయి. అందుకే సంవత్సరంలో ఒక రోజైనా అందరూ కలుసు కోవాలని సరదాగా గడపాలని కోరుకోవడం అత్యంత సహజం. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం చిక్కని కుటుంబాలు





ఎన్నో. విదేశీ పాలకుల పాలనలో ఉమ్మడి కుటుంబాలుగా చెలామణి అయిన ఎన్నో కుటుంబాలు నవనాగరిక ప్రపంచంలో విచ్ఛిన్న మయ్యాయి. ఆధునికత పెరగడం, నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వెరసి ఉమ్మడి వ్యవస్థ మీదా తీవ్ర ప్రభావాన్ని చూపింది. నవ నాగరిక ప్రపంచంలో రెండు కుటుంబాలు కాదు కదా రెండు మనసులు కూడా కలసి జీవించ లేని పరిస్థితి నెలకొంది. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో. కేవలం ఫోన్‌లోనో, మొబైల్‌లోనో యోగ క్షేమాలు కనుక్కునే కుటుంబాలు కూడా లేకపోలేదు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలకు మనదేశం పుట్టిల్లు. ఇప్పుడు ఆ సంస్కృతి భూతద్దం పెట్టి వెతికినా దొరకదంటే అతిశయోక్తి కాదు. అనేక కుటుం బాలు వ్యక్తిగత కారణాలతో విచ్ఛిన్నం కావడం మనం రోజూ చూస్తూ ఉన్నదే. అయినప్పటికీ మన దేశంలో అనేక కుటుంబాల మధ్య కనిపించే అన్యోన్యతా భావం మరే దేశంలోనూ కనిపించదు. డబ్బు సంపాదన కోసం కనీసం భార్యభర్తలు కూడా ఒక చోట కూర్చుని ఒకరినొకరు పలకరించుకునే సమయం చిక్కడం లేదంటే కుటుంబాలు ఎంతగా విచ్ఛిన్న మయ్యాయో అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి కుటుంబాలలో కలిసి మెలిసి మనగలిగే మనస్తత్వాలు లోపించి పెళ్లయిన మరు నాడే వేరు కాపురాలు పెట్టుకుని జంటలుగా ఒంటరై పోతున్నారు. దీంతో సలహాలిచ్చే పెద్ద దిక్కులు లేకపోవడం, ఆపదలో ఆదుకునే ఆత్మీయులు దూరం కావడం, కనీసం మనసులోని బాధలను పంచుకునే బంధువులు కరువవ్వడం నేటి సమాజంలో మనకు నిత్యం కనిపించే దృశ్యం. కుటుంబ దౌర్జన్యం చట్టం 498-ఎను దుర్వినియోగం చేయడం ద్వారా కొందరు భార్యలు, భర్తలతో పాటు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై తప్పుడు కేసులు బనాయించి వారిని వేధింపులకు గురి చేస్తున్నారు. బోగస్ వరకట్న కేసులు బనాయించడం ద్వారా దేశవ్యాప్తంగా వేల మంది పురుషులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే పురుషులు వివాహం చేసుకోవడానికి వెనుకంజ వేసే పరిస్థితి వస్తుంది. భార్యాభర్తల మధ్య చోటు చేసుకున్న విభేదాలు న్యాయస్థానం వెలుపలనే పరిష్కరించు కోవడం సముచితంగా ఉంటుందని అనుభవజ్ఞుల భావన. సమాజంలో వివిధ మతపరమైన వివాహ చట్టాలు కుటుంబ వ్యవస్థను గుర్తించాయి. "రక్త సంబంధము, సహచరత్వము, ఒకే నివాసం అంశాల విషయంలో కుటుంబ నైతిక, సామాజిక సూత్రాలు కుటుంబ సమైక్యత, సంఘటితం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన సమయమిది. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సుస్థిర కుటుంబాలకు దోహదం చేయడం, నైపుణ్యాన్నీ, అనుభవాలను, సామాజిక విలువలను పరస్పరం పంచుకుంటూ కుటుంబ సమస్యల విషయంలో సరైన సమాచారాన్ని, సహకారాన్ని అందించడం, కుటుంబాలలో నెలకొన్న విభేదాలను తొలగించి ఆయా కుటుంబాలలో సుఖశాంతులు నెలకొల్పడం వంటి అంశాలపై నేటి తరానికి అవగాహన కల్పించాల్సిన తరుణమిది. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## మల్లాది సుబ్బమ్మ: స్త్రీ స్వేచ్ఛ కోసం నిరంతర పోరాటం - మే 15... మల్లాది సుబ్బమ్మ వర్ధంతి




మల్లాది సుబ్బమ్మ (ఆగస్టు 2, 1924 - మే 15, 2014) ఒక విభిన్న భావజాలానికి ప్రాతినిధ్యం వహించిన హేతువాది, స్త్రీవాద రచయిత్రి, సంఘ సంస్కర్త. గుంటూరు జిల్లా రెపల్లె మండలం పోతార్లంకలో జన్మించిన ఆమె బాల్యం నుంచే సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షను గమనించి, ఆత్మలో మలుచుకున్న చైతన్యాన్ని కాలంగా మార్చి వేశారు. సమానత్వం, స్వేచ్ఛ, విద్యా హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం ఆమె జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేసేందుకు దోహద పడింది. ఆమె స్త్రీల హక్కుల కోసం సంఘటిత ఉద్యమానికి ప్రణాళికగానే నిలిచారు. "స్త్రీ స్వేచ్ఛ" అనే పత్రికను సంపాదకురాలిగా నడిపిస్తూ, మహిళల గొంతును బలంగా ప్రతిధ్వనించే వేదికగా మలిచారు. ఆమె రచనలు ధైర్యాన్ని, స్పష్టతను ప్రతిబింబించేవి. హేతువాదాన్ని బలంగా నమ్మిన ఆమె మూఢ నమ్మకాల్ని ప్రశ్నించారు. మహిళల నైతిక, సామాజిక స్వాతంత్ర్యానికి ఆమె లౌకిక విలువలతో నిలిచిన అర్థవంతమైన ప్రతినిధిగా మారారు. ఆంధ్రప్రదేశ్‌లో మద్యపాన వ్యతిరేక ఉద్యమానికి ఆమె అందించిన నాయకత్వం ప్రత్యేక గుర్తింపు పొందింది. 1990వ దశకంలో మహిళలు మద్యం ప్రభావంతో పడుతున్న బాధలను గమనించి, ఆందోళనలకు పూనుకొని రాష్ట్ర వ్యాప్తంగా చైతన్యాన్ని నింపారు. ఆమె ఉద్యమం ఫలితంగా 1994లో రాష్ట్ర ప్రభుత్వం మద్యపాన నిషేధాన్ని అమలు చేయడం ఆమె నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. మల్లాది సుబ్బమ్మ హైదరాబాదులో "ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ ఉమెన్" సంస్థను స్థాపించి, మహిళా అభ్యున్నతికి శాస్త్రీయ దృక్పథంతో కూడిన శిక్షణా శిబిరాలు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా పర్యటిస్తూ మానవ హక్కులు, లౌకికవాదం, స్త్రీ సమానత్వం గురించి ప్రసంగించారు. మానవతా విలువలను ప్రజలలోకి తీసుకెళ్లే ప్రయత్నంలో ఆమె నిరంతరంగా చురుగ్గా ఉండటం ఒక ఉద్యమంగా మారింది. సాహిత్యంలోనూ ఆమె తనదైన ముద్ర వేసారు. ఆమె దాదాపు 110 పుస్తకాలు, 500కు పైగా వ్యాసాలు రచించారు. మహిళల సమస్యలు, ఉద్యమాలు, చట్టబద్ధ హక్కులు, సామాజిక సంక్షోభాలు ఆమె రచనలకు ప్రాణస్వరూపం. బానిస కాదు దేవత కాదు, ఓ మహిళా! ముందుకు సాగిపో, తరతరాల స్త్రీల పరాజయ గాథ, పతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా వంటి రచనలు మహిళా చైతన్యానికి మేటి ఉదాహరణలుగా నిలిచాయి. "%ఔశీఎవఅ ఖఅస రాశీఎఱఖశ్రీ =వటశీతీఎ%", "Status of Indian Women%μμ, ªª%Women in Changing Society" వంటి ఆంగ్ల రచనలు దేశవ్యాప్తంగా పఠితులను ప్రభావితం చేశాయి. ఆమె రచనలు గర్భించిన సందేశం - స్త్రీ శక్తిని ఒడిసి పట్టుకోవాలన్న తపన, మానవీయత మీద నమ్మకం, సమాజపు సంక్షోభాలపై బహిరంగంగా మేధోపరమైన పోరాటం. ఆమె ఆత్మకథ పాతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా అంటేనే ఆమె వ్యక్తిత్వ ప్రయాణానికి నిక్షిప్త రూపం. 2012లో మల్లాది సుబ్బమ్మ తనకు ఉన్న ఆస్తులన్నింటిని విక్రయించి, హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో మహిళా అధ్యయన కేంద్రం భవన నిర్మాణానికి విరాళంగా ఇవ్వడం ఆమె జీవిత ఆశయానికి శాశ్వత సాక్ష్యంగా నిలిచింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ ప్రకటన చేయడం ఆమె లోతైన సామాజిక చింతనకు నిదర్శనం. మల్లాది సుబ్బమ్మ ఒక రచయిత్రిగా, ఆలోచనాపరురాలిగా, ఉద్యమ కారిణిగా మరియు స్ఫూర్తిదాయకంగా మహిళల సాధికారత కోసం యావజ్జీవం అంకితమయ్యారు. ఆమె జీవితం, రచనలు, ఉద్యమం ఇప్పటికీ సమానత్వానికి ఆకాంక్షించే వారికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. ఆమె చేసిన కృషి తెలుగు మహిళా ఉద్యమ చరిత్రలో ఒక చిరస్మరణీయ అధ్యాయంగా నిలిచిపోతుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## వింజమూరి శివరామారావు: హాస్య సాహిత్యానికి హృదయ స్వరం - మే 15...వింజమూరి జయంతి



తెలుగు సాహిత్యంలో హాస్య రచనకు మానవీయతను మేళవించి, జీవన వాస్తవాలపై వినోదభరితంగా స్పందించిన సాహితీవేత్తల్లో వింజమూరి శివరామారావు అగ్రగణ్యులు. ఆయన కవి, కథకులు, నాటక రచయిత, పాత్రికేయుడు, ఆకాశవాణి ప్రసార కర్తగానూ విశిష్ట సేవలందించారు. 1908 మే 15న పిఠాపురం తాలూకా చంద్రపాళెంలో జన్మించిన శివ రామారావు, గౌతమి అనే కలం పేరుతో రచనలు చేశారు. అభ్యుదయ కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆయన మేనమామ కావడం విశేషం. పత్రికా రంగంలో ఆయన 'జ్వాల', 'నవోదయ' వంటి పత్రికలలో సహాయ సంపాదకులుగా పని చేశారు. పత్రికా జీవితంలో సంపాదక దృష్టితో జోలి పడకుండా హాస్యాన్ని సత్యాల మెడల మీద అలంకారంగా వేసారు. 1949 నుంచి 1968 వరకు విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో స్క్రిప్ట్ రైటర్‌గా పనిచేస్తూ నాటకాలు, స్కిట్లు, శ్రావ్య ప్రసంగాల రూపంలో ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచారు. ఆయన గొంతులో వినిపించిన మాటలు ప్రజల హృదయాలను తాకేవి. వింజమూరి రచనా జీవితం హాస్యాన్ని ఆధునికీకరించడంలో కీలకమైన పాత్ర పోషించింది. కథలు, వ్యాసాలు, నాటకాలు అన్నింటిలోనూ సామాజిక పరిశీలనకు ఓ చీకటి వెలుతురులా హాస్యాన్ని వాడారు. ఆయన రచించిన 'విజయ పతాక', 'కళా రాధన', 'రజక లక్ష్మి', 'కళోపాసన', 'కృష్ణ. దేవరాయలు', 'విశ్వామిత్ర' వంటి నాటకాలు సామాజిక స్పృహను ప్రతిబింబించే విధంగా ఉండగా, 'బుర్ర కథలు', 'బాబూ భాస్కర్', 'కార్యాలయ కబుర్లు', 'వింజమూరి వినోదాలు' వంటి హాస్య కథా సంకలనాలు సామాన్య ప్రజల జీవితానుభూతులకు అద్దం పట్టేవిగా నిలిచాయి. వింజమూరి రచనలు మామూలుగా నవ్వించేవి కావు. అవి మనల్ని మనమే చూసుకునే అద్దాలుగా మారతాయి. మధ్య తరగతి జీవిత విశేషాలు, ఉద్యోగుల అనుభవాలు, భర్త-భార్యల మధ్య సంభాషణల హాస్య రస తత్త్వం, అలాగే ఆఫీసు రాజకీయాలపై వ్యంగ్యం ఆయన రచనల ప్రత్యేకత. భాషపై ఆయనకు ఉన్న పట్టు, హైదరాబాదీ ఉర్దూ మేళవింపుతో కూడిన సంభాషణలు, ప్రజల మధ్య చలామణీగా ఉన్న మాటల ప్రయోగం అన్నీ ఆయన రచనలను అందరికీ చేరువ చేస్తాయి. తెలుగు భాషా సంపదకు ఆయన చేసిన సేవలను గుర్తించి ఆంధ్ర విశ్వకళా పరిషత్ వారు శివరామారావును 'కళాప్రపూర్ణ' బిరుదుతో సత్కరించడం గర్వకారణం. 1982లో విజయవాడలో ఆయన మకుటం లేని మహా రాజులా జీవించి కన్నుమూశారు. కానీ, ఆయన రచనలు నవతర పాఠకులను ఇప్పటికీ అలరిస్తూనే ఉన్నాయి. ఆయన హాస్యం ముళ్ల మధ్య పువ్వులా %-% మనకు నవ్వు తీసుకొస్తూనే, లోతైన సందేశాన్ని అందిస్తుంది. తెలుగు సాహిత్యంలో హాస్య రచనను ఒక ప్రత్యేక ప్రక్రియగా మలిచిన వింజమూరి శివరామారావు, సాహితీ పఠనంలో మనల్ని ఆలోచింపజేసే హాస్యానికి ప్రతీక. ఆయన కలం నిలిపిన పదాలు కాలంతో మారిపోకుండా తెలుగు ప్రజల హృదయాలలో ఎప్పటికీ నిలిచి ఉంటాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## విలక్షణ గాయని కె. జమునారాణి - మే 15... జమునారాణి జయంతి



తెలుగు సినిమా పాటల ప్రపంచంలో కె. జమునారాణి ఓ విలక్షణ స్థానాన్ని సంపాదించారు. తన మధురమైన గాత్రంతో వేలాది పాటలు పాడి, శ్రోతల హృదయాలను గెలుచుకున్న ఈ గాయని, దక్షిణాది చిత్ర సంగీతంలో చిరస్థాయిగా నిలిచి పోయారు. ఆమె గొంతు శ్రావ్యతకు, భావ నిష్ఠకు ప్రతిరూపంగా మారింది. 1938 మే 17న ఆంధ్రప్రదేశ్ లోని సంగీత పరంపర గల కుటుంబంలో ఆమె జన్మించారు. తల్లి కె. ద్రౌపతి ప్రసిద్ధ వయోలిన్ విద్వాంసురాలు. చిన్ననాటి నుంచే సంగీతానికి ఆసక్తి చూపిన జమునారాణి, ఏడేళ్ల వయస్సులోనే 1946లో విడుదలైన తెలుగు చిత్రం త్యాగయ్య లో బాల గాయకురాలిగా గాత్ర ప్రస్థానం ప్రారంభించారు. అనంతరం తమిళ చిత్రాల్లో ఆమె స్వరం విశేషంగా మెప్పించగా, 1952లో 'వలయపతి', 'కళ్యాణి' చిత్రాల్లో ప్రధాన గాయనిగా గుర్తింపు పొందారు. 1955లో వచ్చిన తమిళ చిత్రం గులేబకావళి లోని పాట ఆమెకు ప్రత్యేకమైన గుర్తింపు తీసుకొచ్చింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, సింహళ భాషల్లో కలిపి 6000కి పైగా పాటలు పాడిన అరుదైన గాయనుల్లో ఆమె ఒకరు. 1953లో శ్రీలంక సినీరంగం లోకి ప్రవేశించి, అక్కడి సింహళ భాషా చిత్రాలలో కూడా ఆమె గాత్రం ద్వారా ప్రసిద్ధి చెందారు. 'సుజాత' (1953), 'వరద కాగెడ' (1954), 'సెడ సులంగ్' (1955), 'మథలన్' (1955), 'సురయ' (1957), 'వన మోహిని' (1958) వంటి చిత్రాల్లో పాటలు పాడి, శ్రీలంక సంగీత ప్రియుల హృదయాల్లో చోటు సంపాదించారు. ఆమె పాడిన "జీవన మే గమన సంసారే" పాట శ్రీలంక చలనచిత్ర గీతాల పత్రంలో అపురూపంగా నిలిచి పోయింది. 1970లలో కొంతకాలం విరామం తీసుకున్న జమునారాణి, 1987లో మణిరత్నం రూపొందించిన 'నాయకన్' చిత్రంలోని "నా నవ్వే దీపావళి" పాటతో మళ్ళీ శ్రోతల మనసులను దోచుకున్నారు. అనంతరం 1992లో 'అన్నన్ ఎన్నడ తంబి ఎన్నడ' వంటి తమిళ చిత్రాల్లో పాటలు పాడారు. 1950ల నుండి 1960ల వరకు తెలుగులో 'మూగ మనసులు', తమిళంలో 'పాసమలర్' వంటి అనేక హిట్ చిత్రాల్లో ఆమె గానం ప్రతిభను చూపింది. జమునారాణి అనేక సంగీత దర్శకుల మద్దతుతో తమ సంగీత ప్రయాణాన్ని సాగించారు. ఘంటసాల, కె.వి. మహదేవన్, జి. రామనాథన్, సాలూరి రాజేశ్వర రావు, ఎస్.వి. వెంకట్రామన్, ఇళయరాజా, చంద్రబోస్ వంటి దిగ్గజుల గీతాలకు ఆమె గళమెత్తారు. టి.ఎం. సౌందర రాజన్, ఎ.ఎం. రాజా, పి.బి. శ్రీనివాస్, సీర్కాళి గోవింద రాజన్ వంటి గాయకులతో పాడిన యుగళ గీతాలు శ్రోతల హృదయాల్లో మిగిలి పోయాయి. మహిళా గాయకులైన పి. సుశీల, లీల, జిక్కి, ఎల్.ఆర్. ఈశ్వరి లాంటి వారితో కలిసి పాడిన పాటలు కూడా విశేషంగా నిలిచాయి. "ఓ చందమామ", "పొత్తిళ్లలో ఉన్న పాపాయి", "నీవు లేని లోకం", "అందం చందం నీదే", "వెన్నెల్లో గోదారి అందం", "నా నవ్వే దీపావళి", "సొల్లట్టుమా సొల్లట్టుమా" వంటి పాటలు ఆమె గాత్ర సౌందర్యానికి తార్కాణాలుగా నిలిచాయి. గళం లోతు, స్వరాల స్పష్టత, భావ వ్యక్తీకరణలో నిపుణత ఆమె ప్రత్యేకతలు. తన గాత్ర సేవలకు గుర్తింపుగా జమునారాణి అనేక పురస్కారాలు అందుకున్నారు. తమిళనాడు ప్రభుత్వం అందించిన 'మామణి' (1998), 'అరింగ్నార్ అన్నా అవార్డు' (2002), 'పురచ్చితలైవి జయలలితా అవార్డు' (2020)తో పాటు పలు సంగీత సంస్థల లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులను అందుకున్నారు. ప్రచారానికి దూరంగా ఉండే స్వభావం, సంగీతం పట్ల అంకిత భావం ఆమె వ్యక్తిత్వాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దాయి. జమునారాణి పాటలు కేవలం వినోదం కాదు %-% అవి సంగీతం పట్ల ఉన్న భక్తి శ్రద్ధలకు చిరునామాలు. ఆమె గానం సంగీత ప్రేమికులకు నిత్యం వినిపించే తియ్యని జ్ఞాపకం. శ్రోతల హృదయాలలో ఆమె స్థానం యుగాల పాటు నిలిచి పోతుంది. ఇలాంటి గాన గంధర్వుల స్వరం వందల ఏళ్ల తర్వాత కూడా సంగీత వీధుల్లో మార్మోగుతూనే ఉంటుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

చురకలు



# తూకాల్లో జాప్యం.. రైతులకు శాపం

ఎల్లారెడ్డిపేట: అన్నదాతలను అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. యాసంగి సీజన్‌లో వరి ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తరలించగా తూకాల్లో జాప్యం చోటుచేసుకుంటోంది. తరచుగా కురుస్తున్న వర్షాలతో ధాన్యం తడిసిముద్దవుతోంది. తడిసిన ధాన్యాన్ని తిరిగి ఆరబెడుతూ తమవంతు క్రమసంఖ్య రాకకోసం కేంద్రాల్లోనే రైతులు పడిగాపులు కాస్తున్నారు. రాత్రి పగలు తేడాలేకుండా ఆకాశం మేఘావృతమైనప్పుడల్లా ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు ప్లాస్టిక్ కవర్లతో కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. జిల్లాలో ఇలా.. జిల్లాలో ఈ నెల 8 వరకు 17,926 మంది రైతుల నుంచి రూ.297.20 కోట్ల విలువ చేసే 128101.68 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 119056.89 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు చేర్చగా 9044.79 మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాలను తరలించాల్సి ఉంది. యాసంగి సీజన్‌లో 1,78,350 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. సుమారుగా 4.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాకు వచ్చారు. ఇందులో నుంచి 3.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలనే లక్ష్యంతో 244 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. 242 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తున్నారు. 126661.62 మెట్రిక్ టన్నుల దొడ్డురకం, 1440.06 మెట్రిక్ టన్నుల సన్నరకం



ధాన్యాన్ని కొన్నారు.

8700 మంది రైతులకు సంబంధించి రూ.129.26 కోట్లు విలువ చేసే 55716.12 మెట్రిక్ టన్నుల ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇందులో 5153 మంది రైతులకు చెందిన 31665 మెట్రిక్ టన్నుల ధాన్యం డబ్బులు రూ.73.46 కోట్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇంకా అనేక కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. తూకాలు నత్తనడకన సాగుతుండటంతో తమవంతు కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు, వర్షాల బారి నుంచి రక్షించేందుకు ప్లాస్టిక్ పరదాలను అద్దెకు తీసుకొస్తున్నారు. రోజుల తరబడి తూకాలు సాగకపోవడంతో ప్లాస్టిక్ కవర్ల అద్దె డబ్బులు రూ.వందల్లో చెల్లించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు నిరీక్షణ మరోవైపు ప్లాస్టిక్ కవర్ల అద్దె తప్పడం లేదని వాపోతున్నారు.

**25 రోజులవుతోంది**

పర్వతాలు, రాచర్ల బొప్పాపూర్

5.20 ఎకరాల్లో వరి సాగు చేశా. నెల క్రితం కోతలు ముగించి, ధాన్యాన్ని రాచర్ల బొప్పాపూర్ మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చా. నిర్ణీత తేమశాతం వచ్చేంత వరకు ఆరబెట్టాం. తూకం కోసం కుప్పగా పోసి 25 రోజులవుతోంది. అప్పుడప్పుడు వర్షాలు పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వర్షం ఎప్పుడు ముంచుకొస్తుందా అనే భయంతో ఉన్నాం.

**వేగవంతం చేయాలి** సతీష్, రాచర్ల గొల్లపల్లి

మేం 15 రోజుల క్రితం 4 ఎకరాల్లో వరిని కోసి, రాచర్ల బొప్పాపూర్ మార్కెట్ యార్డులోని ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాను. కేంద్రంలోనే ధాన్యాన్ని ఆరబెట్టాను. తూకాల్లో జాప్యం జరుగుతోంది. ధాన్యం ఎండి పది రోజులవుతున్నా తూకం వేయడం లేదు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతుండగా తిరిగి ఆరబెట్టాల్సి వస్తోంది. అధికారులు స్పందించి, తూకాలను వేగవంతం చేయాలి.

# సెస్ అందదు.. అవస్థలు తీరవు

వికారాబాద్ : జిల్లాలోని గ్రామ పంచాయతీలు, పురపాలికల్లో గత ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూళ్లు 80 శాతానికి మించి జరిగాయి. అయినా గ్రంథాలయాలకు సెస్(ఇంటి పన్నులో 0.08 శాతం) రూపేణా నిధులు చెల్లించలేదు. ఈ విషయమై పంచాయతీలకు లేఖలు రాసిన ఫలితం కనిపించడం లేదని గ్రంథాలయ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో 566 పంచాయతీలు, నాలుగు పురపాలక సంఘాలు సెస్ చెల్లించాల్సి ఉంది. జిల్లా కేంద్రంలో ప్రధాన, మండల కేంద్రాల్లో 17 శాఖ గ్రంథాలయాలు ఉన్నాయి. మొత్తం 3,05,522 పుస్తకాలున్నాయి. 14,108 సభ్యులున్నారు. శాఖా గ్రంథాలయాల్లో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మారుమూల మండల కేంద్రాల్లో ఉన్నవి అధ్వానంగా మారాయి. కొన్నింట్లో పుస్తకాల కొరత ఉంది. సెస్‌ను చెల్లిస్తే వీటిల్లో అవసరమైన సదుపాయాలు కల్పించవచ్చు. పాఠకులు కోరిన పుస్తకాలను సమకూర్చడానికి వీలవుతుంది.

**బకాయిలు రూ.80 లక్షలు**




2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.65 లక్షల సెస్ చెల్లింపు డిమాండు ఉండగా రూ.35 లక్షలు వసూలు చేశారు. రూ.30 లక్షలు బకాయిలున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా పేరుకపోయిన పాత బకాయిలు రూ.50 లక్షలున్నాయి.

**తాకిడి పెరిగింది**

గ్రంథాలయాలకు అభ్యర్థుల తాకిడి పెరిగింది. వివిధ పోటీ పరీక్షల ఉద్యోగాలకు అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు. నిత్యం వందలాది మంది నిరుద్యోగులు వస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇక్కడే ఉండి సన్నద్ధం అవుతున్నారు. అభ్యర్థులకు అనుకూలంగా అన్ని రోజులు తెరిచి ఉంచుతున్నారు. ప్రత్యేకంగా పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు పెద్ద గదిని ఏర్పాటు చేశారు.

**లేఖలు రాశాంపి.సురేశ్‌బాబు, కార్యదర్శి గ్రంథాలయ సంస్థ, వికారాబాద్.** బకాయిలు చెల్లించాలని కోరుతూ అన్ని పంచాయతీలకు లేఖలు రాశాం. సంబంధిత జిల్లా అధికారులకు దృష్టికి తీసుకెళ్లాం. పురపాలక సంఘాలకు డిమాండు కలెక్షన్ బ్యాలెన్స్ వివరాల గురించి లేఖలు రాశాం. సెస్ పూర్తి స్థాయిలో వసూలైతే పాఠకులకు మరిన్ని సౌకర్యాలు కల్పించవచ్చు.

# పేరు.. తారుమారు



కరీంనగర్ : రాష్ట్రంలోనే రెండో పెద్ద బస్టాండ్‌గా కరీంనగర్‌కు పేరు ఉంది. ఇక్కడ ప్రయాణికుల అవసరాలను వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. అసలే వేసవికాలం.. ఆపై దాహం ఎక్కువగా ఉంటుంది. చాలామంది నీళ్ల సీసాలను కొనుగోలు చేస్తుంటారు. దీనిని ఆసరాగా చేసుకొని నకిలీ నీళ్ల సీసాల దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఎక్కడా లభించని బ్రాండ్లు కరీంనగర్ బస్టాండ్‌లో ఉన్న స్టాళ్లలో కనిపిస్తున్నాయి. అందులో ఏవి నకిలీవో? స్వచ్ఛమైనవో తెలియని పరిస్థితి. కొందరు వ్యాపారులు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తూ ప్రయాణికుల జేబులకు చిల్లులు వేస్తున్నారు. ఖాళీ సీసాల్లో నీటిని నింపి పలు రకాల బ్రాండ్ల పేరుతో విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**ఎమ్మార్పీ కంటే అధికంగా..**

కరీంనగర్ బస్టాండ్‌లో 45 ప్లాట్‌ఫాంలు ఉండగా నిత్యం 1500కు పైగా సర్వీసులు, వీటి ద్వారా సుమారు 80 వేలకు పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఎండలు మండిపోతుండటంతో దాహార్తిని తీర్చుకోవడానికి చాలా మంది నీళ్ల సీసాలను కొనుగోలు చేస్తుంటారు. ఇక్కడే కొందరు వ్యాపారులు ఎమ్మార్పీ కంటే అదనంగా వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. మామూలుగా నీళ్ల సీసా బయట కొంటే రూ.20 ఉంటుంది. ఇక్కడ మాత్రం రూ.30 వసూలు చేస్తున్నారు. అదేమిటని ప్రశ్నిస్తే కూలింగ్ చేసినందుకు అని చెబుతున్నారని పేర్కొన్నారు. కొన్ని కంపెనీల సీసాలపై రూ.30 అని ఉండటం విశేషం. ఎమ్మార్పీ అంతే ఉందని.. అదే ధర తీసుకుంటున్నామని కొందరు వ్యాపారులు చెబుతున్నారు.

ఇటీవల ఓ ప్రయాణికురాలు బస్టాండ్‌లోని ఓ స్టాల్‌కు వెళ్లి నీళ్ల సీసా కొంటే.. వాడకంలో లేని కంపెనీది ఇచ్చాడు. అది వద్దని ప్రముఖ కంపెనీది కావాలని అడిగితే.. ఆ స్టాల్ నిర్వాహకుడు ఓ అక్షరం తేడాతో ఉన్న సీసా ఇచ్చాడు. ఇదేమిటని ప్రశ్నిస్తే అదే ఉందని సమాధానం ఇచ్చాడు. ఒకటి అడిగితే మరోటి ఇవ్వడంతో ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక వీడియో రూపంలో సామాజిక మాధ్యమాల్లో పంచుకోగా అది వైరల్ అయింది.

**నాణ్యమైనవా.. నాసిరకమా?**

చాలా మంది స్టాళ్ల నిర్వాహకులు టెండరు సమయంలో ఒప్పందం చేసుకున్న వాటిని కాకుండా ఇతరత్రా వాటిని కూడా విక్రయిస్తున్నారు. అలాగే నాసిరకం తినుబండారాలు, వస్తువులు విక్రయిస్తున్నట్లు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

నీళ్లసీసాల్లో వేర్వేరు ధరలు ముద్రించి ఉంటున్నాయి. అధికారులు తనిఖీ చేసినా తాము ఎమ్మార్పీకే అమ్ముతున్నామని వ్యాపారులు చెబుతున్నారు. ఐఎస్ఐ, ఎమ్మార్పీని మాత్రమే అధికారులు చూస్తున్నారు. అవి నాణ్యమైనవా?, నాసిరకమా చూడటంలేదు. అది తమ పరిధి కాదని చెబుతున్నారు. ఆహార విభాగం తనిఖీ వారు ఇటు వైపు చూసిన దాఖలాలు లేవు.

**ఎక్కువ ధర తీసుకోవద్దు**

నీళ్ల సీసాలు, వస్తువులు, ఏదైనా ప్యాకింగ్‌పై ఉన్న ఎమ్మార్పీ కంటే ఎక్కువ డబ్బులు తీసుకోవద్దు. ఎక్కువ ధర తీసుకుంటే ప్రయాణికులు నిర్భయంగా ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేయాలి. ఇతర కంపెనీల సీసాల అంశం మా పరిధిలో ఉండదు. నీరు, తినుబండారాల నాణ్యత విషయంలో అనుమానాలు ఉంటే ప్రయాణికులు సంబంధిత విభాగాల అధికారులకు ఫిర్యాదు చేయాలి. మా దృష్టికి తీసుకొచ్చినా.. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. బి.రాజు, రీజినల్ మేనేజర్, కరీంనగర్ రీజియన్

# కొన'సాగు'తూ ఉంటే ఎలా?



ఎల్లారెడ్డిపేట: మధ్య మానేరు నుంచి మల్కపేట రిజర్వాయర్ మీదుగా ఎగువ మానేరుకు నీటిని తరలించాలనే లక్ష్యంతో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు తొమ్మిదో ప్యాకేజీ పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఈ ప్రాజెక్టు పనులు 16 సంవత్సరాలుగా కొన'సాగు'తూనే ఉన్నాయి. వర్షాలతో వివిధ నిర్మాణాలకు ఆటంకాలేర్పడటం సహజమే. అయితే ప్రస్తుత వేసవి కాలంలో 9వ ప్యాకేజీ మిగులు పనులు శరవేగంగా పూర్తిచేస్తే రానున్న వర్షాకాలంలో గొలుసుకట్టుగా ఉండే అనేక నీటి వనరులు జీవం పోసుకోనున్నాయి. సాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. పంటల సాగుతో మెట్ట ప్రాంతం సస్యశ్యామలమై అన్నదాతలకు మేలు జరగనుంది. అధికారులు స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులను పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

**ఇదీ పరిస్థితి** ఎగువ మానేరు కింద ఉన్న 26 వేల ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరిస్తూ కొత్తగా 60 వేల ఎకరాలు కలుపుకొని మొత్తం సుమారు 86 వేల ఎకరాలకు సాగునీటిని అందించడమే లక్ష్యంతో 2008లో ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపుగా మరో 60 వరకు గొలుసుకట్టు చెరువులు జలకళను సంతరించుకునేలా ప్రాజెక్టును రీ డిజైన్ చేశారు. మల్కపేట రిజర్వాయర్ నుంచి సింగసముద్రం చెరువు వరకు గ్రావిటీ కెనాల్ నిర్మాణంలో 18.325 కిలోమీటర్ల దూరానికి వివిధ ప్రాంతాల్లో 200 మీటర్ల లైనింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

గంభీరావుపేట మండలం నాగంపేట వద్ద పంపుహౌస్ నిర్మాణానికి సంబంధించి, సివిల్ పనులు పూర్తవగా మోటార్లు, గేట్ల బిగింపు తదితర సాంకేతిక పనులను చేపట్టాల్సి ఉంది. ముస్తఫానగర్ బట్టలచెరువు నుంచి ఎగువ మానేరు వరకు 3.35 కిలోమీటర్ల కెనాల్‌ను నిర్మించగా ఒక కిలోమీటర్ లైనింగ్ పనులు మిగిలిపోయాయి.

యాసంగిలో పంటలను గట్టెక్కించేందుకు తిమ్మాపూర్ మైసమ్మచెరువు వరకు 13.5 కిలోమీటర్ల మేర కెనాల్‌లో పేరుకుపోయిన పూడికను జనవరి మాసంలో అధికారులు తీయించి, మల్కపేట నుంచి నీటిని వదిలారు. మల్కపేట నుంచి సింగసముద్రం వరకు ప్రధాన కాల్వ మధ్యలో అయిదు డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల నిర్మాణాలు భూసేకరణ సమస్యతో నిలిచిపోయాయి.

**ప్రణాళికతో ముందుకు..** కిషోర్, ఈఈ

నీరు సజావుగా వెళ్లేందుకు కెనాల్‌లో పూడికను తీయించాం. అధిక వ్యయం అవుతుందనే ఉద్దేశంతో గుత్తేదారు ముందుకు రాకపోవడంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. మరో 20 రోజుల్లో మిగులు పనులను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారు. నాగంపేట వద్ద పంపుహౌస్-2 పనులు పూర్తిచేస్తాం. అక్కడ విద్యుత్తు ఉప కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం డబ్బులు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలన్నీ త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం.

# అపసవ్య దిశలో ఆపద వైపు..

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండలంలో దాదాపు 18 కిలోమీటర్ల మేర విస్తరించిన రాజీవ్ రహదారిపై నిత్యం ఏదో చోట ప్రమాదం జరుగుతోంది. రహదారి పక్కనే ఎలాంటి సూచికలు లేకుండా వాహనాలను నిలిపి ఉంచడం, అతి వేగం, అపసవ్య దిశలో ప్రయాణం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రాత్రి పూట అపసవ్య దిశలో వచ్చే వాహనాలను డ్రైవర్లు గుర్తించకపోవడంతో వాహనాలు ఢీకొంటున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు దాదాపు 20 ప్రమాదాలు జరిగాయి. అపసవ్య దిశలో ప్రయాణించకుండా వాహనదారులను కట్టడి చేయడానికి పోలీసులు నిఘా తీవ్రతరం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**ఎక్కడెక్కడ..**

సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రీనగర్ వద్ద ఎస్‌బీఐ శాఖకు వచ్చి తిరిగి వెళ్లే వాహనదారులు.

శాస్త్రీనగర్ హనుమాన్ ఆలయం నుంచి పూసాలకు వెళ్లే వారు.

కాట్నపల్లి వద్ద బియ్యం మిల్లులు, ధర్మకాంటల వద్దకు వెళ్లే ధాన్యం లారీలు.

కోమండ్లపల్లి నుంచి వచ్చే వాహనదారులు కాట్నపల్లి వైపు రాంగ్ రూట్‌లో వస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

కాట్నపల్లి నుంచి గ్రామ చెరువు వైపునకు వెళ్లే వాహనదారులు.

సుగ్లాంపల్లి వద్ద చిన్నబొంకూర్, మియాపూర్‌ల నుంచి పెద్దపల్లికి వైపునకు వెళ్లే వాహనదారులు.

నిఘా పెంచి కట్టడి చేస్తాం



సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహించి అపసవ్య దిశలో ప్రయాణించే వాహనదారులకు గుర్తిస్తూ జరిమానాలు విధిస్తున్నాం. రాంగ్ రూట్ డ్రైవింగ్‌తో జరిగే పరిణామాలపై వాహనదారులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. నిఘా పెంచి కట్టడి చేస్తాం.శ్రావణ్‌కుమార్, సుల్తానాబాద్ ఎస్సై

# తారు పనుల్లో తాత్సారం

తాండూరు : తాండూరు మండలం అంతారం మీదుగా రెండు జిల్లాలకు అనుసంధానంగా ఉన్న రహదారి విస్తరణ పనులు ఆరు నెలలు నిలిచిపోయాయి. దీంతో ఇరుకు రోడ్డుపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అంతారం మీదుగా రెండు వరుసల రోడ్డు సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, సదాశివపేట, సంగారెడ్డికి చేరుతుంది. వీటితో పాటు మెదక్, సిద్దిపేట, కరీంనగర్, కామారెడ్డి, నిజామాబాద్ వెళ్లేందుకు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తారు. ప్రధానంగా నాపరాయి ఎగుమతులను నిత్యం వందల సంఖ్యలో లారీల్లో చేరవేస్తారు. ఈ క్రమంలోనే రద్దీ మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు సర్కారు గతేడాది రూ.కోటికి పైగా నిధులు మంజూరు చేసింది. దీంతో విలియమ్మూన్ చౌరస్తా నుంచి ఎన్‌టీఆర్ కాలనీ మీదుగా అంతారం వరకు పనులు ప్రారంభించారు. రెండు వైపులా తవ్వి జేసీబీలతో చదును చేశారు. కంకర పరిచారు. అంతారం నుంచి ఎన్‌టీఆర్ కాలనీ వరకు కుడివైపు తారు రహదారి నిర్మించారు.

**ప్రమాదాలు ఇలా..**



నెల రోజుల క్రితం ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు గాయపడి ఆసుపత్రి పాలయ్యారు. గతేడాది డిసెంబరులో అంతారం వద్ద కారు-లారీ ఢీకొని మహిళ దుర్మరణం చెందింది.

నవంబరులో రహదారిపై వెళ్తున్న వృద్ధుడిని లారీ ఢీకొట్టగా సంఘటనా స్థలంలో మృతి చెందాడు.నాలుగు నెలల క్రితం ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొని ఐదుగురికి గాయాలయ్యాయి.ఆరు నెలలుగా అడుగు ముందుకు పడలే...ఎడమ వైపున దారి పొడవునా కంకర పరిచారు. తారు పనులు చేపట్టకుండా ఆరు నెలలుగా తాత్సారం చేశారు. దీంతో నిత్యం రాకపోకలు సాగించేందుకు తాండూరు, పెద్దేముల్, బంట్వారం, కోట్‌పల్లి, మోమిన్‌పేట, మర్పల్లి మండలాలతో పాటు పొరుగున ఉన్న సంగారెడ్డి జిల్లా వాసులు ఇబ్బందులు పడుతున్నారు. కంకర మీదుగా వెళ్తుంటే కిందపడి గాయాలపాలవుతున్నారు. ఇరుకుగా మారడంతో వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటుచేకుంటున్నాయి. దీంతో పలువురు చోదకులు ప్రాణాలు కోల్పోగా మరికొందరు గాయాలపాలయ్యారు. ఆస్పత్రుల్లో చేరి వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చు చేసి అప్పుల పాలవుతున్నారు. వర్షాకాలంలోగా పనులు పూర్తి చేయించి రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

# పెరిగిన జననాలు

కొత్తగూడెం: ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కరోనా సమయంలో జననాల రేటు పెరిగింది. 2021లో రాష్ట్రంతో పాటు జిల్లాల్లో నమోదైన జననాల వివరాలు తాజాగా వెల్లడయ్యాయి. 2021లో జిల్లాలో జననాల సంఖ్య 26,504గా ఉంది. వీరిలో 53 శాతం మగ, 47 శాతం ఆడపిల్లలున్నట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అంతకు ముందు ఏడాదితో పోల్చితే 2021లో 9,215 జననాలు అత్యధికంగా నమోదయ్యాయి. ఇదే సమయంలో 2020 కన్నా ఆ తర్వాత ఏడాదిలో 3,600 మరణాలు అధికంగా సంభవించాయి. జననాల్లో, మరణాల్లో మగవారే అధికంగా ఉండటం గమనార్హం. జనగణన విభాగం తాజాగా విడుదల చేసిన 'సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం' (సీఆర్ఎస్) నివేదిక-2021లో ఈ వివరాలు వెల్లడయ్యాయి.

**పెరిగిన శిశు మరణాలు..**

కరోనా సమయంలో జిల్లాలో శిశు మరణాలు(పుట్టిన ఏడాదిలోపు చనిపోయినవారు) పెరిగినట్లు తాజా నివేదిక పేర్కొంది. ఐదేళ్ల క్రితం శిశు మరణాలు ఏడాదికి సగటున ఆరు వరకు నమోదు కాగా, తాజా నివేదిక ప్రకారం అవి 64కి పెరిగాయి. వీరిలో మగ 33, ఆడ శిశువులు 31 మంది ఉన్నారు. ఇదే సమయంలో మృత శిశువుల జననాలూ పెరగడం బాధాకరం. వీరి సంఖ్య 2020లో ఒకటి మాత్రమే కాగా, ఆ తర్వాత ఏడాది ఏకంగా 11కు పెరిగింది. గర్భిణుల్లో



ఎనీమియా, పోషకాహార లోపం, ఇతర అనారోగ్య సమస్యల వల్లే మృత శిశు జననాలకు కారణమని వైద్యులు చెబుతున్నారు.

**మరణాల్లో మగవారే అధికం**

నాలుగైదేళ్ల క్రితం సంభవించిన మరణాల్లో మగవారే అధికంగా ఉన్నారు. 2020లో మొత్తం 8,384 మంది మరణించగా వారిలో 4,640, ఆ తర్వాత ఏడాది 11,984 మంది చనిపోగా వారిలో 7,304 మంది పురుషులే. కొవిడ్ సమయంలో మహిళల కంటే పురుషులే ఎక్కువగా ప్రభావితమయ్యారు. మహమ్మారి విజృంభణతో తలెత్తిన ఆర్థిక సంక్షోభం అత్యధిక ఆత్మహత్యల్ని పురిగొల్పింది. పలువురు మద్యపానం, మత్తు, ఇతర వ్యసనాలబారిన పడ్డారు. మృతుల్లో 60-69 ఏళ్ల వయసువారు ఎక్కువగా ఉన్నట్లు నివేదికలో వెల్లడైంది.

**ఆడపిల్లల సంఖ్య తగ్గుతోంది..**

ఆకాశంలో సగం.. అంటూ కీర్తించే ఆడ శిశువుల జననాల రేటు కరోనా సమయంలో తగ్గడం గమనార్హం. జిల్లాలో 2020లో 9,010 మంది మగ, 8,279 మంది ఆడ పిల్లలు పుట్టారు. 2021లో 14,059 మంది మగ, 12,445 మంది ఆడ శిశువులు జన్మించారు. 2020లో ఆడ, మగ మధ్య వ్యత్యాసం కేవలం 731 కాగా, మరుసటి ఏడాదికి అది 1,614కి పెరిగింది. చట్టవిరుద్ధమైన లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడ శిశువులను పురిట్లోనే తుంచివేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అందుకే వారి జనన నిష్పత్తి రేటు తగ్గుతోంది.

# స్మార్ట్ చెక్-42

జగిత్యాల : చిన్నారుల్లో లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. మొదట్లోనే లోపాలను గుర్తించి ఉత్తమ భవిష్యత్తు అందించేలా సన్నాహాలు చేస్తోంది. ఎన్ఐఈపీఐడీ(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిసెబిలిటీస్) పేరిట స్మార్ట్ చెక్-42 సర్వే ప్రారంభించింది. ప్రతి జిల్లాలో మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల వారీగా అయిదేళ్లలోపు చిన్నారులపై చేపట్టిన సర్వే నెలాఖరులోగా పూర్తి కానుంది. సర్వే పూర్తయ్యాక ఫలితాల ఆధారంగా గుర్తించిన లోపాలకు అవసరమైన చికిత్స అందించి సవరించేలా రాష్ట్ర ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది.

**8 విభాగాలు.. 42 ప్రశ్నలు..**

ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో 5 ఏళ్లలోపు పిల్లలందరిని సర్వే చేయాల్సి ఉంటుంది. స్మార్ట్ చెక్-42 సర్వేలో మొత్తం 42 ప్రశ్నలు ఉండగా, 8 విభాగాలుగా సర్వే ఫార్మాట్ను రూపొందించారు. ఇందులో



పుట్టిన వెంటనే 2 నెలలలోపు, 3 నుంచి 5 నెలల లోపు, 6 నుంచి 11 నెలలు, 12 నుంచి 23, 24 నుంచి 35, 36 నుంచి 47, 48 నుంచి 59 నెలల వరకు ఇలా మొత్తం 8 విభాగాల్లో ఒక్కో దానిలో భిన్నమైన ప్రశ్నలు చేర్చారు. చిన్నారి పుట్టిన వెంటనే ఏడ్చాడా?, తల్లిదండ్రులు, సంరక్షకుల స్వరానికి స్పందిస్తున్నాడా? పాలు తాగడంలో ఇబ్బందులు ఇలా ఒక్కో విభాగంలో ఆయా వయసులో ఎదురయ్యే లోపాలను గుర్తించే విధంగా ప్రశ్నావళి రూపొందించారు. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాల ఉపాధ్యాయినులు తమ చరవాణిలోని యాప్‌లో ఎస్ లేదా నో, ఇతర వివరాలుంటే వాటిని నమోదు చేస్తున్నారు. ప్రతి చిన్నారికి సంబంధించిన సర్వే వివరాలు న్యూట్రీషనల్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్ సర్వర్‌లో నిక్షిప్తం అవుతాయి. సర్వే ఫలితాల ఆధారంగా ఏమైనా లోపాలుంటే, అవసరమైన చికిత్స తదితర చర్యలు తీసుకోనున్నారు.

**అయిదేళ్లలోపు చిన్నారులు 64,329**

జిల్లాలో మొత్తం 1065 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటి పరిధిలో 5 ఏళ్లలోపు 64,329 మంది చిన్నారులు ఉన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు నెల రోజుల్లో సర్వే పూర్తి చేయాల్సి ఉంది. స్మార్ట్ చెక్-42 సర్వే ప్రారంభించి పది రోజులు కావస్తుండగా ఇప్పటి వరకు 31,936 మంది చిన్నారుల సర్వే పూర్తయింది.

**నెల రోజుల్లో పూర్తి**

చిన్నారుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించి లోపాలను సవరించేందుకు స్మార్ట్ చెక్ సర్వే ప్రారంభించి పది రోజులు అయింది. అంగన్‌వాడీ కేంద్రాల వారీగా ఉపాధ్యాయినులు చేపట్టిన సర్వే ఇప్పటికే సగం వరకు పూర్తయింది. ఉపాధ్యాయినులు సర్వేలోని ప్రశ్నలను సునిశితంగా ఆకలింపు చేసుకొని సమాధానాలను నమోదు చేస్తేనే చిన్నారులకు న్యాయం జరుగుతుంది. నెల రోజుల్లో సర్వే పూర్తి చేసేందకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. డాక్టర్ బి.నరేశ్‌కుమార్, జిల్లా సంక్షేమాధికారి

# ఖరీఫ్ ప్రణాళిక ఖరారు

వికారాబాద్: ఖరీఫ్ సాగు సీజన్‌కు సంబంధించిన పంటల సాగు ప్రణాళిక ఖరారైంది. ఇందుకు సంబంధించిన నివేదికను జిల్లా వ్యవసాయాధికారులు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. అధికారుల అంచనా ప్రకారం జిల్లా వ్యాప్తంగా 5.95 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉంది. లక్ష క్వింటాళ్లలో విత్తనాలు, 95 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల కోసం కార్యాచరణ రూపొందించారు. అయితే విత్తనాలకు ప్రభుత్వం రాయితీ ఇవ్వకపోవడంతో ప్రైవేటు దుకాణాల్లోనే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

**పత్తి వైపే మొగ్గు..**

వానాకాలం సీజన్‌లో అత్యధికంగా పత్తి పంట వైపే రైతులు మొగ్గు చూపుతున్నారు. క్వింటాలు ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521 ఉండటం, బహిరంగ విపణిలో ధర రూ.8 వేల వరకు పలకడమే ఇందుకు కారణం. గతేడాది 2.45 లక్షల ఎకరాల్లో పత్తి పంట వేయగా ఎకరాకు సగటున 6 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. అయినా క్వింటాలుకు గరిష్ఠంగా రూ.7,500 అమ్ముడుపోయింది. పత్తికి బదులు ఇతర పంటలు సాగు చేసిన రైతులు నష్టాలు ఎదుర్కొన్నారు.

**మొక్కజొన్నకు డిమాండ్**

బహిరంగ విపణిలో మొక్కజొన్నకు డిమాండు ఉండటంతో జిల్లాలో 80 వేల ఎకరాల్లో సాగు చేయనున్నారని అంచనా. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,225 కాగా బహిరంగ విపణిలో రూ.2,300 నుంచి రూ.2350 వరకు పలుకుతోంది. గత సీజన్‌లో కేవలం 75 వేల ఎకరాలకే పరిమితం కాగా ఈ సారి మరో 5 వేల ఎకరాలు పెరగనుంది.

**వరి సాగు తగ్గేలా..**

జిల్లాలో వరి పంట సాగును 1.1 లక్షల ఎకరాలకే పరిమితం చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత సీజన్‌లో 1.2 లక్షల ఎకరాల్లో సాగైంది. ధాన్యానికి మద్దతు ధర క్వింటాలుకు రూ.2,320 ఉండటం, సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో వరి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. అయినా ప్రత్యామ్నాయ పంటల వైపుగా రైతులను మళ్లించే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**1.4 లక్షల ఎకరాల్లో కంది..**

1.4 లక్షల ఎకరాల్లో కంది సాగు కానుందని అంచనా వేశారు. గత సీజన్ కంటే 5 వేల ఎకరాల విస్తీర్ణం పెంచేలా అధికారులు రైతులను సన్నద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలుకు రూ.7,550 ప్రకటించగా, బహిరంగ విపణిలో మద్దతు రూ.8 వేల వరకు పలుకుతోంది. పైగా అంతర పంటగా అపరాలు(పెసర), మినుము, మొక్కజొన్న చేసుకునే అవకాశం ఉండటంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

**కొరత లేకుండా చర్యలు**

మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి. ఈసారి పత్తి, కంది పంటలు అధిక విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం ఉంది. ఇందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. క్లస్టర్ల వారీగా ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నాం.

# కడసారి వీడ్కోలుకూ కన్నీటి కష్టాలే



కరీంనగర్ : జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ పరిధిలో శ్మశాన వాటికల్లో కనీస వసతులు కరవయ్యాయి. కడసారి వీడ్కోలు పలుకుదామని వచ్చిన వారికి నీటి కష్టాలు ఎదురవుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు తగినట్లుగా వాటిని అభివృద్ధి చేయడంలేదు. ఉన్న వాటిలో ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు అంచనాలు, ప్రతిపాదనలకు తగ్గట్లు లేకపోవడం.. అసంపూర్తి పనులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తుది దశలో నిలిచిపోయిన పనులు పూర్తి చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

**పూర్తయ్యేదెన్నడు?**

శ్మశానవాటికల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లే చేసి తుది దశలో ఆపేశారు. నిధుల కొరత, బిల్లుల చెల్లింపులో ఏర్పడిన జాప్యంతో గుత్తేదారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోగా, అధికారులు సైతం పట్టనట్లుగా ఉంటున్నారు. ప్రధానగంగా కారా?నగడ్డ, కిసాన్‌నగర్ బీట్ మార్కెట్‌లో ఉన్న విద్యుత్తు సరఫరా లేకపోవడంతో చీకటిగా ఉంటుంది. స్తంభాలు ఉన్నా.. వీటికి నియంత్రిక దగ్గర నుంచి కనెక్షన్ తీసుకోవడంలేదు. గతంలో ఉన్న కనెక్షన్ తొలగించారు. నీళ్ల వసతి అసలే లేదు. స్నానాల గద%రి%లకు తాళాలు ఉంటున్నాయి. బోర్‌వెల్ ఉన్నా పని చేయడంలేదు. ఆదర్శనగర్‌లో బోరింగ్ ఉంది. మీటర్ లేకపోవడంతో అయిదేళ్లుగా శ్మశానవాటికకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. సవారన్ వీధిలో ఉన్న వైకుంఠధామం పరిస్థితి అలాగే ఉంది. సమాధుల్లో వీధిదీపాలు వెలగడంలేదు.

**నిధులు కేటాయించినా పనులేవీ?**

నగరవ్యాప్తంగా 22 వైకుంఠధామాలు ఉండగా వీటికి పలు రకాల నిధులు కేటాయించారు. ఇందులో 13 చోట్ల అభివృద్ధికి అయిదేళ్ల కిందట సీఎంఏ, పట్టణ ప్రగతి, సాధారణ, సీడీపీ, ఎస్సీ సబ్‌ప్లాన్, ఆర్థిక సంఘం కింద రూ.12.37 కోట్లు కేటాయించారు. వీటితోపాటు ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ మైనార్టీల శ్మశాన వాటికలకు తగిన ప్రాధాన్యం ఇచ్చారు. నిధులు కేటాయించినా ఆ పనులు మాత్రం ఇప్పటికీ పూర్తి కాలేదు. అలకాపురి, మార్కండేయనగర్, మానేరు వాగులో కొంతమేర బాగున్నా మిగతా వాటిల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది.

**ట్యాంకర్లే దిక్కు**

హిందూ సంప్రదాయం ప్రకారం దహన సంస్కారాలు పూర్తయిన తర్వాత స్నానాలు చేయాల్సి ఉంటుంది. స్నానాల గదులు ఉన్నా వినియోగంలోకి తీసుకురావడంలేదు. అందులో నీటివసతి, వీధిదీపాలు లేకపోవడం, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంతో అత్యవసర సమయాల్లో ప్రజలు ట్యాంకర్ల దగ్గర నిలబడి స్నానాలు చేసే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా నగర పాలక అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించేలా చొరవ చూపాలని నగరవాసులు కోరుతున్నారు.

# ‘దారి’కొస్తాయా?




సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వం చొరవ.. కేంద్రం సానుకూల దృక్పథంతో రాష్ట్ర రహదారులను జాతీయ రహదారుల ప్రకటించి ఎనిమిదేళ్లవుతోంది. సిరిసిల్ల, కామారెడ్డి (ఎన్‌హెచ్-161). సిరిసిల్ల, సిద్దిపేట (ఎన్‌హెచ్ 365-బి) నంబర్లు కేటాయించారు. దాని తర్వాత ఒక్క అడుగు ముందుకు పడలేదు. సిరిసిల్ల, సిద్దిపేట రహదారిని కోరుట్ల వరకు పొడిగించడం.. సిరిసిల్ల, పిట్లం జాతీయ రహదారుల హోదా కల్పించాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఇటీవల లేఖ రాశారు. ఈ రెండు జాతీయ రహదారులుగా మారితే జిల్లా పారిశ్రామికంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధికి మరింత అవకాశం ఉంది.

**పెరిగిన వాహనాల రద్దీ**

కరీంగనర్, సిరిసిల్ల, కామారెడ్డి, ఎల్లారెడ్డి, పిట్లం వరకు 149 కిలోమీటర్ల రహదారి ఉంది. కరీంనగర్ సర్కిల్ పరిధిలో 73 కిలోమీటర్ల మేర రహదారి ఉంది. ఈ పనులకు సంబంధించి సర్వే పూర్తయింది. డీపీఆర్ తయారీకి రూ.3.63 కోట్లు కేటాయించారు. సర్వే పత్రాలు 2018లో దిల్లీలోని మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు, హైవే శాఖ (ఎంవోఆర్‌టీహెచ్-మోర్త్) పరిశీలనకు పంపారు. దాని తర్వాత నుంచి ఎలాంటి కదలికలేదు. రాష్ట్ర ప్రభుత్వం రూ.80 కోట్లతో కరీంనగర్-సిరిసిల్ల మార్గంలో నాలుగు వరుసల రహదారిగా విస్తరించింది. ఇటు సిరిసిల్లలో రూ.100 కోట్లతో సిరిసిల్ల-కామారెడ్డి రెండో బైపాస్‌ను నిర్మించింది. జాతీయ రహదారి హోదా లభించినా ఈ మార్గంలో ప్రధాన ఇబ్బందుల్లేవు. జిల్లా కేంద్రం నుంచి సిద్దిపేట, జనగామ, సూర్యాపేటలను కలిపే రహదారి పొడవు 182 కి.మీ. సిద్దిపేట జిల్లా పరిధి దుద్దెడ నుంచి సూర్యాపేట వరకు డీపీఆర్ పూర్తయింది. దీనికి వేములవాడ-కోరుట్లకు 35 కి.మీ.పొడిగించాలని కోరారు. సిద్దిపేట డివిజన్ నుంచి సర్వే జరుగుతోంది. మార్పులు, చేర్పుల తర్వాత డీపీఆర్ రూపొందించే అవకాశం ఉంటుంది.

కరీంనగర్-సిరిసిల్ల మార్గంలో వాహనాల రద్దీ పెరిగింది. ఈ మార్గంలో ప్యాసింజర్ కోర్ యూనిట్ (పీసీయూ) 30 వేలు ఉంది. సిరిసిల్ల-కామారెడ్డి మార్గంలో 15 వేలు, సిరిసిల్ల-సిద్దిపేట మార్గంలో 15 వేలు ఉంది. పది వేలలోపు పీసీయూ ఉంటే నాలుగు వరసల జాతీయ రహదారి, పదివేలు దాటితే ఆరు వరసలతో ఎన్‌హెచ్ఏఐ పరిధిలోకి వెళ్తుంది. ఎన్‌హెచ్ఏఐ పరిధిలోకి వెళ్లినా ఆయా పనుల్లో ఏళ్లుగా కాలయాపన జరుగుతోంది.

**ఆధ్యాత్మిక కారిడార్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను కలుపుతూ ప్రత్యేక ఆధ్యాత్మిక, పర్యాటక కారిడార్ అభివృద్ధి చేయాలనే ప్రతిపాదన చేసింది. దీనికి కేంద్ర ప్రభుత్వ సాయం తోడైతేనే ఇది పూర్తిస్థాయిలో అమలు జరుగుతుంది. దీనిలో ప్రధానంగా కొమురవెల్లి, వేములవాడ, కొండగట్టు పుణ్యక్షేత్రాలను కలుపుతూ ప్రత్యేక కారిడార్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది. జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణం జరిగితే రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే వారు ఈ మూడు ప్రసిద్ధ ఆలయాలతోపాటు బాసర సరస్వతీ, ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రాలకు వెళ్లడం సులభం అవుతుంది.


# షరామామూలు.. ఫిర్యాదులొస్తే చర్యలు

పెద్దపల్లి: అనుమతించిన దాని కంటే అధిక పరిమాణంలో మట్టి తరలించడంపై ఫిర్యాదులు రావడంతో పంట పొలాల్లో నిల్వ చేసిన అక్రమార్కులు.. ఆ మట్టిని తాజాగా బట్టీలకు తరలించడం జిల్లాకేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. మైనింగ్ అధికారులు కొందరికి అనుకూలంగా, మరికొందరికి ప్రతికూలంగా వ్యవహరిస్తుండటంతోనే దందా యథేచ్ఛగా సాగుతోందన్న ఆరోపణలున్నాయి. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ శివారులో 2023లో ఇటుక బట్టీల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేస్తారన్న భయంతో యజమానులు పంట పొలాల్లో భారీ మొత్తంలో మట్టిని నిల్వ చేశారు. రాఘవాపూర్ సమీపంలోనూ లక్ష మెట్రిక్ టన్నుల వరకు ఉంచారు. అలా నిల్వ చేసిన మట్టిని వారం రోజులుగా బట్టీలకు తరలిస్తున్నారు. దీనిపై గ్రామస్థులు మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

**నిద్ర మత్తులో గనుల శాఖ**

జిల్లాలో మట్టి రవాణాతో పాటు, ఇసుక అక్రమ తరలింపుపై భూగర్భ గనుల శాఖ అధికారులు ఆది నుంచీ తప్పించుకునే మార్గాలనే అన్వేషిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఫిర్యాదులు చేయడం, కోర్టులను ఆశ్రయిస్తేనే సమస్యలు పరిష్కారమవుతున్నాయి. గతంలో మానేరు నుంచి ఇసుక రవాణాపై గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశాలు వచ్చేవరకు మైనింగ్ అధికారులు స్పందించలేదు. చెరువుల మట్టి తవ్వకాలపైనా నీటిపారుదల శాఖపైనే భారం వేస్తున్నారు. గుర్తించిన చెరువులెన్ని? ఎంత లోతు నుంచి మట్టి తీస్తున్నారు? అనుమతించిన పరిమాణం ఎంత? ఎంత తరలిస్తున్నారు? వంటి కనీస అంశాలపైనా తనిఖీలు చేయకుండానే ఫిర్యాదులను పక్కన పెట్టడం పరిపాటిగా మారింది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుంటే తప్ప జిల్లా అధికారుల్లో మార్పు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

**అక్కడ అలా.. ఇక్కడ ఇలా..**



పెద్దపల్లి మండలం కొత్తపల్లి చెరువు నుంచి మట్టిని అధిక పరిమాణంలో తరలించడంపై గతంలో కొందరు ఫిర్యాదు చేయడంతో అక్కడి పంట పొలాల్లోనే నిల్వ చేశారు. ఈ ఏడాది మార్చిలో నిల్వ చేసిన మట్టిని బట్టీలకు తరలించే క్రమంలో సదరు ఫిర్యాదుదారుడు స్థానిక అధికారుల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించిన మైనింగ్ అధికారులు సదు మట్టి కుప్పలను సర్వే చేసి, రవాణాదారులకు రూ.2.31 కోట్ల జరిమానా విధించారు. తాజాగా రాఘవాపూర్ శివారులో నిల్వ చేసిన మట్టిని తరలించడంపై అధికారులు కనీస విచారణ కూడా చేపట్టడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేసి, వెంటపడితే తప్ప విచారణ చేపట్టే పరిస్థితి లేకుండా పోయింది. కనీసం తరలించే మట్టికి రాయల్టీ చెల్లించారా..! గతంలో ఎంత చెల్లించారు..! ఎంత నిల్వ చేశారు..! అనే అంశాలపై కనీస సర్వేలు కరవయ్యాయి.

# సికింద్రాబాద్‌లో స్కైవాక్ నిర్మాణానికి ప్రణాళిక

హైదరాబాద్: సరికొత్తగా ముస్తాబవుతున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను నలువైపులా అనుసంధానం చేసేందుకు అక్కడ స్కైవాక్ నిర్మాణానికి హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ముందుకొచ్చింది. కన్సల్టెంట్ ఎంపిక కోసం తాజాగా హెచ్ఎండీఏ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ స్టేషన్ నుంచి నిత్యం 80 ఎక్స్‌ప్రెస్‌లు, 100 వరకు ప్యాసింజర్, ఇతర రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. వచ్చే 30 ఏళ్లకు సిద్ధం చేస్తున్న మహానగర మొబిలిటీ ప్లాన్‌లో భాగంగా రైల్వేస్టేషన్ చుట్టూ అనుసంధానంగా 800 మీటర్ల దూరంతో స్కైవాక్ నిర్మించనున్నారు. రూ.30 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. ప్రస్తుతం రేతిఫైల్ బస్టాండ్ నుంచి మెట్రో ఈస్ట్ స్టేషన్ అనుసంధానమై ఉంది. వెస్ట్ వైపు మెట్రో స్టేషన్‌తో పూర్తి అనుసంధానం లేదు. రైల్వేస్టేషన్‌లో ఒకటో నంబరు ప్లాట్‌ఫారం వరకు కొంతదూరం నడవాలి. స్టేషన్ ఎదురుగా బస్టాండుకు వెళ్లాలన్నా, అటువైపు నుంచి మెట్రో దిగే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.



**ప్రయాణికులకు వెసులుబాటు**

సికింద్రాబాద్ స్టేషన్ నుంచి సాధారణ రోజుల్లో నిత్యం 2.50 లక్షల మంది రాకపోకలు సాగిస్తుంటారు. పండగల వేళ ఈ సంఖ్య 3.50 లక్షల పైనే ఉంటుంది. సుమారు వెయ్యి బస్సులు స్టేషన్ మీదుగా వెళ్తుంటాయి. బస్ స్టేషన్లు, మెట్రో నుంచి నేరుగా అనుసంధానం లేకపోవడంతో ప్రయాణికులు హడావుడిగా పిల్లలు, లగేజీతో పరుగులు తీస్తున్నారు. కొందరు ప్లాట్‌ఫారం 1 నుంచి , మరికొందరు 10 నుంచి స్టేషన్ లోపలకు వస్తుంటారు. టికెట్ తీసుకొని వెళ్లే సరికి కొన్నిసార్లు ఎక్కాల్సిన రైళ్లు వెళ్లిపోతుంటాయి. నేరుగా స్టేషన్ లోపలకు వచ్చేలా స్కైవాక్‌లు ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు వెసులుబాటు కలుగుతుంది. ప్రస్తుతం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు సాగుతున్నాయి. ఇవి పూర్తయ్యేలోగా స్కైవాక్ పనులు కూడా చేపట్టాలని హెచ్ఎండీఏ యోచిస్తోంది.

# పంపిణి ఆగి.. సంఖ్య పెరిగి


వేములవాడ : దక్షిణ కాశీగా పేరొందిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో కోడెలు మృత్యువాత పడటం ఆందోళన కలిగిస్తోంది. గత కొన్ని నెలలుగా అర్హులైన రైతులకు కోడెల పంపిణీ నిలిచి పోవడంతో గోశాలలో వాటి సంఖ్య రెట్టింపైంది. దీంతో వాటి సంరక్షణ ఆలయ అధికారులకు భారంగా మారింది. కోడె మొక్కుల ద్వారా ఆలయానికి కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతున్నప్పటికీ వాటి పర్యవేక్షణపై నిర్లక్ష్యం నెలకొందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ కారణంగా కోడెలు అనారోగ్యం బారిన పడటం, మరికొన్ని మృత్యువాత పడటం జరుగుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తులు సమర్పించే కోడెలను ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో సంరక్షిస్తుండగా ఆలయంలో తిరిగే కోడెలు, ఆవులను ఆలయం సమీపంలోని కట్టకింద గోశాలలో సంరక్షిస్తుంటారు. వీటి సంరక్షణకు ఏటా రూ.50 లక్షలకు పైగా వెచ్చిస్తున్నారు. వీటికి ఎండుగడ్డి, పచ్చిమేత, దాణా, ఎండ వేడిమి తగల కుండా షెడ్లలో ఫాగర్స్ వంటివి ఏర్పాటు చేస్తున్నప్పటికీ కోడెలు మృత్యువాత పడటం ఆందోళన కలిగిస్తోంది.

**రైతుల ఎదురుచూపులు**

గత కొంత కాలంగా తిప్పాపూర్ గోశాల నుంచి రైతులకు కోడెల పంపిణీ నిలిచి పోయింది. రెండువేలకు పైగా రైతులు కోడెల కోసం దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో కోడెలను అర్హులైన రైతులకు పంపిణీ చేస్తే కొంత వరకు భారం తగ్గే అవకాశం ఉంది. గత ఏడాది మూడు విడతల్లో దాదాపు 1975 కోడెలను పంపిణీ చేశారు. ఆ తరువాత పంపిణీ నిలిచి పోయింది. కోడెల పంపిణీ కమిటీ ఇప్పటికైన నిర్ణయం తీసుకొని త్వరగా పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

**మృతికి అనేక కారణాలు..**

గోశాలలో సర్వ సాధారణంగా మూడు వందల వరకు కోడెలు ఉండేందుకు సౌకర్యాలున్నాయి. పంపిణీ నిలిచి పోవడంతో వీటి సంఖ్య



ప్రస్తుతం రెండు వేల వరకు చేరింది. అదనంగా చలువ పందిళ్లు వేసినప్పటికీ అవి సరిపోవడం లేదు.

పాలు మరవని చిన్న కోడెలను, జెర్సీ కోడెలను భక్తులు స్వామివారికి సమర్పించేందుకు తీసుకు వస్తున్నారు. కొందరు అనారోగ్యంతో ఉన్నవాటిని, బలహీనంగా ఉన్నవాటిని సమర్పిస్తున్నారు. ఇలాంటి వాటిని అధికారులు తిరస్కరిస్తున్నా ఆలయ పరిసరాల్లో వదిలి వెళుతున్నారు. ఇలాంటి వాటిని తీసుకువచ్చి సిబ్బంది ప్రత్యేక షెడ్డులో వేసి సంరక్షించాల్సి ఉండగా వాటిని మిగతా కోడెల్లో కలిపేస్తున్నారు. దీంతో అవి మరింత అనార్యోగం పాలై మృతి చెందుతున్నాయి.

గోశాలలో చిన్న కోడెలను సిబ్బంది వేరు చేయక పోవడంతో పెద్ద కోడెలు చిన్నవాటిని తోసేస్తున్నాయి. ఇలాంటి సందర్భంలో చిన్నవి గాయాల పాలు కావడంతో పాటు అనారోగ్యం బారిన పడుతున్నాయి.

**సంరక్షణపై ప్రత్యేక చర్యలు** గోశాలలోని కోడెల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. కొంతమంది భక్తులు పాలు మరవని, అనార్యోగంతో ఉన్నవాటిని మొక్కు చెల్లించేందుకు తీసుకువస్తున్నారు. కమిటీ సమావేశం తరువాత కోడెల పంపిణీపై చర్యలు తీసుకుంటాం. వినోద్‌రెడ్డి, ఈవో రాజన్న ఆలయం

చురకలు



# రోడ్డు తవ్వేస్తామంటూ.. అడ్డగోలు ప్రతిపాదనలు

హైదరాబాద్: నగరం నలుమూలల నుంచి రహదారుల తవ్వకాల కోసం ఇంజినీర్లు పంపుతున్న ప్రతిపాదనలు అడ్డగోలుగా ఉంటున్నాయని జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. పూర్తి వివరాలు పేర్కొనకుండా ప్రతిపాదనలు పంపిస్తుండటంపై ముఖ్య ఇంజినీరు(సీఈ) సహదేవ్ రత్నాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపాదనలు నమూనాలతో ఆయన తాజాగా ఇంజినీర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు.

**మార్గదర్శకాలు ఇలా..**

10మీటర్ల పొడవున రోడ్డును తవ్వేందుకు సర్కిల్ స్థాయిలో కార్యనిర్వాహక ఇంజినీరు.. 10నుంచి 15మీటర్ల మధ్య జోన్ స్థాయిలోని సూపరింటెండెంట్ ఇంజినీరు అనుమతి తీసుకోవాలి. అంతకన్నా పెద్ద ప్రతిపాదనలను ముఖ్య ఇంజినీరు ఆమోదిస్తారు.

తవ్విన రోడ్లను పునరుద్ధరించే పనులకు పరిపాలన అనుమతి కావాలంటే.. ఆయా రహదారులను తవ్వడానికి ప్రజలు లేదా సంస్థ పెట్టుకున్న అర్జీని జత చేయాలి.జీ.వో.నెం.53 ప్రకారం చదరపు



మీటరు తారురోడ్డు తవ్వేందుకు రుసుమును కచ్చితంగా అంచనా వేయాలి. లోపాలకు ఇంజినీర్లే బాధ్యులు.

**తప్పని విమర్శలు**

ఈ మార్గదర్శకాలపై విమర్శలొస్తున్నాయి. రహదారి తవ్వకానికి అంచనాలు రూపొందించడంతోపాటే.. ఆ రోడ్డును పునరుద్ధరించేందుకు అవసరమైన టెండరు నోటిఫికేషన్ రూపుదిద్దుకోవాలి. పునరుద్ధరణ పనులకు గుత్తేదారును సిద్ధం చేశాకే.. తవ్వకం అనుమతి జారీ అవ్వాలి. గతంలోని ఈ నిబంధనను చీఫ్ ఇంజినీరు కార్యాలయం పట్టించుకోవట్లేదనే ఆరోపణలొస్తున్నాయి. రోడ్డు తవ్వకం పనులు పూర్తయ్యాక పునరుద్ధరణ పనులకు ప్రతిపాదనలు పంపాలన్న సీఈ ఆదేశాలు సరికాదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తారు రోడ్డును చదరపు మీటరు తవ్వితే రూ.4,550, సీసీ రోడ్డును తవ్వితే రూ.3,688ల రహదారి పునరుద్ధరణ రుసుమును వసూలు చేయాలనే నిబంధనను జీహెచ్ఎంసీ గుడ్డిగా అనుసరిస్తోంది. తారు రోడ్డుతో పోలిస్తే.. నాలుగు రెట్ల అదనపు ఖర్చుతో వీడీసీసీ రోడ్ల నిర్మాణం జరుగుతోంది. పునరుద్ధరణ రుసుము మాత్రం తారు రోడ్డుకన్నా తక్కువ ఉండటం విమర్శలకు తావిస్తోంది.

# చల్లగా వచ్చి దోచుకెళ్లాడు

కరీంనగర్ : అర్ధరాత్రి సమయంలో చల్లగాలి కోసం ఇంటి ప్రధాన తలుపు తీసి, జాలి తలుపు వేసుకొని నిద్రిస్తే ఓ దుండగుడు ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను అపహరించుకుపోయాడు. కరీంనగర్ రెండో ఠాణా సీఐ సృజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ సప్తగిరికాలనీకి చెందిన నేరెళ్ల రమేశ్‌గౌడ్ రెండేళ్లుగా ఆదిలాబాద్ భుక్తపూర్‌లో మెడికల్ ఏజెన్సీని నిర్వహిస్తున్నారు. సోమవారం తన భార్య సోదరుడి కుమారుడు నామకరణం ఉండటంతో రమేశ్‌గౌడ్, అతని భార్య సుజాత ఆదివారం కరీంనగర్‌కు వచ్చి శుభకార్యానికి కావాల్సిన వస్తువులు కొనుగోలు చేసి అర్ధరాత్రి ఇంటికి వచ్చారు. ఇంట్లో చల్లగాలి కోసం రెండు వైపులా ఉన్న తలుపులు తీసి జాలి డోర్లను దగ్గరకు వేసి నిద్రించారు. ఉదయం శుభకార్యానికి వెళ్లేందుకు బంగారు ఆభరణాలు, నగదును ఒక సంచిలో వేసి ఉంచారు. సోమవారం ఉదయం లేచి నామకరణం వేడుకకు వెళ్లేందుకు సిద్ధంకాగా ఆభరణాల సంచి కనిపించలేదు. రూ.2.62 లక్షల విలువగల ఆభరణాలు, బీరువాలోని రూ.35 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నగర ఏసీపీ వెంకటస్వామి, సీఐ సృజన్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాను పరిశీలించగా ఓ యువకుడు ఇంట్లోకి ప్రవేశించినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

# సర్కారు బడుల్లో సౌకర్యాలపై ఆరా

పెద్దపల్లి : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పాఠశాలలు బలోపేతం అవుతున్నా.. బాలల ప్రవేశాలు పెరగడంలేదు. విద్యార్థుల సామర్థ్యాలు ఆశించిన స్థాయిలో ఉండటంలేదు. ఏటా ప్రభుత్వానికి విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు వాటిపై గణాంకాలు అందిస్తున్నా మార్పు ఎందుకు రావడం లేదనే ప్రశ్న తలెత్తుతుంది. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు వాటి పరిస్థితి ఎలా ఉందనే దానిపై రాష్ట్ర విద్యాశాఖ సర్వే చేపట్టేందుకు ముందుకొచ్చింది. ఈనెల 21 వరకు ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో కరీంనగర్ సమీపంలోని 130 మంది డైట్ కళాశాల ఛాత్రోపాధ్యాయులు దీనిపై సర్వే చేపడుతున్నారు. **పొందుపరిచిన వివరాల ఆధారంగా**

ఏటా ఉమ్మడి జిల్లాలో పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయులు యూడైస్ ప్లస్‌లో వివరాలను ప్రామాణికంగా పొందుపరుస్తున్నారు. వాటి ఆధారంగానే వాటిలో సౌకర్యాల కల్పన, ఇతరత్రా వాటికి ప్రభుత్వాలు బడ్జెట్‌లు కేటాయిస్తున్నాయి. అన్ని యాజమాన్యాల పాఠశాలలకు తోడు జూనియర్ కళాశాలల సమగ్ర వివరాలను ఇందులో నమోదు చేస్తున్నారు. వాటిలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, ఖాళీలు, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, తరగతి గదుల పరిస్థితి, క్రీడా మైదానాలు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, తాగునీరు తోపాటు కొరతగా ఉన్న వాటి వివరాలను ప్రధానోపాధ్యాయులు పొందుపరుస్తున్నారు. **ఒక్కొక్కరికి 10 పాఠశాలలు**

ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గాకుండా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న వాటిల్లో ఈ సర్వే చేపడుతున్నారు. ఒక్కొక్కరు నిత్యం 10 పాఠశాలలను సందర్శించి పాఠశాల విద్యా ప్రామాణిక రిపోర్టు ఆధారంగా సర్వే చేస్తారు. వాస్తవ పరిస్థితుల వివరాలను యూడైస్ ప్లస్‌లో నమోదు చేశారా? విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలు ఏ మేరకు ఉన్నాయనేది పరిశీలించి ధ్రువీకరించనున్నారు. వాటిలో తప్పులుంటే సరి చేయాలని రిమార్కులు అందిస్తారు. అప్పటికప్పుడు సీఆర్పీల సాయంతో ప్రధానోపాధ్యాయులు సరిచేస్తారని.. కరీంనగర్ జిల్లా సమగ్ర శిక్షా ప్లానింగ్ కో-ఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

# రుచి, శుచికి హామీ



హైదరాబాద్ : రుచికరమైన వంటలకు హైదరాబాద్ చిరునామా. దేశవిదేశాల నుంచి ఎవరొచ్చినా.. బిర్యానీ, ఇతర తెలంగాణ వంటలు రుచి చూసి సంతోషంగా వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో రాజధాని కేంద్రంగా రుచితోపాటు శుచికరమైన ఆహారాన్ని హామీగా అందించేందుకు జీహెచ్ఎంసీ నడుం బిగించింది. రాష్ట్ర వైద్యారోగ్యశాఖతో కలిసి నగరంలో ఐదు కొత్త ఆహార పరీక్ష కేంద్రాలు నెలకొల్పేందుకు కమిషనర్ ఇలంబర్తి నిర్ణయం తీసుకున్నారు. జోనల్ కమిషనర్లు స్థలాలను గుర్తిస్తున్నారు. ఆయా కేంద్రాలు అందుబాటులోకి వస్తే.. హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర ఆహార విక్రయ కేంద్రాల్లో తనిఖీలు పెరగనున్నాయి.

జడ్సీలకు అధికారం: బల్దియా కేంద్ర కార్యాలయం నుంచి పనిచేస్తోన్న ఆహార భద్రత విభాగాన్ని తాజాగా ఆరోగ్యశాఖ కమిషనర్ వికేంద్రీకరించారు. ఐదుగురు జోనల్ కమిషనర్లకు ఇన్‌ఛార్జి డిజిగ్నేటెడ్ అధికారి(డీఓ) హోదాను కేటాయించి, ఆహార భద్రతాధికారులను వీరి కింద పనిచేసేట్టు ఉత్తర్వులిచ్చారు. వారి ఆధ్వర్యంలో లైసెన్సుల జారీ, ఐదు కేంద్రాలు నిర్మించాలని కమిషనర్ లక్ష్యం నిర్దేశించారు.

**మూడు రకాలుగా పరీక్షలు..**

వ్యవసాయ ఉత్పత్తులు, ప్యాకేజీల్లోని పదార్థాల నమూనాలను సేకరించి అవి ప్రమాణాల మేరకు ఉన్నాయా, లేదా అని తెలుసుకునేందుకు పరీక్షలు ఉపయోగపడతాయి.

రసాయన: తృణధాన్యాలు, పప్పులు, నూనెలు, కొవ్వు పదార్థాలు, ఆకులు, మూలికలు, సుగంధ ద్రవ్యాలు, మసాలా దినుసులు, పాలు, డెయిరీ వస్తువులకు రసాయన పరీక్షలు జరిపి, వాటిలో కలిసిన రసాయనాలు, ఇతరత్రా లోపాలను పరీక్షిస్తారు.

కల్తీ అయిందా..: ప్యాకేజీల్లోని పదార్థాలు, పచ్చళ్లు, సుగంధద్రవ్యాలు, శీతల పానియాలు, సీసాల్లోని నీరు కల్తీకి గురయ్యాయా.. లేదా తెలుసుకుంటారు.

సూక్ష్మజీవులున్నాయా..: ప్యాకేజీల్లోని పదార్థాల్లో వ్యాధికారక క్రిములు లేదా సూక్ష్మజీవులు ఉన్నాయా అని పరీక్షలో తేలుతుంది.

**గ్రేటర్‌లో ఇలా..**

ఆహార భద్రతాధికారులు: 22

ప్రస్తుతం ఉన్న పరీక్ష కేంద్రం: 1 (రాష్ట్రం మొత్తానికి)

హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర ఆహార విక్రయ కేంద్రాలు: 25,000

ప్రస్తుతం ఆహార నమూనాల పరీక్ష ఫలితాలు రావాలంటే: 30 నుంచి 60 రోజులు

కొత్త కేంద్రాలు అందుబాటులోకి వస్తే.. 7 నుంచి 14 రోజుల్లో

ఐదు కేంద్రాలకు కానున్న వ్యయం: రూ.30 కోట్లు (ఒక్కోదానికి రూ.6కోట్ల చొప్పున)

కేంద్రాల ఏర్పాటుకు అవసరమయ్యే విస్తీర్ణం: 6,000 చ.అ నుంచి 10వేల చ.అ

# జోనుకో నిబంధన.. అర్హతల ఉల్లంఘన



హైదరాబాద్ : ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఒప్పంద కార్మికుల సరఫరాకు పిలిచిన టెండర్లలో ఓ గుత్తేదారు.. 3 శాతం కోట్ చేయగా.. సంబంధిత అధికారి ఆ గుత్తేదారుపై అనర్హత వేటు వేసి.. 4.8శాతం ధర కోట్ చేసిన సంస్థకు కట్టబెట్టారు. 200శాతం టర్నోవర్ లేదనే కారణం చూపారు. ఒప్పంద కార్మికుల వేతనాల మీద జీహెచ్ఎంసీకి జీఎస్టీ మినహాయింపు ఉంది. కూకట్‌పల్లి జోన్, తూర్పుజోన్‌లో ఓ సంస్థ టెండర్లను రద్దు చేశారు. జీఎస్టీ చలానాలు అప్‌లోడ్ చేయలేదన్న కారణం చూపారు. మిగిలిన జోన్లలో చలానాలు అడగలేదు.

**గాలిలో నిబంధనలు**

జీహెచ్ఎంసీలో ఏదైనా సెక్షన్‌లో ఒప్పంద ఉద్యోగుల సరఫరాకు ఆ అనుభవం ఉన్నవారే దాఖలు చేయాల్సి ఉంటుంది. కానీ ఇదే దక్షిణ మండల పరిధిలో మ్యాన్‌పవర్ సరఫరాలో అనుభవం ఉన్న ఏజెన్సీలు ఎవరైనా టెండర్లు దాఖలు చేయవచ్చని పేర్కొన్నారు. మిగిలిన వాటిలో ఈ నిబంధన లేదు. దీంతో అనర్హత వేటు వేస్తున్నారు.

జీహెచ్ఎంసీలో ఒప్పంద ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్ఐ గుత్తేదారులకు సంబంధం లేదు. కానీ టెండర్లలో కొన్నింటికి పీఎఫ్, ఈఎస్ఐ చలానాలు అడుగుతున్నారు. టెండర్లను ఏజెన్సీలు, ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్ ఉన్నవారికే ఇస్తామని నిబంధన పెట్టారు. కార్మికుల సరఫరాకు ఎంఎస్ఎంఈలు అవసరం లేదు. శేరిలింగంపల్లి, సికింద్రాబాద్ జోనులో ఇలాంటి వాటిని ఇవ్వడం గమనార్హం.

**ఇదీ పరిస్థితి..!**

జీహెచ్ఎంసీ పరిధిలో జోన్లు, సర్కిల్ కార్యాలయాల్లో 25వేల మంది ఒప్పంద ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. వీరిని మూడు రకాలుగా విభజించారు. ప్రతి ఏడాది నిర్వహణ టెండర్లను పిలిచి గుత్తేదారులకు అప్పగిస్తారు. ఇవి జోన్ల వారీగా ఎస్ఈల పరిధిలో నిర్వహిస్తున్నారు. సాధారణంగా ఈ ఒప్పంద ఉద్యోగులను కాంట్రాక్టు ఏజెన్సీల నుంచి తీసుకుంటారు. నిర్వహణ నిమిత్తం ఏజెన్సీలకు కొంత చెల్లించే అవకాశం ఉంటుంది. దీనికి మాత్రం టెండర్లను కోట్ చేయాల్సి ఉంటుంది. ఇటీవల అవి తమ వారికే కట్టబెట్టేందుకు నానా గిమ్మిక్కులు చేస్తున్నారు.

**నేత సిఫార్సులతో..**

ఒప్పంద ఉద్యోగుల సరఫరా టెండర్లలో ఓ మాజీ ప్రతినిధి సిఫార్సులతో 20 వరకు అప్పగించినట్లు తెలిసింది. ఇంఛార్జిగా ఉన్న ఓ అధికారి అన్నీ తానై నిబంధనలు పక్కన పెట్టి మరీ ఇస్తున్నారు. సరఫరా ఏజెన్సీలు సాధారణంగా తమకు వచ్చే బిల్లుల్లో 0.5శాతం మామూళ్లు ఇస్తారనేది బహిరంగం. దీని కన్నా ఎక్కువ ఇస్తామనే వారికి టెండర్లను కట్టబెడుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి.

**ఉలుకు పలుకు లేదు..**

ఒప్పంద ఉద్యోగుల వ్యవహారంలో జరుగుతున్న అక్రమాలపై కమిషనర్ ఇలంబర్తికి ఫిర్యాదు చేసినా.. కనీసం స్పందించలేదు. వివరణ కోరేందుకు గత వారం రోజులుగా 'ఈనాడు' ప్రయత్నించినా.. ఆయన స్పందించలేదు.

జీహెచ్ఎంసీ పరిధిలో..మొత్తం జోన్లు 6

ఒప్పంద ఉద్యోగులు, కార్మికుల సంఖ్య 25,000

ఒక్కొక్కరికి నెలవారీ వేతనం రూ.18 వేల నుంచి రూ.25 వేల వరకు

జీతాలు, నిర్వహణ ఖర్చు రూ.50 కోట్ల నుంచి రూ.65 కోట్ల వరకు

# బిల్డ్‌నౌతో దందా ఆగేనా?

హైదరాబాద్ : హెచ్ఎండీఏ పరిధిలో బిల్డ్‌నౌ సేవలు త్వరలో ప్రారంభం కానుండటంతో ఇకనైనా దళారులకు అడ్డుకట్ట పడుతుందా..అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. హెచ్ఎండీఏ పరిధిలోని లేఅవుట్లు, భవన నిర్మాణాలకు సంబంధించి ఈ నెలాఖరు నుంచి టీజీ-బీపాస్‌కు బదులు బిల్డ్‌నౌతో అనుమతులిచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అత్యంత ఆధునిక సాంకేతిక విధానంలో ఈ సాఫ్ట్‌వేర్‌కు రూపకల్పన చేసినట్లు చెబుతున్నారు. డాక్యుమెంట్ల అప్‌లోడ్, పరిశీలన, అనుమతులు జారీ అంతా చాలా పారదర్శకంగా.. తక్కువ సమయంలోనే పూర్తి చేయొచ్చునని పేర్కొంటున్నారు. ప్రస్తుతం టీజీబీపాస్‌లో దరఖాస్తు చేసుకుంటే 21 రోజుల్లో పరిశీలించి అనుమతులివ్వడం లేదంటే తిరస్కరించడం చేయాలి. చిన్నచిన్న కారణాలతో కొందరు సిబ్బంది దరఖాస్తు దారులను ఇబ్బంది పెడుతున్నారు. ఏదైనా వివాదం ఉన్న భూమి, భవనాల విషయంలో చుక్కలు కన్పిస్తున్నాయి. ప్రస్తుతం హెచ్ఎండీఏకు లేఅవుట్లు, భవన అనుమతుల ద్వారా నెలకు రూ.100 కోట్లు వరకు ఆదాయం వస్తోంది. బిల్డ్‌నౌతో అనుమతుల్లో వేగం పెరిగితే ఆమేరకు ఆదాయంలో పురోగతి ఉంటుందని భావిస్తున్నారు.

**కన్సల్టెంట్ల ముసుగులో...**

హెచ్ఎండీఏ కార్యాలయం చుట్టూ పలు కన్సల్టెంట్ ఏజెన్సీలు ఉన్నాయి. లేఅవుట్ల కోసం వచ్చే దరఖాస్తు దారులకు కమీషన్ తీసుకొని సూచనలు, సలహాలు అందిస్తుంటారు. అంతేకాక హెచ్ఎండీఏలోని అధికారుల వద్ద దళారులుగా అవతారమెత్తుతున్నారు. సాధారణ దరఖాస్తుదారుల కంటే వారికే కొందరు అధికారులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. బిల్డ్‌నౌతో ఇలాంటి వాటికి అడ్డుకట్ట పడనుందని, అన్ని



సక్రమంగా ఉంటే నిర్ణీత సమయంలోనే అనుమతులు మంజూరవుతాయని అధికారులు చెబుతున్నారు. ఉద్దేశ పూర్వకంగా ఇబ్బందులు పెడితే అప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేలా బిల్డ్‌నౌలో సాంకేతికతను అందుబాటులోకి తెచ్చారు. ఉదాహరణకు ఏజెంట్ ఏఐ ద్వారా దరఖాస్తు ఏ స్థాయిలో ఉందో రియల్ టైమ్ డేటాను అడిగి తెలుసుకునే సౌలభ్యం కల్పించారు. రియల్ టైమ్ వాట్సప్ అప్‌డేట్‌లు అందిస్తారు. స్మార్ట్ గైడెడ్ మార్కింగ్‌ను వినియోగించి, సాధారణ లోపాలు, తప్పులను నివారించి దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. ఇలా పలు సాంకేతిక పద్ధతులతో సేవల్లో పారదర్శకత పెంచేలా తీర్చిదిద్దారు.

# మురుగు శుద్ధికి మోక్షం

గోదావరిఖని : ఎట్టకేలకు రామగుండం నగరపాలక ప్రాంతంలో మురుగు జలాల శుద్ధి కేంద్రాల(ఎస్టీపీ) నిర్మాణానికి మోక్షం లభించింది. 2023 సెప్టెంబరులో అమృత్ 2.0 పథకంలో భాగంగా అయిదు చోట్ల కేంద్రాల నిర్మాణానికి రూ.88.68 కోట్ల నిధులు మంజూరు కాగా.. టెండర్లు నిర్వహించి గుత్తేదారుకు పనులు అప్పగించారు. కానీ స్థలం కేటాయింపుతో పాటు వివిధ కారణాలతో పనుల్లో జాప్యం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇటీవల సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సత్వరమే పనులు మొదలు పెట్టాలని ఆదేశించారు. దీంతో మల్కాపూర్ శివారులో ఎస్టీపీ నిర్మాణ పనులు రెండ్రోజుల క్రితం మొదలయ్యాయి. గోదావరిఖనిలోని వివిధ కాలనీల నుంచి వెలువడే మురుగు జలాలను ఈ కేంద్రంలో శుద్ధి చేసి గోదావరిలో వదలాల్సి ఉంటుంది. యైటింక్లయిన్‌కాలనీ, రామగుండం, పాములపేట, జనగామ తదితర ప్రాంతాల్లోనూ మురుగు జలాల శుద్ధి కేంద్రాల నిర్మాణ చేపట్టాల్సి ఉంది.

**ఆది నుంచి అవాంతరాలే..**

రామగుండం నగరపాలక ప్రాంతంలో మురుగు జలాల శుద్ధికి ఆది నుంచి అవాంతరాలే ఎదురవుతున్నాయి. గోదావరి జలాల పరిరక్షణ పథకంలో భాగంగా సుమారు మూడున్నర దశాబ్దాల క్రితం రూ.15 కోట్లతో మురుగు జలాల శుద్ధి కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టారు. వివిధ కారణాలతో సుందిళ్లలో నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. రామగుండం, మల్కాపూర్‌లలో నిర్మాణాలు పూర్తయినా నిర్వహణ కొరవడటంతో నిరుపయోగంగా మారాయి. అనంతరం



మల్కాపూర్‌లో 22.22 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మాణానికి 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.97 కోట్లు.. రామగుండంలో 4 ఎంఎల్‌డీ సామర్థ్యంతో డీఎంఎఫ్‌టీ నిధులు 2.86 కోట్లు కేటాయించారు. మల్కాపూర్‌లో పరిశీలనలకే పరిమితం కాగా.. రామగుండంలో పూర్తయినా ప్రయోజనం నెరవేరటం లేదు. 'అమృత్ 2.0' పథకంలో భాగంగా మల్కాపూర్‌లో 21 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్టీపీ నిర్మాణ పనులు రెండు రోజుల క్రితం మొదలయ్యాయి.

పరిశ్రమల కాలుష్యంతో..నగరంలోని వివిధ కాలనీల నుంచి వెలువడే మురుగు జలాల శుద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అయితే పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ జలాలు గోదావరి కలుషితానికి ప్రధాన కారణం అవుతున్నాయి. సింగరేణి తమ కాలనీల్లోని మురుగు జలాల శుద్ధికి ప్రత్యేకంగా కేంద్రాలు నిర్మించుకోగా.. ఎన్టీపీసీ సైతం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఎరువుల కర్మాగారం మాత్రం గోదావరి నదిలోకే వ్యర్థ జలాలను వదిలేస్తోంది. కర్మాగారం ఆవరణలో శుద్ధి చేశాకే వ్యర్థ జలాలు బయటకు పంపాలంటూ కాలుష్య నియంత్రణ మండలి పలు మార్లు నోటీసులు జారీ చేయడంతో పాటు ఉత్పత్తి నిలిపివేసేలా చర్యలు తీసుకుంది. దీంతో త్వరలోనే కర్మాగారం ఆవరణలో శుద్ధి కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ఉత్పత్తి మొదలుపెట్టారు.

# అనుమతులొస్తే పనుల పరుగు

సిరిసిల్ల : మధ్యమానేరు జలాశయం వెనక జలాలు సిరిసిల్ల పట్టణాన్ని తాకుతాయి. రామప్పగుట్ట నుంచి సాయినగర్ చెక్‌డ్యాం వరకు కరకట్ట నిర్మాణం.. దానిపై సుందరీకరణకు అయిదేళ్ల క్రితమే ప్రణాళికలు చేశారు. కరకట్ట నిర్మాణం.. చెక్‌డ్యాం పనులు ముడిపెట్టడంతో ముందుకు కదలడంలేదు. ఇటీవల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, నీటి పారుదలశాఖ ఈఎన్‌సీ శంకర్‌లతో కలిసి కరకట్ట, కూలిన చెక్‌డ్యాం ప్రాంతాలను పరిశీలించారు. నిలిచిపోయిన పనులు చేపట్టాలని కలెక్టర్ నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రెండు పనులకు గుత్తేదారుల గడువు ముగిసింది. దీంతో వీటికి ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. మధ్యమానేరు జలాశయం వెనకజలాల నుంచి మానేరు వంతెన నుంచి సాయినగర్ వరకు 2.2 కిలోమీటర్ల పొడవునా కరకట్ట నిర్మించాలి. దీనిలో మొదటిదశ మానేరు వంతెన వరకు పనులు పూర్తయ్యాయి. ఇక్కడి



నుంచి సాయినగర్ వరకు రెండో విడతకు రూ.38 కోట్లు మంజూరయ్యాయి. కాగా ప్రారంభదశలోనే నిలిచిపోయాయి.

కరకట్ట 10 నుంచి 18 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్నారు. కరకట్ట కింది నుంచి మట్టితోకాకుండా వాగువైపు కాంక్రీటుతో గోడ నిర్మించి మట్టిని నింపనున్నారు.

రెండు కిలోమీటర్ల పైన కరకట్ట నిర్మాణానికి మట్టికొరత తీవ్రంగా ఉంది. బోయినపల్లి, ఇల్లంతకుంట మండలంలో అదనపు టీఎంసీ పనుల్లో కాల్వ తవ్వకాల్లో వెలువడుతున్న మట్టిని గనులశాఖ వేబిల్లుతో కరకట్టకు వినియోగించేలా ప్రణాళికలు చేస్తున్నారు.

సివిల్, కాంక్రీటు పనులు పూర్తయ్యాక పర్యాటక శాఖకు అప్పగిస్తారు. పురపాలకశాఖతో కలిసి సుందరీకరణ పనులు చేయాల్సి ఉంటుంది. దీనికోసం ఇప్పటికే వరంగల్‌లోని భద్రకాళి చెరువు సుందరీకరణ పనులు నిర్వహించిన ఇంజినీర్ల బృందం కరకట్ట ప్రాంతాన్ని పరిశీలించింది. మట్టికట్ట పనులు పూర్తయ్యాక సుందరీకరణ పనులు ప్రారంభించే అవకాశం ఉంటుంది.

**చెక్‌డ్యాం కీలకం**మానేరు వాగుపై సాయినగర్ వద్ద నిర్మాణంలో ఉన్న చెక్‌డ్యాం 2021 వరదలకు 150 మీటర్ల మేరకు కాంక్రీటు పూర్తిగా కొట్టుకుపోయింది. ఇక్కడ ఎగువ నుంచి వచ్చే నీటితోపాటు జలాశయం వెనకజలాలతో ఏడాది పొడవునా నీరు ఉంటుంది. కూలిన చెక్‌డ్యాంను పరిశీలించిన రాష్ట్ర చెక్‌డ్యాం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఇక్కడి చెక్‌డ్యాం నమూనాలను మార్చాలని సూచించారు. వాగులో పిల్లర్లతో బెడ్ నిర్మాణం చేపట్టడంతోపాటు ఎత్తు 150 మీటర్లకు పెంచడం, ఇరువైపులా రక్షణగోడలు నిర్మించాలని సూచించారు. అప్పుడే వరదలను తట్టుకునే అవకాశం ఉంటుంది. రూ.7 కోట్లతో నిర్మించే చెక్‌డ్యాంను అడ్వైజరీ కమిటీ సూచనలతో 2023లో రూ.25 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసి పంపారు. నిధులు మంజూరుకాకపోవడంతో పనులు పడకేశాయి. ఈ విషయమై డీఈ కిషోర్‌ను 'ఈనాడు' సంప్రదించగా ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే పనులు ప్రారంభిస్తామన్నారు.

# లక్ష్యం 'కుంటు'తోంది

కొయ్యలగూడెం మండలం సరిపల్లి పంచాయతీ పరిధిలో పంట కుంట తవ్వకం పనుల్లో రాళ్లు వస్తుండటంతో ఉపాధి శ్రామికులు చెమటోడ్చక తప్పడం లేదు. దీంతో పనులు మందగించాయి. భూగర్భ జల నిల్వల పెంపే లక్ష్యంగా చేపట్టిన పంట సంజీవని పథకం పనులు జిల్లాలో మందకొడిగా సాగుతున్నాయి. కుంట తవ్వకం కోసం సుమారు ఐదు సెంట్ల భూమి కేటాయించాల్సి రావడంతో సన్న, చిన్నకారు రైతులు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఉపాధి హామీ యంత్రాంగం నానా తంటాలు పడాల్సి వస్తోంది. వర్షాలు పడకముందే కుంటల తవ్వకం పూర్తయ్యేలా రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

**125 పనిదినాలు..** ఒక్కో కుంట నిర్మాణానికి 125 పనిదినాలు కేటాయించారు. కనీసం పది మంది వరకు పని చేయడానికి అవకాశం ఉంది. మొత్తంగా రూ.35వేల వరకు ఖర్చవుతుంది. అది ఉపాధి వేతనాల రూపంలో జమవుతుంది. కానీ మెట్ట మండలాల్లో పలుచోట్ల



కుంటలు తవ్వుతుంటే రాళ్లు, బండలు తగులుతున్నాయని, తవ్వకం కష్టంగా ఉందని శ్రామికులు అంటున్నారు. దీంతో ఆయా చోట్ల పనులు మందగిస్తున్నాయి.

**తర్వాత చూద్దాంలే..** కొయ్యలగూడెం మండలం చొప్పరామన్నగూడెంలో అర్హులైన రైతులు ఉన్నప్పటికీ పంట కుంట తవ్వకం కోసం ఒక్కరు కూడా ముందుకురాలేదని సిబ్బంది చెబుతున్నారు. కొన్ని రోజులుగా వారిని ఒప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రబీ మొక్కజొన్న, పొగాకు తోటలు సాగులో ఉండటంతో భూములు ఖాళీగా లేవని, పంటలు పూర్తయిన తర్వాత చూద్దాంలే అంటూ కొందరు రైతులు దాటవేస్తున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అవగాహన కల్పిస్తాం..** 'పంట కుంటలు తవ్వుకుంటే కలిగే మేలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రబీ సాగు పూర్తయ్యే దశలో ఉ ందని, రానున్న రోజుల్లో లక్ష్యాన్ని పూర్తి చేస్తాం' అని డ్వామా పథక సంచాలకుడు కేవీ సుబ్బారావు తెలిపారు.

# రొయ్య.. ఎంత మేపినా ఎదగదేమయ్యా!



టంగుటూరు : డాలర్ పంటగా పేరొందిన ఆక్వాను వరుసగా సమస్యలు చుట్టుముడుతున్నాయి. తొలుత రొయ్యకు వైరస్‌ల దాడి పెరిగింది. ఆ తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల పెంపుతో ఎగుమతులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వం కలుగజేసుకోవడంతో సాగుదారులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. ఈ తరుణంలో.. తాజాగా మరో కొత్త చిక్కొచ్చి పడింది. ఎంత మేత తిన్నా.. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా టైగర్ రొయ్య ఆశించినంతగా ఎదగడం లేదు.

**ఇప్పటికే వనామీని వదిలేశారు:** జిల్లాలో తీర ప్రాంత మండలాలైన టంగుటూరు, కొత్తపట్నం, సింగరాయకొండ, ఒంగోలు, మద్దిపాడుల్లో గత ముప్పై ఏళ్లుగా రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. సముద్ర తీరం వెంట, ఇతర పట్టా భూములతో కలిపి జిల్లాలో వ్యాప్తంగా మొత్తం 2,910 హెక్టార్లలో రొయ్యను పండిస్తున్నారు. గత అయిదేళ్లుగా వైరస్‌ల బెడద అధికం కావడం, ధరలు ఆశాజనకంగా లేకపోవడం, వాతావరణం అనుకూలించకపోవడం వంటి కారణాలతో వనామీ రకాన్ని చాలా వరకు రైతులు ఇప్పటికే వదిలేశారు.

**సగానికి సగం పడిపోయిన బరువు:** ఈ ఏడాది ఆక్వా సాగుకు వాతావరణం సానుకూలంగా ఉండటం.. టైగర్‌కు మంచి ధరలు లభిస్తుండటంతో ఎక్కువ మంది ఆ రకాన్నే సాగు చేస్తున్నారు. ప్రస్తుతం చెరువుల్లో 40 నుంచి 60 రోజుల పంట కొనసాగుతోంది. సాధారణంగా 60 రోజుల రొయ్య 10 నుంచి 12 గ్రాముల బరువు తూగాలి. కానీ చెరువుల్లో ఆ పరిస్థితి లేదు. కేవలం 5 నుంచి 6 గ్రాములు మాత్రమే తూగుతోంది. దీంతో దిగుబడి సగానికి పైగా పడిపోతోంది. కంపెనీ మేతనే నిత్యం అందిస్తున్నామని, అయినా రొయ్య బరువు పెరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తాజా పరిస్థితులతో రైతుల ఆందోళన:** జిల్లాలో ఆక్వా సాగు ఏళ్ల తరబడిగా ఉన్నప్పటికీ.. రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రం ఒక్కటీ లేదు. పుదుచ్చేరి, నెల్లూరు వంటి ప్రాంతాలకు వెళ్లి సీడ్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఎకరాకు ప్రస్తుతం టైగర్ రకం పిల్లలను 50 వేల నుంచి లక్ష వరకు వేస్తున్నారు. గత ఏడాది ఓ కంపెనీకి చెందిన సీడ్ కారణంగా ఎదుగుదల లోపంతో సాగుదారులు తీవ్రంగా నష్టపోయారు. తాజా పరిస్థితులతో మళ్లీ ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై జిల్లా మత్స్యశాఖ అధికారి సీహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆక్వా సాగులో సమస్యలను రైతులు తమ దృష్టికి తీసుకురాలేదని అన్నారు. ఇటీవల టంగుటూరు మండలం వెలగపూడిలో చెరువులను పరిశీలించామని చెప్పారు. సమస్యను దృష్టికి తెస్తే పరిష్కార మార్గం చూపుతామని తెలిపారు.

# నిధి వెక్కిరింత.. విస్తరణ తీరని చింత

బనగానపల్లి : కుందూ నది విస్తరణ పనుల పేరుతో గత వైకాపా ప్రభుత్వం హడావుడి చేసింది. పెద్దఎత్తున నిధులు కేటాయించినట్లు గొప్పలు చెప్పింది. అధికారులు టెండర్లు పిలిచి గుత్తేదారులకు అప్పగించారు. కొంతమేర పనులు చేపట్టినా బిల్లులు మంజూరు చేయలేదు. దీనికితోడు భూసేకరణ పనులు ముందుకు సాగలేదు. ఫలితంగా ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయి.

బనగానపల్లి మండల పరిధిలోని టంగుటూరు గ్రామం నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు సమీపంలోని పెన్నా నది వరకు 187 కి.మీ. మేర కుందూ నది విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. నదికి సంబంధించి రెండు వైపులా కలిపి 130 మీటర్ల మేర విస్తరించి 35 వేల క్యూసెక్కుల నీరు వైఎస్సార్ జిల్లాలో ప్రవహించే పెన్నా నదిలో పంపేలా అప్పట్లో అధికారులు ప్రణాళికలు రూపొందించారు. దీనికిగాను గత ప్రభుత్వం రూ.1,758 కోట్లు కేటాయించింది. 2021, మార్చి 31న పనులకు శ్రీకారం చుట్టారు.

ప్రస్తుతం 18 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో ప్రవహించే కుందూ



నదిని 35 వేల క్యూసెక్కులకు పెంచేలా పనులు చేపట్టారు. ఈ నిధులతోనే కోవెలకుంట్ల సమీపంలోని జొలదరాశి వద్ద 0.80 టీఎంసీ నీటిని నిల్వ చేసేలా ఒక ప్రాజెక్టు, చాగలమర్రి సమీపంలోని రాజోలి వద్ద 3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో మరో ప్రాజెక్టు నిర్మించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టులు దాటి మిగులు జలాలను పెన్నా నదిలోకి తీసుకెళ్తారు. ఏటా వర్షానికి కుందూలో నీరు ఉద్ధృతంగా ప్రవహించి సమీపంలోని పొలాలను ముంచెత్తుతోంది. విస్తరణ పనులు పూర్తి చేస్తే రైతులకు ఎలాంటి నష్టం జరగదు. నీరు సాఫీగా ప్రవహిస్తుంది.

**భూసేకరణ చేయకనే..**

2019 డిసెంబరులో జొలదరాశి జలాశయం, కుందూ నది విస్తరణ పనులకు వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం నెలటూరులో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 8 వేల ఎకరాల వరకు భూసేకరణ చేయాల్సి ఉంది. కానీ ఆ ఊసే లేకుండా పనులు ప్రారంభించేశారు. కుందూ ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూముల్లో మాత్రమే పనులు చేశారు. దీనికితోడు చేసిన పనులకు బిల్లులు మంజూరుకాకపోవడంతో గుత్తేదారులు చేతులెత్తేశారు. ఈ విషయమై ఈఈ సురేశ్‌బాబు మాట్లాడుతూ అప్పటి ప్రభుత్వ ఆదేశాలమేరకు పనులు ప్రారంభించామని చెప్పారు. మొదట్లో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు ఆపేశారని చెప్పారు. ఇప్పటివరకు రూ.100 కోట్ల విలువైన పనులు మాత్రమే చేశారని వివరించారు. తాజా పరిస్థితిని కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

**ఏటా పంట నష్టమే - శేఖర్, పొట్టిపాడు**

గ్రామంలో కుందూ ఒడ్డున ఆరెకరాల పొలం ఉంది. ఏటా భారీ వర్షాలకు కుందూలో వరద ప్రవాహం పెరిగి పొలాలు మునిగిపోతున్నాయి. వరి పంటకు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టం వస్తోంది. కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని విస్తరణ పనులు పూర్తి చేస్తే మా కష్టాలు తీరుతాయి.

# నిధులు నిలిచి.. నిర్లక్ష్యం మొలిచి..

పొదిలి : గత ప్రభుత్వ నిర్వాకంతో జిల్లావ్యాప్తంగా అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. నిర్మాణాలు సగం వరకు అయిన తర్వాత పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి దాపురించింది. దీంతో మహిళా శక్తి నీరుగారిపోతోంది. పొదిలిలో స్వయం సహాయక సంఘాల భవనం, సీడీపీవో భవన నిర్మాణాలకు గత ప్రభుత్వం పూర్తిస్థాయి నిధులు మంజూరు చేయకపోవడంతో భవనాలు మధ్యలోనే ఆగిపోయాయి. మండల స్వయం సంఘాల సమాఖ్య భవనాన్ని సుమారు రూ.60 లక్షలతో ప్రారంభించారు. 2019లో పనులు ప్రారంభమైనా నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడంతో



గుత్తేదారులు పనులు ఆపేశారు. ఇక్కడి స్వయం సహాయక సంఘాల్లో 11,100 మంది సభ్యులున్నారు. వారంతా అద్దె భవనంలో అవస్థల మధ్య ఎస్‌హెచ్‌జీ సభ్యుల సమావేశాల్లో పాల్గొంటున్నారు. పొదిలిలో స్త్రీ శిశు సంక్షేమశాఖ భవనం పనులను 2019లో రూ.32 లక్షలతో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రారంభించారు. స్లాబు వరకు నిర్మాణం జరిగింది. కొత్త ప్రభుత్వం పనులను పూర్తి చేయాలని స్వయం సహాయక సంఘాల మహిళలు కోరుతున్నారు.

# నియోజకవర్గానికో పారిశ్రామిక పార్కు



ఒంగోలు: పరిశ్రమలు ఏర్పాటైతే ఉద్యోగాలొస్తాయి. పరిసర ప్రాంతాల్లో చిన్నాచితకా వ్యాపారాలు పెరిగి అనేక జీవితాలు బాగుపడతాయి. పన్నుల రాబడి అధికమై రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. తద్వారా అభివృద్ధి వేగవంతమవుతుంది. అందుకే కూటమి ప్రభుత్వం పెట్టుబడులు పెట్టేందుకు అనువైన పరిస్థితులకు పెద్దపీట వేస్తోంది. పరిశ్రమల స్థాపనకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తోంది. అందులో భాగంగా నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు జిల్లాలో అడుగులు పడేలా చేస్తోంది. మార్కాపురం, కనిగిరిలో ఆయా శాసన సభ్యులతో పాటు ఏపీఐఐసీ అధికారులు ఇప్పటికే శంకుస్థాపన చేశారు. దర్శి నియోజకవర్గంలోని చందులూరులో పార్కును ప్రారంభించారు. మిగిలిన చోట్లా భూమిని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

**400 ప్లాట్లు.. 4,000 మందికి బతుకుదెరువు:** జిల్లాలో నానో, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు భూమిని గుర్తించాలని ఏపీఐఐసీ ఉన్నతాధికారులు కలెక్టర్ తమీమ్ అన్సారియాను కోరారు. ఆ మేరకు కనిగిరి, ఒంగోలు ఆర్డీవోలు, మార్కాపురం సబ్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అందజేశారు. భూ సేకరణ అనంతరం ఏపీఐఐసీకి అప్పగించనున్నారు. తర్వాత ప్లగ్ అండ్ ప్లే విధానంలో కావాల్సిన షెడ్లతోపాటు రోడ్లు, డ్రైన్లు, నీరు, విద్యుత్తు వంటి మౌలిక వసతులు కల్పించి నేరుగా పరిశ్రమలు స్థాపించుకునేలా ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తారు. 'అన్ని నియోజకవర్గాల్లో కలిపి నాలుగు వందల పరిశ్రమలు స్థాపించేలా ప్లాట్లను అభివృద్ధి చేస్తున్నామని, ప్రత్యక్షంగా, పరోక్షంగా నాలుగు వేల మందికి ఉపాధి దొరికే అవకాశం ఉంద'ని ఏపీఐఐసీ అధికారులు చెబుతున్నారు.

**ఏర్పాటు దిశగా ప్రగతి ఇలా..**

మార్కాపురం: తర్లుపాడు మండలం కలుజువ్వలపాడులో ఏపీఐఐసీకి అప్పగించిన భూమిలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి బుధవారం భూమి పూజ, శంకుస్థాపన చేశారు.

ఒంగోలు: కొత్తపట్నం మండలం అల్లూరులో 60.75 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమిని గుర్తించారు. 5.01 ఎకరాలను విద్యుత్తు ఉపకేంద్రం కోసం ఏపీ ట్రాన్స్‌కోకు ఇచ్చారు. మిగిలిన భూమిలో పార్కు ఏర్పాటుకు ప్రతిపాదించారు.

కొండపి: మర్రిపూడి మండలం కాకర్లలో ప్రభుత్వ భూమిని గుర్తించి ప్రతిపాదనలు పంపారు.

దర్శి: చందలూరులో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు అప్పగించిన ప్రభుత్వ పోరంబోకు భూమిలో ఎంఎస్ఎంఈ పార్కులో మౌలిక వసతులు కల్పించారు.

కనిగిరి: పీసీపల్లి మండలం పెద్దఈర్లపాడులోని 20 ఎకరాల్లో పార్కు ఏర్పాటుచేశారు. ఇందులో రూ.ఏడు కోట్లతో రహదారులు, విద్యుత్తు, మురుగు కాలువలు, కల్వర్టులు నిర్మిస్తారు.

గిద్దలూరు: సంజీవరావుపేటలో ప్రభుత్వ భూమిని కేటాయించారు.

యర్రగొండపాలెం: గంగాపాలెంలోని ఎఫ్ఎల్ఆర్, హిల్ పోరంబోకు భూమిని గుర్తించారు.

సంతనూతలపాడు: నాగులుప్పలపాడు మండలంలో అవసరమైన భూమిని గుర్తించాలని కలెక్టర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

# ఖరీఫ్‌కు ఢోకా లేదు

బొబ్బిలి: ఇటీవల కురిసిన వర్షాలకు జలాశయాల్లో నీటి మట్టాలు పెరిగాయి. గతేడాది మేతో పోల్చితే వట్టిగెడ్డ మినహా మిగిలిన చోట్ల స్వల్పంగా పెరిగాయి. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగునీటికి ఢోకా లేదని ఇంజినీర్లు చెబుతున్నారు. జూన్ నుంచి వర్షాలు ప్రారంభమైతే పూర్తిస్థాయి నీటి మట్టాలు చేరి, పూర్తి ఆయకట్టుకు నీరందే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఎన్నడూ లేనివిధంగా మే నెలలో కురిసిన వర్షాలతో నీరు చేరిందని ఈఈ అప్పలనాయుడుతో అన్నారు.

**తాగునీటి గండం గట్టెక్కినట్లే!**

జలాశయాల్లో నీటి మట్టాలు పెరగడంతో తాగునీటి కష్టాలు కూడా



దాదాపు గట్టెక్కినట్లే. వేగావతి నదిపై సాలూరు, బొబ్బిలి పురపాలక సంఘాల తాగునీటి పథకాలు ఉన్నాయి. వీటితోపాటు మరో 110 గ్రామాల ప్రజల దాహార్తి తీర్చే పథకాలున్నాయి. గతేడాది వేగావతిలో నీరు ఇంకిపోవడంతో పైన పెద్దగెడ్డ జలాశయం గేట్లు ఎత్తితే నదిలోకి నీరు వచ్చింది. దీంతో తాగునీటి ఇబ్బందులు తప్పాయి. ఈ ఏడాది ఆ పరిస్థితులు తలెత్తే అవకాశాలు లేవంటున్నారు. అలాగే సువర్ణముఖి నదిలో మరో 80 గ్రామాలకు చెందిన పథకాలు ఉన్నాయి. నాగావళి నదిలో పార్వతీపురం పట్టణ తాగునీటి పథకాలతోపాటు సుమారు 100 గ్రామాలకు చెందిన పథకాలు ఉన్నాయి. రిజర్వాయర్లలో నీరు చేరడంతో ఇబ్బందులు లేనట్లేనని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు అంటున్నారు.

# వాగును మింగిన అనకొండలు

మార్కాపురం : వైకాపా హయాంలో మార్కాపురం కేంద్రంగా భూ బకాసురులు రెచ్చిపోయారు. వాగులు.. వంకలు.. చెరువులు.. కుంటలు.. ప్రభుత్వ భూములను ఆక్రమించుకునేవారు. తమ బినామీల పేర్లతో దస్త్రాల్లోకి ఎక్కించుకుని విక్రయించేవారు. అవే పరిస్థితులు మళ్లీ ఇప్పుడు కొన్ని చోట్ల కనిపిస్తున్నాయి. జాతీయ రహదారుల పక్కన, పట్టణంలోని విలువైన భూములపై అక్రమార్కులు పాగా వేసి చెరబట్టే ప్రయత్నం చేస్తున్నారు.

**రూ.5 కోట్ల స్థలం హాంఫట్!**

మార్కాపురం మండలం దరిమడుగు సమీపంలోని జాతీయ రహదారికి పక్కన సర్వే నంబరు 773-1బిలో 23.58 ఎకరాలు, సర్వే నంబరు 773-1బి3లో 8.31 ఎకరాలు, సర్వే నంబరు 773-1బి2లో 1.55 ఎకరాల వాగు పోరంబోకు భూమి ఉంది. జాతీయ రహదారి పక్కన ఉండటంతో ఇక్కడ ఎకరా స్థలం రూ. కోటి వరకు పలుకుతోంది.



దీంతో ఇటీవల కొందరు అక్రమార్కులు వాగు పోరంబోకు స్థలంపై కన్నేశారు. సుమారు అయిదు ఎకరాల వరకు ఆక్రమించారు. చుట్టూ రాళ్లు పాతి కంచెలు ఏర్పాటు చేశారు.

**జంకుతున్న అధికారులు** ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అధికారులు ఆ దిశగా పూర్తిస్థాయిలో దృష్టిసారించడం లేదు. విమర్శలు వచ్చినప్పుడు.. పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పుడు హడావుడి చేస్తున్నారు. స్థలాలను పరిశీలిస్తున్నారు. ఆ తర్వాత వాటిని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేయకుండా మిన్నకుండిపోతున్నారు. విలువైన ప్రభుత్వ భూమికి కంచె ఏర్పాటు చేసినా తొలగించే ప్రయత్నం చేయకున్నారు. కనీసం నోటీసులు ఇచ్చే సాహసం కూడా చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాగే చూస్తూ పోతే పశ్చిమ ప్రకాశంలోని కీలక పట్టణమైన మార్కాపురం, సమీప ప్రాంతాల్లో ప్రభుత్వ భూములే కనిపించకుండా పోయే ప్రమాదం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఆసరాకు అవాంతరాలు!

పెద్దదోర్నాల : ఆపన్నులకు సేవలందిస్తున్న ఆర్డీటీ ట్రస్టుకు కొత్త కష్టాలొచ్చాయి. విదేశీ నిధులు నిలిచిపోవడంతో నిరుపేదలు, దివ్యాంగులకు సాయం అందని పరిస్థితి నెలకొంది. దీంతో ఇరు రాష్ట్రాల్లో ఉన్న విధి వంచితులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

దోర్నాల కేంద్రంగా ప్రకాశం, నంద్యాల, పల్నాడు జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లోని చెంచు గిరిజనులు, దివ్యాంగులకు రూరల్ డవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) అందిస్తున్న సేవలకు గ్రహణం పట్టింది. సంస్థకు విదేశాల నుంచి వచ్చే నిధుల వినియోగానికి సంబంధించిన అనుమతులను ఎఫ్‌సీఆర్ఏ (ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్టు) కింద నిలిపివేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో ఆ సంస్థ ఎఫ్‌సీ (ఫారిన్ కాంట్రిబ్యూషన్) ఖాతాల్లో ఉన్న నిధులను వినియోగించడానికి వీల్లేకుండాపోయింది. కేవలం ఎల్‌సీ (లోకల్ కాంట్రిబ్యూషన్) ఖాతాలో ఉన్న నిధులనే వాడుకునే అవకాశముంది. దీంతో ఆ సంస్థ చేపడుతున్న విద్య, వైద్యం, గృహ నిర్మాణం, స్వయం ఉపాధి వంటి కార్యక్రమాలు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది.

**దిక్కుతోచని దివ్యాంగులు**

దోర్నాల మండలంలోని చిన్నగుడిపాడు సమీపంలోని ఆ సంస్థ ఉప కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్న బుద్ధిమాంద్యం పిల్లల పునరావాస కేంద్రం, దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం నిర్వహణపై నీలి నీడలు కమ్ముకున్నాయి. అలాగే పేద పిల్లల కోసం నిర్మాణంలో ఉన్న పాఠశాల, వివిధ ప్రాంతాల్లోని పక్కా గృహాలపై ఆ ప్రభావం పడనుండటంతో లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. లక్షల మంది మహిళలకు రుణాలిచ్చి ఆర్థిక స్వావలంబనకు ప్రయత్నించిన ఈ సంస్థలో 3,500 మందికి పైగా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇరు రాష్ట్రాల్లోని నల్లమల అటవీ ప్రాంతంలోని గిరిజన గూడేల్లోని చెంచు గిరిజనుల అభివృద్ధికి బాటలు వేసేందుకు 2010 దోర్నాల కేంద్రంగా ఆ సంస్థ ఉప




కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. పక్కాగృహాల నిర్మాణం, వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్య సేవలు అందించడం, మహిళల ఆర్థికాభివృద్ధికి స్వయం సహాయక సంఘాలు ఏర్పాటుచేసి రుణాలు అందించడం తదితర సేవలందించింది. చిన్నగుడిపాడు సమీపంలో బుద్ధిమాంద్యం చిన్నారులకు పునరావాస కేంద్రం ఏర్పాటుచేసి వారికి సేవలందిస్తోంది.

**రెన్యువల్ చేయకపోవడంతో**

ఆర్డీటీకి స్పెయిన్, అమెరికా తదితర దేశాల నుంచి విరాళాలు వస్తున్నాయి. ఏటా రూ.280 కోట్లకు పైగా నిధులను స్వచ్ఛంద సేవలకు వినియోగించేవారు. కేంద్ర ప్రభుత్వం 2021లో ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్‌ను పునరుద్ధరించకుండా గడువు పెంచుకుంటూ వచ్చింది. ఆ సంస్థపై కొన్ని అభియోగాలు మోపుతూ 2023 నుంచి విదేశీ విరాళాలను పూర్తిగా నిలిపివేసింది. ఇప్పటి వరకు ఖాతాలో ఉన్న నిధులతో సేవలు కొనసాగిస్తూ వచ్చారు. పేదలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న సంస్థకు నిధులు నిలిపివేయడమేమిటని చెంచు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని నిధులు అందేలా కృషి చేయాలని వారు కోరుతున్నారు.

# జీవాల దాహార్తి.. తొట్టెలతో స్వస్తి

పుంగనూరు : కూటమి ప్రభుత్వం నీటితొట్టెల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఉపాధిహామీ పథకం కింద ఏప్రిల్ మొదటి వారంలో తొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఉద్యాన పంటల సాగు అధికం. ముఖ్యంగా టమాటా, మామిడి, ఇతర కూరగాయ పంటలు సాగు చేస్తున్నారు. వీటికి అనుబంధంగా పాడి పరిశ్రమ ఉంటుంది. ఆవులు, గెదేలు పెంచి పాలు విక్రయిస్తుంటారు. అయితే ప్రస్తుతం టమాటా ధరలు పతనం కావడంతో రైతులు పాడిపైనే ఆధారపడుతున్నారు. నిత్యం పాల నుంచే ఆదాయాన్ని జీవనానికి వినియోగిస్తున్నారు. ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.33 వేలతో పనులు ప్రారంభించారు. జిల్లాలోని 700 పంచాయతీలకు 1,751 నీటి తొట్టెలు మంజూరయ్యాయి. 5 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు, 2 అడుగుల లోతుతో నిర్మిస్తారు. ఇప్పటి వరకు అధికారులు 579 పూర్తి చేశారు. మిగిలిన 1,172 వివిధ దశల్లో ఉన్నాయి.

## వడివడిగా పంట కుంటలు

నక్కపల్లి: జల సంరక్షణతోపాటు పంటల సాగుకు ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పంట కుంటల తవ్వకాలు వడివడిగా సాగుతున్నాయి. జిల్లాలో కేటాయించిన లక్ష్యంలో ఇప్పటికే సగానికిపైగా పూర్తి కాగా.. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. 24 మండలాల పరిధిలో 7200 తవ్వాలని ఆదేశాలొచ్చాయి. ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది రైతులతో మాట్లాడి పంటల కుంటల ముఖ్య ఉద్దేశం వివరించి వారిని ఒప్పించారు. సగటున ఒక్కో పంచాయతీలో పది కుంటలకు పైగా తవ్వుతున్నారు. సుమారు సెంటున్నర స్థలంలో 9 మీటర్ల పొడవు, వెడల్పు, 2 మీటర్ల లోతు ఉండేలా పంట కుంట తవ్వకం వల్ల కోల్పోతున్న భూమి ద్వారా సాగును భర్తీ చేసేందుకు గట్టు వెంబడి



కాయగూరలతోపాటు పండ్ల మొక్కలను పెంచేలా ప్రోత్సాహం అందిస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో 3600 తవ్వగా, ప్రస్తుతం 1,500 చోట్ల పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే తవ్విన కుంటల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది. ప్రస్తుతం నిర్దేశించిన లక్ష్యంలో నర్సీపట్నం, చోడవరం, దేవరాపల్లి, మాడుగుల, అనకాపల్లి నియోజకవర్గాల పరిధిలో ఎక్కువ కేటాయించారు.

**ఉచితంగా విత్తనాలు, మొక్కలు–** యరకయ్య, డ్వామా ఏపీడీ
పంట కుంటల తవ్వకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రెండు నెలల్లో పూర్తి చేయిస్తాం. గట్ల వెంబడి కూరగాయలు, పండ్ల మొక్కలు పెంపకం చేపడితే ఉచితంగా విత్తనాలు, మొక్కలను వెలుగు, ఉపాధి ద్వారా అందిస్తాం.

## నిబంధనలకు పొగ'బట్టీ'

నంద్యాల : కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఇటుక అక్రమ బట్టీలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అనుమతులు లేకున్నా నిర్వహిస్తూ పెద్దఎత్తున వ్యాపారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చెరువులు, పొలాల్లో ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. మరోవైపు కొన్ని బట్టీలకు గృహ, వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు తీసుకుని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. ఇలా పలు శాఖలను మోసగిస్తూ రూ.కోట్లు కొల్లగొడుతున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 300కు పైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. ఏటా వీటి సంఖ్య పెరుగుతోంది. నంద్యాల పట్టణ శివార్లలోని అయ్యలూరు మెట్ట, పెద్దకొట్టాల, పొన్నాపురం, అయ్యలూరు, మహానంది మండలంలోని సీతారామాపురం, రుద్రవరం, ఆళ్లగడ్డ, కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు, కాల్వబుగ్గ, ఎమ్మిగనూరు సమీపంలోని 167వ జాతీయ రహదారి వెంబడి, కోసిగి రహదారి, ఎమ్మిగనూరు–ఆలూరు రహదారి తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో బట్టీలు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఏడు రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో ఎన్ని బట్టీలున్నాయో రెవెన్యూ శాఖ వద్ద తగిన వివరాలు లేకపోవడం గమనార్హం.

నంద్యాల సమీపంలోని పెద్దకొట్టాల, అయ్యలూరు, పొన్నాపురం, సీతారామాపురం బట్టీల్లో మహానంది మండలం అంకిరెడ్డి చెరువు నుంచి తెచ్చిన ఎర్రమట్టి టన్నుల కొద్దీ నిల్వ ఉంది. ఈ చెరువు మట్టి



ఆధారంగా జిల్లాలో 60 బట్టీలు నిర్వహిస్తున్నారు. ఒక్కో టిప్పరు మట్టి ప్రస్తుతం రూ.15 వేల వరకు విక్రయిస్తున్నారు. చాలా ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున అక్రమంగా మట్టి నిల్వలు చేసుకుంటున్నారు.

**అడ్డగోలుగా దందా**

జిల్లా కేంద్రం నంద్యాల శివారులోని అయ్యలూరు మెట్ట, పొన్నాపురం, అయ్యలూరు ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ రూ.కోట్లలో వ్యాపారం సాగుతోంది. ఇద్దరు ముఖ్య నేతల అనుచరులు కుందూ నది తీరం, చెరువులు, వంకల్లో యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తూ బట్టీలకు మట్టి సరఫరా చేస్తున్నారు.

నంద్యాల అనుకుని ఉన్న కుందూ నది, మహానంది మండలం అంకిరెడ్డి చెరువు, రుద్రవరం మండలం మహాదేవపురం, శిరివెళ్ల మండలాల్లోని వివిధ చెరువుల్లో ఇష్టానుసారం తవ్వకాలు సాగిస్తున్నారు. నిత్యం వందల ట్రిప్పుల నల్ల, ఎర్ర మట్టిని తరలిస్తున్నారు.

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, ఆదోని పట్టణాల సమీపంలో పెద్దఎత్తున ఇటుక బట్టీలున్నాయి. చాలావరకు అనధికారికంగానే నడుస్తున్నాయి. ఎమ్మినూరు, మంత్రాలయం, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాల్లోని వివిధ చెరువుల నుంచి అక్రమంగా మట్టి తవ్వి సరఫరా చేస్తున్నారు.

## ఎన్నికల నిధులు పక్కదారి

సూళ్లూరుపేట : ఎన్నికలు గానీ, ఏదైనా విపత్తు గానీ వచ్చిందంటే అధికారులకు పండగే. ప్రధానంగా ఎన్నికల నిధులను ఖర్చు చేయడంలో అధికారులు తమ చేతివాటం ప్రదర్శిస్తుంటారు. కారణం వీటికి ఎలాంటి ఆడిట్ ఉండకపోవడమే. ఈ పరిస్థితి గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పలు నియోజకవర్గాల్లో చోటుచేసుకుంది.

ఏడు చోట్ల రూ.45 కోట్లు: జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు రూ.45 కోట్లు ఖర్చయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ నిధులను ఆరు విడతల్లో ఎన్నికల సంఘం విడుదల చేసింది. చివరగా గత డిసెంబరులో నిధులు మంజూరు చేసింది. ఎన్నికలు నిర్వహించిన అప్పటి అధికారులు పక్కాగా బిల్లులతోపాటు ఇతర లెక్కలను నమోదు చేసి ప్రస్తుత అధికారులకు అప్పగించారు. బిల్లులు చెల్లించాల్సిన బ్యాంకు ఖాతాలను అందులో పేర్కొన్నారు. అయితే చాలా వరకు బిల్లులు సంబంధిత ఖాతాలకు జమ కాలేదు. దీంతోపాటు సెక్టార్ అధికారులు, బీఎల్వోలు, ఇతర సిబ్బందికి నేటికీ చెల్లింపులు జరగనేలేదు. కానీ వారి నుంచి మాత్రం ముందుగానే అక్విడెన్స్ తీసుకున్నారు. వారంతా ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

వివరాలు తెలుసుకుంటా: నరసింహులు, డీఆర్వో
చెల్లింపుల వివరాలు తెలుసుకుంటాం. అక్విడెన్సు తీసుకుని నగదు చెల్లించకుండా ఉండకూడదు. అధికారులతో మాట్లాడతాం.

# వంతెనల నిర్మాణం జరిగేనా?



శింగనమల : వర్షం వస్తే దారి ఉండదు...ఉన్న వంతెనలు ఎప్పుడు కూలుతాయో తెలియదు...పలు వంతెనలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. గ్రామీణ రహదారులపై ఉన్న వంతెలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయి. గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంతో నూతన వంతెనల నిర్మాణాలు జరగలేదు. ఉన్నవి శిథిలమయ్యాయి. శింగనమల నియోజకవర్గంలోని పలు వంతెనల దుస్థితి ఇది. కూటమి ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. ఈనేపథ్యంలో క్షేత్రస్థాయిలోని పరిస్థితిపై పరిశీలన కథనం.

శింగనమల మరువ కొమ్మ వద్ద వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇక్కడ మరువ ప్రవహిస్తే పది గ్రామాలకు దారి ఉండదు. నెలల తరబడి ఇతర గ్రామాల దారులను వెతుక్కోవాలి. అష్టకష్టాలు పడి ప్రయాణం చేయాల్సి వస్తోంది.

శింగనమల శ్రీరంగరాయల చెరువు మరువ వంతెన నిర్మాణం ఊసే లేకుండా చేశారు. గత పాలకులు ప్రజలను ఊరిస్తూ వంతెన నిర్మాణం చేయలేదు. బుక్కరాయసముద్రం తహసీల్దారు కార్యాలయం వద్ద వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇక్కడ వర్షం నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. చెరువు మరువ ప్రవహిస్తే వాహనాల రాకపోకలు నిలిచి పోతున్నాయి. గత ఎమ్మెల్యే అనేక సార్లు వంతెన నిర్మాణం చేస్తామని చేయలేక పోయారు.నార్పల మండలం గుగూడుకు వెళ్లే ప్రధాన రోడ్డుకు వంతెన నిర్మాణం అవసరం. నరసాపురం వద్ద హెచ్చెల్సీ కాలువపై వంతెన శిథిలమైంది. దీంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. నార్పల– గుగూడు మధ్య ఈ రోడ్డుకు వంతెన నిర్మాణం చేయాల్సి ఉంది.

గార్లదిన్నె మండల పరిధిలోని కొత్తపల్లి వద్ద వంతెన నిర్మాణం అర్ధాంతరంగా ఆగి పోయింది. బళ్లారి– తాడిపత్రి రోడ్డును కలుపుతూ గతంలో మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి భూమి పూజ చేశారు. కొంత వరకు పనులు చేసి వదిలేశారు. ఈ పనులు పూర్తయితే గార్లదిన్నె, పామిడి మండలాలతో పాటు తాడిపత్రి– బళ్లారికి వెళ్లడానికి సులువుగా ఉంటుంది.

గార్లదిన్నె మండలం యర్రగుంట్ల వద్ద హెచ్చెల్సీ ఐదో కాలువ వద్ద యర్రగుంట్ల నుంచి పెనకచెర్ల డ్యాంకు వెళ్లే దారి ఇబ్బందిగా మారింది. ఇక్కడ ఉన్న వంతెన శిథిలవ్వైంది. తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి.

**త్వరలో రూ.11 కోట్లతో పనులు**

నియోజకవర్గంలో అవసరమైన వంతెనలను గుర్తించాం. అధికారులు చిన్న వంతెన నుంచి భారీ వంతెనల వరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రతిపాదనలు చేశారు. శింగనమల మరువ వద్ద త్వరలోనే రూ.5 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టనున్నాం. పోతురాజుకాల్వ వద్ద రూ.6 కోట్లతో వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
బండారు శ్రావణిశ్రీ, ఎమ్మెల్యే, శింగనమల

# భూచోళ్లపై చర్యలు శూన్యం



విశాఖపట్నం : జిల్లాలోని విలువైన ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతోంది. వాటిని పరిరక్షించడంలో యంత్రాంగం విఫలమవుతోంది. వీటిల్లో ఎప్పటికప్పుడు అక్రమాలు చోటుచేసుకుంటున్నా సంబంధిత బాధ్యులపై గట్టి చర్యలు కనిపించడం లేదు. దీంతో యథేచ్ఛగా మరిన్ని అక్రమాలకు పాల్పడుతున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన మండల, క్షేత్ర స్థాయి అధికారులు అందినకాడికి దండుకోవడానికే పరిమితం అవుతున్నారు. వీరికి ప్రజాప్రతినిధులు జత కలవడంతో విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కుల పరమవుతున్నాయి. తాజాగా రెవెన్యూ శాఖ ఉన్నతాధికారి జారీ చేసిన ఉత్తర్వులే ఇందుకు నిదర్శనం. వాటి విలువ రూ.వందల కోట్లు ఉండడంతో రెవెన్యూ వర్గాల్లో ఇది చర్చనీయాంశమవుతోంది.

**తొలగించుకునేలా..**

నిషేధిత జాబితాల నుంచి భూములను తొలగించేలా మండలాల్లో కొందరు తహసీల్దార్లు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. వారికి లబ్ధి చేకూరేలా పావులు కదుపుతున్నారు. ఇందుకు కొందరు తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బందితో కలిసి దస్త్రాలకు మోక్షం కలిగేలా చేయించుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఇందులో కొందరు అధికారుల హస్తం ఉందంటున్నారు.

**ఆ భూములపై ఎలా?** నగరానికి సమీపంలోని ముడసర్లోవ భూములు జలాశయ పరివాహక ప్రాంతంలో ఉన్నాయి. ఆయా భూములను జలవనరుగా పరిగణిస్తారు. వాటికి ఏరకంగానూ నిరభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీ)లు జారీ చేయకూడదు. సుప్రీంకోర్టు ఆదేశాలు సైతం ఉన్నాయి. అయినప్పటికీ కొద్ది రోజుల కిందట సర్వే నంబరు 31/2లోని అయిదెకరాల భూములకు ఎన్‌వోసీ జారీ చేయాలని రెవెన్యూశాఖ ఉన్నతాధికారి ఉత్తర్వులిచ్చారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తం కావడంతో దాన్ని నిలిపేశారు.

గాజువాక పరిధిలో ఏకంగా ఒక చెరువు స్థలాన్ని 22ఏ జాబితా నుంచి తొలగించాలని మరో ఉత్తర్వు వచ్చింది. గతంలో దాన్ని చేపల పెంపకం కోసం అప్పగించారు. ఇప్పుడు దాని స్వరూపాన్ని మార్చి కట్టబెట్టేలా వ్యూహం పన్నుతున్నారు. మధురవాడలో గెడ్డ పక్కనున్న భూములకు, కుసులువాడలో కొండల పక్కన ఉన్న భూములకు ఎన్ఓసీలు జారీ చేయాలని స్వయంగా ఉన్నతాధికారులే ఉత్తర్వులు ఇవ్వడం విస్తుగొలుపుతోంది. ఇవి కేవలం వెలుగు చూసిన అంశాలే. వెలుగుచూడనివి అనేకం ఉన్నాయి.

**దస్త్రాలు మార్చేసినా..**

జిల్లాలో 2017లో భారీ భూ కుంభకోణం వెలుగుచూసింది. గ్రామీణ మండల పరిధిలో 250 ఎకరాలకు చెందిన భూదస్త్రాలను తారుమారు చేసి అక్రమార్కుల పేర్లను రెవెన్యూ రికార్డుల్లో పొందుపర్చారు. నాటి తెదేపా ప్రభుత్వం వాటిపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి విచారణ చేపట్టింది. అక్రమాలు వాస్తవమేనని సిట్ తేల్చింది. మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితులకు కేటాయించిన భూములకు సైతం అడ్డగోలుగా ఎన్‌వోసీలు అప్పట్లో జారీ చేశారు. దీనికి బాధ్యులుగా అప్పట్లో పనిచేసిన పలువురు సంయుక్త కలెక్టర్లు, డీఆర్వోలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్లు, ఉప తహసీల్దార్లు, సీనియర్ సహాయకులు ఇలా వందమందికిపైగా బాధ్యులను తేల్చారు. అయినప్పటికీ ఏ ఒక్కరిపై ప్రభుత్వం ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. కలెక్టరేట్‌లోని ఎఫ్ సెక్షన్ కేంద్రంగా మధురవాడలోని పలు సర్వే సంఖ్యల్లోని భూముల రికార్డులను తారుమారు చేసినట్లు గుర్తించారు. దీనికి ఏడుగురు అధికారులను బాధ్యులను చేసి విచారిస్తున్నారు.

# హమ్మయ్య.. సర్దేశారు

చిత్తూరు : వ్యవసాయ రంగంలో పలు సంస్కరణలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతు సేవా కేంద్రాల (గతంలో రైతు భరోసా కేంద్రాల) హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపట్టింది. ఉమ్మడి జిల్లాను ప్రామాణికంగా తీసుకుని సిబ్బంది హేతుబద్ధీకరణ పూర్తిచేసింది.

**సచివాలయం క్లస్టర్ ఆధారంగా..** గ్రామ సచివాలయం క్లస్టర్లను పరిగణనలోకి తీసుకుని ఆర్ఎస్‌కేల సిబ్బంది హేతుబద్ధీకరణ చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో 902 రైతు సేవా కేంద్రాలు ఉండగా ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో 502 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం(2024–25) ఖరీఫ్, రబీలో ఈ–పంట నమోదును పరిగణనలోకి తీసుకుని హేతుబద్ధీకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ సచివాలయాలకు అనుబంధంగా ఇటీవల మ్యాపింగ్ చేసి ఎంపిక చేసిన క్లస్టరు ఆధారంగా స్థానికంగా 600–700 నుంచి 1,200–1,400 ఎకరాలను పరిగణనలోకి తీసుకున్నారు. పంటల సాగు లెక్కలోకి తీసుకొని సిబ్బందిని సర్దుబాటు చేశారు. ఎక్కువ విస్తీర్ణంలో(వ్యవసాయం, ఉద్యాన పంటలు) ఉన్నాయో.. ఆ పంటలకు అనుగుణంగా సిబ్బందిని నియమించారు.

**ఉమ్మడి జిల్లాలో 568 ఆర్ఎస్‌కేలు..** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 902 రైతు సేవా కేంద్రాలు ఉండేవి. క్లస్టర్ల వారీగా ఆర్ఎస్‌కేల క్రమబద్ధీకరణతో చిత్తూరు జిల్లాలో 256 ఆర్ఎస్‌కేలు, అన్నమయ్య జిల్లాలో 158, తిరుపతి జిల్లా పరిధిలో 154 రైతు సేవా కేంద్రాలు అందుబాటులోకి తెచ్చి ఇక్కడ సిబ్బందిని హేతుబద్ధీకరించారు. సిబ్బంది సర్దుబాటులో భాగంగా జిల్లాకు గ్రామ ఉద్యాన సహాయకులు 10–15 రానున్నారని, ఇక్కడి నుంచి ఆరు మంది గ్రామ వ్యవసాయ సహాయకులు ఇతర జిల్లాలకు వెళ్లానున్నారు. ఆర్ఎస్‌కేల హేతుబద్ధీకరణ నివేదికలను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆమోదంతో రాష్ట్ర వ్యవసాయ శాఖకు నివేదించామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఆమోదముద్ర వేయగానే హేతుబద్ధీకరణకు అనుగుణంగా ఆర్ఎస్‌కేల వ్యవస్థ అందుబాటులోకి రానున్నదని అధికారులు తెలిపారు.

## నీటి గ్రిడ్ పనులు ఇంకెప్పుడు?

తిరుపతి : అదిగో 'వాటర్ గ్రిడ్'.. ఇవిగో 'ఇంటింటికీ నీళ్లు' అంటూ గత ఐదేళ్లు వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఊరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు పనుల ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. త్వరగా పూర్తిచేసి నీటి ఎద్దడి లేకుండా చేయాలని ఆదేశించగా అధికారులు మాత్రం ఈ వేగాన్ని అందుకోలేకపోతున్నారు. పొరుగునే ఉన్న అన్నమయ్య జిల్లాలో ఇటీవల టెండర్లు ఖరారుకాగా మన దగ్గర ఎప్పుడు ఈ ప్రక్రియ పూర్తవుతుంది? పనులు ఎప్పుడు మొదలవుతాయి? అన్న ప్రశ్నలు వస్తున్నాయి.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి (2014–19)గా నారా లోకేశ్ ఉన్న సమయంలో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. రూ.4,375 కోట్లతో టెండర్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చింది. పనులు నిలిపేయడంతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పుంగనూరుకు మాత్రమే నీరందించేలా ప్రణాళికలు రూపొందించి పనులు అటకెక్కించారు.

**'కుప్పం' పర్యటనలో సీఎం సూచించినా**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రిజర్వాయర్ల నుంచి ఉపరితల జలాలను గ్రామాలకు తీసుకురావాలని నిర్ణయించారు. సీఎం చంద్రబాబు తొలి కుప్పం పర్యటనలోనే ఈ దిశగా అధికారులకు సూచనలు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ సాయం కోరడంతోపాటు డీపీఆర్ తయారు చేయాలని



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

**మరో రెండుమూడు నెలలు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలవుతోంది. ఈలోపే టెండర్లు ఖరారయ్యి.. ఒప్పందం పూర్తిచేసుకుని ఉంటే పనులు వేగంగా జరిగేవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తొలిదశలో భాగమైన అన్నమయ్య జిల్లాలో గతనెల 7న రూ.2,370 కోట్లతో టెండర్లు ఖరారు చేశారు. 30 నెలల్లో పూర్తి చేయాలని నిర్దేశించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఇందుకు మరో రెండుమూడు నెలల సమయం పడుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు వేగంగా కదిలితే గ్రామాలకు త్వరగా రక్షిత జలాలు అందించవచ్చు.

**ప్రాథమికంగా నిర్ణయించినా..**

ప్రాథమికంగా తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలతోపాటు నగరిలోని వడమాలపేట, పుత్తూరు, చంద్రగిరిలోని తిరుపతి గ్రామీణ, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాలకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కండలేరు జలాశయం నుంచి నీరు తీసుకోవాలని ఇప్పటికే నిర్ణయించారు. చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాలతోపాటు నగరిలోని నింద్ర, విజయపురం, నగరి మండలాలకు ఇక్కడి నుంచే నీళ్లు తరలిస్తారు. ఉమ్మడి కడప జిల్లాలోని గండికోట రిజర్వాయర్ నుంచి పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలతోపాటు చంద్రగిరిలోని పాకాల, చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాలెం మండలాలకు నీరు తెస్తారు.

గండికోట జలాశయం నుంచి నీరందనున్న మండలాలు 18
లబ్ధి పొందే జనాభా 12.10
అవసరమైన నీరు 1.06 టీఎంసీలు

## మళ్లీ చేద్దాం.. మళ్లించేద్దాం


బంగారుపాళ్యం : ఉపాధిహామీ పథకం సిబ్బంది క్షేత్రస్థాయిలో పెద్దఎత్తున చేతివాటం చూపుతున్నారు. మూడేళ్లపాటు విధులు నిర్వర్తించిన ఏపీవో, టెక్నికల్, కంప్యూటర్ సిబ్బందిని ఉన్నతాధికారులు గతేడాది మార్చిలో బదిలీచేశారు. వారి స్థానాల్లో కొత్తవారిని నియమించగా ఇదే అవకాశంగా భావించిన వారు చేతివాటం చూపుతున్నారు.

**ఎక్కడెక్కడంటే..**

గతేడాది చేసిన కాలువల పూడికతీత పనులకు మళ్లీ అంచనాలు వేసి అనుమతులు పొంది కూలీలచే పనులు చేయిస్తున్నారు. ఇలా ఒక్కో పనికి రూ.2 లక్షలకు పైగా అంచనాలు సిద్ధం చేయడం విశేషం. తుంబకుప్పం, ముంగర మడుగు, రాగిమానుపెంట, బంగారు పాళ్యం, కె.ఎం కండ్రిగ, కాటప్పగారిపల్లె పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో రూ.50 లక్షల విలువచేసే పనులనే మళ్లీ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఫారం పాండ్ పనులు చేయాల్సి ఉన్నా..**

ఉన్నతాధికారులు ఉపాధిహామీలో ఫారంపాండ్ పనులు చేయాలని ఆదేశించారు. ఈ పనుల్లో కూలీలకు కష్టం అధికం. కాలువ పనుల్లో అయితే అటూఇటూ గడ్డి చెక్కి అడుగు లోతు మట్టి తీసి బిల్లులు కాజేయవచ్చునేది క్షేత్రస్థాయి సిబ్బంది ఆలోచన. మండల అధికారులు తందానా అంటుండటంతో అక్రమాలకు అదుపు లేకుండా పోతోంది.



**పర్యవేక్షణ కరవు..**

నిత్యం గ్రామాల్లో జరిగే పనులను ఏపీవో, ఏపీడీ, డ్వామా ఉన్నతాధికారులు పరిశీలించాలి. అయితే క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తిగా కొరవడింది. ఇదే అవకాశంగా క్షేత్రస్థాయి సిబ్బంది కూలీల హాజరు పట్టికలో తమకు అనుకూలమైన పేర్లు రాసి జేబులు నింపుకొంటున్నారు. ఈ తంతులో ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల వరకు వాటాలు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. కూలీల హాజరు ఆన్‌లైన్ చేయాల్సి ఉండగా కొన్ని ప్రదేశాల్లో యాప్ పనిచేయకపోవడంతో ఈ అక్రమాలు దర్జాగా కానిచ్చేస్తున్నారు.

**పరిశీలించి చర్యలు** ఉపాధిలో చేసిన పనులను రెండేళ్లపాటు చేయడం నేరం. బంగారు పాళ్యం మండలంలోని పలు పంచాయతీల్లో గతంలో చేసిన పనులను మళ్లీ చేస్తున్నారనే ఫిర్యాదుపై వెంటనే పరిశీలిస్తాం. సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. రవికుమార్, ఏపీడీ, పుంగనూరు

చురకలు



# ఖనిజ నేలను కాజేశారు

నంద్యాల : పరిశ్రమలు ఏర్పాటు చేసి వేలాదిమందికి ఉపాధి చూపుతామంటూ ముందుకొచ్చారు. స్థానిక నేతల సహకారంతో వేలాది ఎకరాల ప్రభుత్వ భూముల్ని లీజుకు తీసుకొన్నారు. అపారమైన ఖనిజ సంపద కలిగిన భూముల్ని సొంతం చేసుకొని పరిశ్రమల మాటే విస్మరించారు. పైగా ప్రభుత్వ భూముల్ని సొంత జాగీరులా అనుభవిస్తున్నారు. ఇతరులకు లీజుకు ఇస్తూ అక్రమంగా ఆదాయం పొందుతున్నారు. మరికొందరు ఎటువంటి కార్యకలాపాలు ప్రారంభించకుండా వందల ఎకరాలను తమ ఆధీనంలో పెట్టుకున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు పెద్దల పాలయ్యాయి.

**అడిగిందే తడవుగా అప్పగించారు**

ఒక ప్రాజెక్టుకు అనుమతిని ఇచ్చే ముందు ఆ సంస్థ పరిశ్రమను ఎప్పట్లోగా ఏర్పాటు చేస్తుంది.. ఎప్పుడు ఉత్పత్తిని ప్రారంభిస్తుందో స్పష్టత అవసరం. అందుకు అనుగుణంగా ప్రభుత్వ అధికారులు వివిధ రకాల చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రాజెక్టు పురోగతిలో ఉందో లేదో దశల వారీగా పర్యవేక్షించాలి. ప్రారంభించిన తర్వాత ఎంతమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించాయో పరిశీలించాలి. ఉమ్మడి జిల్లాలో మాత్రం ఇవేమీ పట్టించుకోకుండానే ఓర్వకల్లు మండలం, గడివేముల, పాణ్యం, కొలిమిగుండ్ల మండలాల్లో వైకాపా హయాంలో వేలాది ఎకరాలు కేటాయించారు.

**సొమ్ము చేసుకొంటున్నారు**

ఓ వ్యక్తి గడివేముల మండలంలో సొంతంగా సర్వే చేయించారు.. గుర్తించిన భూముల్లో సున్నపురాయి తవ్వకాలు చేపట్టేందుకు లీజు కోసం దరఖాస్తు చేసుకున్నారు. గడిగరేవుల గ్రామ సమీపంలో సుమారు 50 ఎకరాల్లో లీజులు పొందారు. ఇంత వరకు ఉత్పత్తి మాత్రం ప్రారంభించలేదు. బేతంచెర్ల మండలం సిమెంట్‌నగర్‌లోని పరిశ్రమలకు గడివేములలో 63.95 ఎకరాల భూమిని మూడేళ్ల కిందటే కేటాయించినా ఇంత వరకు ఉత్పత్తి మాటే లేదు.



గడివేముల మండలంలోనే 20 ఏళ్ల కిందట సున్నపురాయి లీజులను పొందిన ఓ గనుల యజమాని వాటిని ఒక పరిశ్రమకు బదలాయించి పెద్దఎత్తున సొమ్ము చేసుకున్నారు.

పనులు ప్రారంభించని 'పెద్ది' సంస్థ

కర్నూలు జిల్లా ఓర్వకల్లు సమీపంలో ఓ సంస్థ సిలికాస్యాండ్ ఖనిజం తవ్వకాల కోసం 300 ఎకరాలను తీసుకుంది. విద్యుత్తు ఉపకరణాలు తయారు చేసే ఈ సంస్థ వైకాపా ప్రభుత్వంలో పలు అక్రమాలకు పాల్పడినట్లు ప్రస్తుతం కేసులు నమోదవుతున్నాయి. గత ప్రభుత్వంలో పెద్ద నాయకుడిగా చెలామణి అయిన వ్యక్తి అస్మదీయ సంస్థగా ఇది గుర్తింపు పొందింది. రెండేళ్ల కిందట లీజు ప్రాతిపదికన భూములను కేటాయించినా ఇంతవరకు మైనింగ్ ప్రారంభించలేదు.

తూడిచెర్ల, కాల్వ తదితర గ్రామాల సమీపంలో లీజులు కేటాయించినా ఉత్పత్తులు జరగడం లేదు. ఒక్కో సంస్థకు 50 నుంచి 75 ఎకరాల వరకు భూములను కేటాయించారు.

**బోర్డు తిప్పేశారు**

2010లో కొలిమిగుండ్ల మండలం కోటపాడు గ్రామ సమీపంలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటు కోసం సుమారు 3 వేల ఎకరాల ప్రభుత్వ, బంజరు భూమిని కేటాయించింది. సిమెంటు పరిశ్రమ ఏర్పాటుతో 3 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న ఉద్దేశంతో అధికారులు భూములను అప్పగించారు. ఆ తర్వాత ఈ సంస్థ పత్తా లేకుండా పోయింది.

కొలిమిగుండ్ల మండలంలోని కల్వటాల గ్రామ సమీపంలో ఓ కంపెనీ సిమెంటు పరిశ్రమను ఏర్పాటు చేసింది. 15 ఏళ్ల కిందట కోటపాడు దగ్గర భూములు పొందిన బహుళ జాతి సంస్థ కల్వటాల వద్ద కొత్తగా పరిశ్రమను ఏర్పాటు చేసిన సంస్థకు వాటిని బదలాయించింది. తామే పరిశ్రమను ఏర్పాటు చేస్తామని తీసుకున్న భూములను మరో సంస్థకు బదలాయించడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమయ్యాయి.

# నిండు ప్రాణం తీసిన నిర్లక్ష్యం

నంద్యాల : పుర అధికారుల అలసత్వం ఏడేళ్ల బాలుడి ప్రాణం తీసింది. నంద్యాల పట్టణంలోని పురపాలక పార్కులో పైపులైను వాల్వ్ తొట్టి నిర్మాణానికి పదడుగులకు పైగా లోతైన గుంత తవ్వారు. ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు.. పనులు పూర్తయి రెండు వారాలవుతున్నా.. గుంతను పూడ్చి వేయలేదు. నీటితో నిండిన ఆ గుంతే ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. పట్టణంలో చాంద్‌బాడకు చెందిన మన్సూర్, రజియాబి దంపతులకు ఇద్దరు కుమారులు మహమ్మద్‌అలీ, అయాన్ సంతానం. ఇద్దరూ ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. సెలవు కావడంతో సమీపంలోని పురపాలక పాఠశాల మైదానంలో క్రికెట్



ఆడేందుకు వెళ్లారు. ఆడుకునే క్రమంలో బంతి వెళ్లి పక్కనే ఉన్న పురపాలక ఉద్యానవనంలో వాల్వ్ తొట్టి నిర్మాణం కోసం తవ్విన గుంతలో పడింది. లోతైన ఆ గుంత నీటితో నిండి ఉంది. అన్నదమ్ములిద్దరు బంతి కోసం గుంత దగ్గరకు వెళ్లారు. బంతిని అందుకునే ప్రయత్నంలో అయాన్ గుంతలో పడిపోయాడు. ఇది చూసిన మహమ్మద్ అలీ తమ్ముడిని కాపాడేందుకు నీటిలో దిగాడు. మునిగిపోతున్న వారిని గుర్తించిన స్థానికులు వెంటనే వెళ్లి ఇద్దరినీ బయటకు తీసి స్థానిక సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అయాన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మహమ్మద్ అలీ ప్రాణాలకు ప్రమాదం లేదని చెప్పారు. ఏడేళ్ల చిన్నారి మృతితో వారి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

# కంటైనర్ క్యాంటీన్లు స్టార్టప్‌లట..!




అనకాపల్లి : సాధారణంగా వినూత్న ఆవిష్కరణలను స్టార్టప్‌లుగా పిలుస్తారు. కానీ, గత వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి హయాంలో కంటైనర్ క్యాంటీన్లను కూడా స్టార్టప్‌లుగా నిర్ధారించారు. ఆ పేరుతో అప్పటి వైకాపా నాయకులు సిఫార్సులు చేసిన వారికి క్యాంటీన్లను కట్టబెట్టారు. ఒక్కోదానికి అద్దె, విద్యుత్తు, నీటి ఖర్చులు కలిపి నెలకు వర్సిటీకి రూ.12,500 చొప్పున నిర్వాహకులు చెల్లించేవారు. ఈ ఒప్పందం గత ఏడాది జూన్ నెలతో ముగిసింది. అప్పటి నుంచి ఎలాంటి అద్దె చెల్లించకుండా కొనసాగుతున్నారు. ఫలితంగా వర్సిటీకి రూ.10లక్షల మేర నష్టం వాటిల్లింది.

**వర్సిటీ క్యాంటీన్ల మూత:** విశ్వవిద్యాలయంలో 2023 ఏడాదిలో తొమ్మిది కంటైనర్ క్యాంటీన్లు ఏర్పాటయ్యాయి. అందులో ఆరు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలోనే నెలకొల్పారు. వాటిలో ఒక సెలూన్, ఒక జిరాక్స్ సెంటర్ కూడా ఉంది. ఏయూ ఆధ్వర్యంలో సెంట్రల్ క్యాంటీన్, ఆర్ట్స్ కళాశాల వెనుక మరో క్యాంటీన్ నడిచేవి. ఏటా టెండర్ పిలిచి అధిక మొత్తానికి కోట్ చేసిన వారికి వీటిని కేటాయించేవారు. కొవిడ్ సమయంలో ఇవి మూతపడ్డాయి. తర్వాత ఆర్ట్స్ కళాశాల వెనుక ఉన్న క్యాంటీన్ తెరిచినప్పటికి అక్కడ తనకు వ్యతిరేకంగా విద్యార్థులు సమావేశాలు నిర్వహిస్తున్నారనే ఉద్దేశంతో అప్పటి వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి దాన్ని 2023లో మూయించారు.

**నిబంధనలు పక్కన పెట్టి..**నాడు కంటైనర్ క్యాంటీన్లలో ఆరింటిని ఇంక్యుబేషన్ కేంద్రానికి అప్పగించారు. నిర్వాహకులు నెలకు రూ.10వేల చొప్పున అద్దె ఆ కేంద్రానికి చెల్లించేవారు. నెలవారీ విద్యుత్తు, తాగునీటి ఖర్చులు రూ.2500 చొప్పున ఏయూ ఇంజినీరింగ్ విభాగానికి చెల్లించేవారు. వాస్తవానికి ఏయూలోని క్యాంటీన్ల నిర్వహణ ఇంజినీరింగ్ విభాగం చూస్తుంది. కంటైనర్ క్యాంటీన్లు కూడా ఆ విభాగమే నిర్వహించాలి. అయితే.. గత వీసీ వీటికి స్టార్టప్‌ల ముద్ర వేసి నిబంధనలకు విరుద్ధంగా ఇంక్యుబేషన్ కేంద్రానికి కేటాయించారు. దీనిపై ఏయూ చీఫ్ ఇంజినీర్ తిరుపతిరావును సంప్రదించగా కంటైనర్ క్యాంటీన్లను తమకు అప్పగించకపోవడంతో వాటి గడువు ముగిసినా చర్యలు తీసుకోలేకపో తున్నట్లు చెప్పారు.

**తెర వెనుక రాజకీయ నాయకులు**

గత ఏడాది జూన్ నుంచి ఎలాంటి అద్దె లేకుండా కంటైనర్ క్యాంటీన్లు కొనసాగుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీటిని తొలగించడానికి ఏయూ అధికారులు చేసిన ప్రయత్నాలను స్థానిక రాజకీయ నాయకులు అడ్డుకున్నట్లు తెలిసింది. వీటికి టెండర్లు పిలవకపోవడంతో నెలకు రూ.99వేల చొప్పున 11నెలల్లో సుమారు రూ.10లక్షల మేర ఏయూ ఆదాయం కోల్పోయింది. ఇప్పటికైనా వర్సిటీ పాలకులు స్పందించి కంటైనర్ క్యాంటీన్లకు తిరిగి టెండర్లు పిలవడంతోపాటు సెంట్రల్ క్యాంటీన్, ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలోని క్యాంటీన్‌ను తెరవాలని విద్యార్థులు, సిబ్బంది కోరుతున్నారు.

# విత్తన నాణ్యతకు పరీక్ష



కర్నూలు: ఉమ్మడి జిల్లాలో అగ్రిల్యాబ్‌ల్లో 'పరీక్ష'లు అటకెక్కాయి. పలు కేంద్రాల్లో రసాయనాల కొరత వేధిస్తోంది.. మరికొన్నింటిలో పరీక్షలు చేసేందుకు పరికరాలు లేవు. మరోనెల రోజుల్లో ఖరీఫ్ సీజన్ వచ్చేస్తోంది. ఇప్పటికైనా వ్యవసాయశాఖ అధికారులు స్పందించి నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌ల్లో సమస్యలు పరిష్కరించాలి. అప్పుడే నకిలీలకు 'పరీక్ష'లు చేయడానికి వీలుంటుంది. ఒక్కో కేంద్రానికి రూ.55 లక్షలు వెచ్చించి నియోజకవర్గానికి ఒకటి చొప్పున అగ్రిల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో భూసార పరీక్షలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతా పరీక్షలు చేసి రైతులకు దిశానిర్దేశం చేయాలి. కేవలం ఎనిమిది కేంద్రాలే పని చేస్తున్నాయి. నాలుగు వినియోగంలోకి రాలేదు.

**లక్ష్యం అందుకోవడం కష్టమే**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి పది లక్షల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేస్తుంటారు. కర్నూలు జిల్లాలో ఐదు, నంద్యాలలో మూడు కేంద్రాలే పని చేస్తున్నాయి. ఆత్మకూరు, పాణ్యం, బనగానపల్లి, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని అగ్రిల్యాబ్‌లను వినియోగంలోకి తీసుకురాలేదు. పరికరాల కొరత, పరీక్షలు చేసేందుకు రసాయనాలు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. గతేడాది 2,629 మంది రైతుల విత్తనాలు, 31 ఎరువుల నమూనాలకు పరీక్షలు చేశారు. 2025-26 ఏడాదికి సంబంధించి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నమూనాల సేకరణ లక్ష్యాలను నిర్దేశించారు.

**అమర్చడం మరిచారు**

డోన్ ల్యాబ్‌కు మెంబరెన్స్ ఫిల్టర్ సరఫరా చేయలేదు. స్పినోటెక్ ప్రైవేటు లిమిటెడ్, నేషనల్ సైంటిఫిక్ కంపెనీ అగ్రిల్యాబ్ పరికరాలను అమర్చలేదు. పాణ్యం అగ్రిల్యాబ్‌లో సీడ్, ఫర్టిలైజర్స్ ఎక్విప్‌మెంట్ (పరికరాలు) సరఫరా చేశారు. వాటిని ఇన్‌స్టలేషన్ చేయలేదు. గూడూరు కేంద్రానికి వాటర్‌బాత్ షాకర్, పీహెచ్ మీటర్, వాక్యూమ్ పంప్ తదితర వాటిని సరఫరా చేయలేదు.

పరికరాలు పనిచేయడం లేదు

నంద్యాలలో జెల్డాల్ యూనిట్-2 యూనిట్లు, వాక్యూమ్ పంప్ ఆత్మకూరులో సీడ్ జర్మినేటర్ పనిచేయడం లేదు. మంత్రాలయల్లో జర్మినేటర్ ఛాంబర్ స్టెబిలైజర్‌ను మూలకువేశారు. పత్తికొండ, ఆదోని కేంద్రాల్లో డిస్టిలేషన్ యూనిట్ సీడ్ జర్మినేటర్, ఆలూరులో ఎలక్ట్రికల్ వేయింగ్ మెషిన్ పనిచేయడం లేదు. విద్యుత్తు లోవోల్టేజీతో ఆళ్లగడ్డ కేంద్రంలో సీడ్ జర్మినేటర్ పనిచేయడం లేదు. జెల్డాల్ యూనిట్-2 కాయిల్స్‌లో ఒకటే పని చేస్తోంది. వాటర్ డిస్టిలేషన్ యూనిట్ పనిచేయడం లేదు.

**రసాయనాలేవీ**

నందికొట్కూరు అగ్రిల్యాబ్‌లో సీడ్, ఫర్టిలైజర్స్ ఎక్విప్‌మెంట్ పరికరాలను ఇన్‌స్టలేషన్ చేశారు. పరీక్షలు చేసేందుకు రసాయనాలను సరఫరా చేయలేదు. బనగానపల్లి ల్యాబ్‌లో సీడ్, ఫర్టిలైజర్ ఎక్విప్‌మెంట్ పరికరాలను సరఫరా చేశారు. రసాయనాలు సరఫరా చేయలేదు. కంప్యూటర్లు లేవు. తేమశాతం మీటర్, జర్మినేషన్ పేపర్లు సరఫరా చేయలేదు. హాట్ ఎయిర్ ఓవెన్, వాక్యూమ్ పంప్ ల్యాబ్‌కు సరఫరా చేయలేదు.

# గోరుకల్లు.. కట్టకు చిల్లు

పాణ్యం : రాయలసీమ రైతుల జీవనాడి గోరుకల్లు జలాశయం కట్ట కుంగిపోయింది.. గతంలో రెండు చోట్ల కుంగిపోగా.. ప్రస్తుతం మరోచోట కుంగిపోయింది. వైకాపా హయాంలో నిర్వహణ లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. తాజాగా వారం రోజుల నుంచి కట్టకుంగడం మొదలైంది. సుమారు 20 మీటర్ల రాతిపరుపు నీళ్లలోకి జారిపోయింది. వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే 1.90 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు అందే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కట్టను పటిష్ఠం చేయాలంటూ అన్నదాతలు ఆందోళనకు సిద్ధం అవుతున్నారు.

**రాయలసీమ జీవనాడి**

కృష్ణాజలాలను ఎస్సార్బీసీ, గాలేరు నగరి కాల్వల ద్వారా ఉమ్మడి వైఎస్సార్, చిత్తూరు జిల్లాలకు తరలించాలన్న ఉద్దేశంతో గోరుకల్లు జలాశయాన్ని నిర్మించారు. ఇందులో 12.44 టీఎంసీల నీటిని నిల్వ చేసి పలు గ్రామాలకు మంచినీరు, 1.90 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలని ప్రణాళిక రూపొందించారు. రూ.430 కోట్లు వెచ్చించి 2006లో పనులు ప్రారంభించారు.. 2016 నుంచి నీటిని నిల్వ చేస్తున్నారు. గతంలో తెదేపా హయాంలో 92 శాతం పనులు పూర్తయ్యాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా పట్టించుకోలేదు. ఫలితంగా 11 టీఎంసీలే నిల్వ చేయాల్సి వస్తోంది.

**వైకాపా నిర్లక్ష్యం.. రైతులకు శాపం**

గోరుకల్లు జలాశయం నిర్వహణకు వైకాపా ప్రభుత్వం చిల్లిగవ్వ ఇవ్వలేదు. నిర్వహణ గాడితప్పి కట్టపై దట్టంగా ముళ్లపొదలు పెరిగాయి. వర్షాలకు మట్టికట్ట కోతకు గురైంది. గుంతలు పడి



బలహీనంగా మారింది.

2023 మే నెలలో మట్టికట్ట కుంగడం ప్రారంభమైంది. జలాశయంలోని 2.600 కి.మీ వద్ద 50 మీటర్లు, మరోచోట 2.925 నుంచి 2.985 కి.మీ వద్ద 60 మీటర్ల పొడవున పది అడుగుల లోతు వరకు కుంగిపోయింది. మట్టికట్టపై వేసిన బండపరుపు రాళ్లు నీళ్లలోకి జారుతున్నట్లు అధికారులు గుర్తించారు. రైతులు ఆందోళన చేయడంతో దిగొచ్చిన అప్పటి వైకాపా ప్రభుత్వం పనులు చేపట్టింది. అందుకు సంబంధించి గుత్తేదారుకు రూ.93 లక్షలు రావాల్సి ఉంది.

2024 జనవరిలో గేట్ల వద్ద మరోసారి మట్టికట్ట కుంగింది. రైతులు విన్నవించినా అప్పటి వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు..'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మరమ్మతులు చేయించారు.

# ఇసుక బావులు.. అక్రమాల తావులు

కౌతాళం : తుంగభద్ర నదిలో ఇసుక తోడేళ్లు 'లోతు'గా తవ్వి అక్రమాలను కప్పేస్తున్నాయి. కౌతాళం మండలంలోని గుడికంబాలి, మరళి-1, మరళి-2, నదిచాగి ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కౌతాళం మండలంలో ప్రస్తుతం గుడికంబాలి, నదిచాగి రీచ్‌ల నుంచి ప్రస్తుతం ఇసుక తరలిస్తున్నారు. మరళిలో ఆగిపోయాయి. గుడికంబాలి ఇసుక రీచ్ విస్తీర్ణం 10 హెక్టార్లు. ఇక్కడ ఏడాదికి లక్ష క్యూబిక్ మీటర్ల తరలించొచ్చు. 1 మీటరు లోతు వరకు అంటే 3 అడుగులు తవ్వాలి. కానీ ఇక్కడ సుమారు 8 అడుగుల లోతులో తవ్వకాలు చేపట్టారు. గుంతలు కాల్వను తలపిస్తున్నాయి. అంతేకాకుండా పరిమితికిమించి టిప్పర్లలో లోడు చేస్తున్నారు. వాహనాల సామర్థ్యానికిమించి రెండింతల బరువుతో ఇసుకను తరలిస్తున్నారు. నదిచాగి ఇసుక రీచ్‌ను 9.170 హెక్టార్లలో కేటాయించారు. ఇక్కడి నుంచి ఏడాదిలో 91,700 క్యూబిక్ మీటర్లు తవ్వుకోవాలి. రీచ్ ప్రాంతం నదిలో ఇసుకను 1 మీటరు లోతు వరకు అంటే 3 అడుగులు తవ్వాలి. సుమారు 8 అడుగుల లోతులో తవ్వకాలు చేపట్టారు. ఇసుక తీసిన గుంతలు నీటికుంటలు, చెరువులను తలపిస్తున్నాయి.

**కానరాని తనిఖీలు**

ఇసుక రీచ్‌ల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక లోతులో తవ్వకాలు చేపట్టినా, పరిమితికిమించి వాహనాల్లో అధికంగా లోడు చేస్తున్నా గనుల శాఖ, ఆర్టీవో అధికారుల తనిఖీలు కొరవడ్డాయి.

నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నా గనుల శాఖ అధికారులు రీచ్‌లను పరిశీలించిన దాఖలాలు లేవు. వారంతా కార్యాలయాలకే పరిమితమయ్యారు.గత వైకాపా హయాంలో నిబంధనలకు విరుద్ధంగా నది మొత్తం తవ్వేశారు. కర్ణాటక ప్రాంతానికి పెద్ద ఎత్తున తరలించారు.. ప్రస్తుతమూ అదే పరిస్థితి నెలకొంది.

**సామర్థ్యానికి మించి తరలింపు**




నిబంధనల ప్రకారం రీచ్‌ల్లో ఒక టన్ను ఇసుక ధర గుడికంబాలిలో రూ.39, నదిచాగిలో రూ.40 చొప్పున అక్కడ చెల్లించి తగిన రసీదు తీసుకొని వాహనాల్లో తరలించాలి. కానీ అలా కాకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించడమే కాకుండా, అదనంగా ఒక టిప్పర్‌కు రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు చెల్లిస్తేనే ఇసుక లోడింగ్ జరుగుతోంది. లేకపోతే రెండు, మూడు రోజులైనా లోడింగ్ కాని పరిస్థితి నెలకొంది. గుత్తేదారులకు కావాల్సిన లారీలకు, పలువురు రాజకీయ నాయకుల వాహనాలకు వెంటవెంటనే లోడింగ్ చేసి పంపిస్తున్నారు. సాధారణ వ్యక్తుల వాహనాల విషయంలో జాప్యం చేస్తున్నారని ఆరోపణలున్నాయి. గుడికంబాలి, నదిచాగి రీచ్‌ల్లో జరుగుతున్న అక్రమాలు, అదనపు వసూళ్ల గురించి ఇటీవల కర్నూలు కలెక్టరేట్ ఎదుట లారీ అసోసియేషన్‌వారు ఆందోళన చేపట్టారు. రీచ్‌ల్లో పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక లోడింగ్ చేస్తూ తరలిస్తున్నారు. రాత్రిపూట తరలించే వాహనాలకు రుసుము, రసీదు లేకుండా రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోంది.

# ఆక్వా రైతు కుదేలు!

భోగాపురం: విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెట్టి, వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఆక్వా పరిశ్రమ ప్రస్తుతం గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. గత కొన్ని రోజులుగా వివిధ వైరస్‌ల కారణంగా రొయ్యల దిగుబడి తగ్గిపోయింది. ఓ వైపు రొయ్య విత్తనం, మేత సరకు దొరక్క ఇబ్బంది పడుతున్న రైతులు అమెరికా విధించిన సుంకాలకు కుదేలవుతున్నారు. దీనికితోడు పెద్ద కౌంటు రొయ్యల ధర ప్రస్తుతం కిలోకు రూ.40 వరకు తగ్గిపోయింది. దీంతో జిల్లాలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.జిల్లాలో సుమారు 200 చెరువుల్లో రొయ్యల సాగు చేపడుతున్నారు. ఈ సీజన్‌లో వైరస్ తక్కువగా సోకడం, పెద్ద కౌంటుకు అధిక ధర వస్తుండడంతో ఏటా వేసవిలో అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. ధర పతనం, పన్ను పోటు కారణంగా ప్రస్తుతం సేకరించాలో లేక చెరువుల్లోనే ఉంచాలో అర్థంకాక రైతులు ఆందోళన చెందుతున్నారు. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి, వైరస్‌ను అధిగమించి, ఎక్కువ కాలం చెరువుల్లో ఉంచడం మంచిది కాదని, త్వరగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకుంటే మరింత నష్టం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రోత్సహిస్తే నష్ట నివారణ** ఎన్నికల ముందు ఆక్వా రైతులకు ప్రభుత్వం విద్యుత్తు రాయితీలను ప్రకటించింది. యూనిట్ రూ.1.50కే అందించనున్నట్లు ప్రకటించింది. ఇటీవల ఆ శాఖ మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్వదేశీ వినియోగం పెంచాల కృషి చేస్తామని, ఆక్వా రంగం కోలుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్తు రాయితీపై



విధి విధానాలు రూపొందించి నివేదిక ఇవ్వాలని కోరారు. రైతులు ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి పొందాలన్నా రిజిస్ట్రేషన్ తప్పనిసరన్నారు. జోన్, నాన్ జోన్ అనే తేడా లేకుండా రిజిస్ట్రేషన్లు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

**అధ్యయనానికి కమిటీ ఏర్పాటు**

– విజయ్, మత్స్యశాఖ డీడీ

ఆక్వా రైతుల సమస్యలపై ఆధ్యయనానికి ప్రభుత్వం 16 మందితో సలహా కమిటీని నియమించింది. కమిటీ నివేదిక ఆధారంగా ఇతర మార్గాల ద్వారా రైతులకు సహకారం అందించనుంది. 90 రోజుల పాటు గతంలో ఉన్న 10 శాతం సుంకం అమల్లో ఉంటుంది. రైతులను ఆదుకునే మార్గాల అన్వేషణకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఇదీ పరిస్థితి..

సాగు విస్తీర్ణం 568.21

రైతుల సంఖ్య: 230

కార్మికుల సంఖ్య సుమారు: 5వేల మంది

ఏడాదిలో వ్యాపారం: రూ.70 కోట్లు

# చొరవ చూపు.. వెలుగునివ్వు

రాయదుర్గం : రాయదుర్గం అంటే గుర్తుకొచ్చేది గార్మెంట్స్.. ప్రధానంగా విభిన్న రకాల జీన్స్ తయారీకి రాయలసీమలోనే ప్రసిద్ధి. గతంలో దుర్గం పరిశ్రమలతో కళకళలాడేది. ఐదేళ్లలో వైకాపా సర్కారు నిర్లక్ష్య వైఖరి కారణంగా వెలవెలబోతోంది. తెదేపా ప్రభుత్వ హయాంలో గార్మెంట్స్ పరిశ్రమకు అవసరమైన కార్మికులను సిద్ధం చేయడం... మహిళలకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాయదుర్గంలో రెండు చోట్ల సీఎఫ్‌సీ (కామన్ ఫెసిలిటీ సెంటర్)లను ఏర్పాటు చేశారు. చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో టెక్స్‌టైల్ పార్కులో ఒకటి, పుర పథకం కింద వెలుగు ఆధ్వర్యంలో మరొకటి శాంతినగర్‌లో అందుబాటులోకి తెచ్చారు. వాటి ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన మహిళలకు దుస్తుల తయారీలో శిక్షణ ఇచ్చి ఆర్థిక స్వావలంబన సాధించేలా చేయూత అందించాల్సి ఉండగా వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో రూ.కోట్లు విలువైన భవనాలు, రూ.50 లక్షలు విలువ చేసే 150 అధునాతన కుట్టుమిషన్లు నిరుపయోగంగా మారాయి.

**ఏటా 250 మందికిపైగా..**

గత తెదేపా ప్రభుత్వ హయాంలో రెండు కేంద్రాల ద్వారా ఏటా సుమారు 250 మంది మహిళలకు స్టైఫండ్ ఇచ్చి... ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చేవారు. తర్ఫీదు పూర్తి అయ్యాక ఇంట్లో, వివిధ గార్మెంట్స్ పరిశ్రమల్లో దుస్తులు కుడుతూ ఉపాధి పొందేవారు. టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో 300 మంది మహిళలకు అంతర్జాతీయ ప్రమాణాలతో దుస్తుల తయారీపై శిక్షణ ఇచ్చి.. నెలకు రూ.10వేల దాకా



సంపాదించేలా తర్ఫీదునిచ్చారు. ఈ ప్రక్రియ కొన్నేళ్లుగా సాగిన తరువాత స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చినా మూన్నాళ్ల ముచ్చటే అయింది. వైకాపా ప్రభుత్వం వచ్చాక నిర్వహణను గాలికి వదిలేసింది. టెక్స్‌టైల్ పార్కులో రవాణా ఛార్జీ, భోజన వసతి మాత్రమే కల్పిస్తామని.. స్టైఫండ్ ఇవ్వమని అధికారులు చెప్పటంతో శిక్షణ ప్రక్రియ ఆగిపోయింది. ప్రస్తుతం అటు ప్రభుత్వం ఇటు ప్రైవేటు వ్యక్తులు నిర్వహించకపోవటంతో భవనాలు, కుట్టుమిషన్లు వృథాగా మారాయి. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు.. పీ4 విధానం ప్రకటించి అమలు చేస్తున్నారు. ఈ విధానంతో నైనా సీఎఫ్‌సీలను పునరుద్ధరిస్తే ఎంతో మందికి నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి కలుగుతుంది. దీంతో దుర్గం గార్మెంట్స్‌కు పూర్వవైభవం రానుంది.

**నిధులు రాగానే పునఃప్రారంభం – ఈశ్వరయ్య, పీడీ, డీఆర్‌డీఏ, అనంతపురం** నిధులు మంజూరు కాగానే సీఎఫ్‌సీలను పునఃప్రారంభిస్తాం. శిక్షణకు సంబంధించి కుట్టు యంత్రాలు, భవనం తదితరాలకు మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచుతాం.

# ముక్కంటి.. కష్టాలు కంటి!

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో రద్దీ సర్వసాధారణమవుతోంది. ప్రధానంగా వారాంతం, వరుస సెలవుల దృష్ట్యా వచ్చే భక్తులు గంటల తరబడి క్యూలైన్లల్లో ఉండిపోతున్నారు. దోష పూజలు చేయించుకునేందుకు క్యూలైన్లు, మళ్లీ స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ప్రధానంగా రూ.500, రూ.750 రాహు, కేతు పూజా టికెట్లు తీసుకునే భక్తులు పూజ, దర్శనం పూర్తయ్యే సరికి నాలుగైదు గంటలు నిరీక్షించాల్సిన పరిస్థితి. ఇలా గంటల తరబడి క్యూలైన్లల్లో ఉండటం వల్ల మధుమేహ బాధితులు. వృద్ధులు, పిల్లలు తీవ్ర అలసటకు గురవుతున్నారు. సమస్యను పరిష్కరించేలా తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తీరతాయి. ః ఆలయంలో 5,580 దోష పూజలు జరిగాయి. ఇక రూ.200



శీఘ్రదర్శనం 4,554, రూ.50 ప్రత్యేక దర్శనం 3,648, రూ.500 అంతరాలయ దర్శనం టికెట్లు 586 అమ్ముడుపోయాయి. దాదాపు 28 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. రద్దీ దృష్ట్యా ఆలయ ఈవో టి.బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డిలు క్యూలైన్లను పర్యవేక్షించారు.

**అనధికారిక డ్రోన్ స్వాధీనం!:** శ్రీకాళహస్తీశ్వరాలయంపై అనధికారికంగా ఎగురుతున్న డ్రోన్ కెమెరాను భద్రతా సిబ్బంది గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ముక్కంటి ఆలయంపై అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాలను ఎగరవేయకూడదు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా దాటిన తరువాత డ్రోన్ ఎగరడంపై భద్రతా సిబ్బంది గుర్తించి ఎస్పీఎఫ్ విభాగానికి అప్పగించారు. డ్రోన్ కెమెరాతో పాటు వ్యక్తిని పట్టణ పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది.

# బోయకొండకు రోప్ వే

బోయకొండ: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రముఖ శక్తి క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన బోయకొండ గంగమ్మ దేవస్థానం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందనుంది. రోప్ వే ద్వారా కొండపైకి చేరుకోవడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందుకు అటవీ శాఖాధికారులు సైతం స్థలం పరిశీలించారు. బోయకొండ గంగమ్మను దర్శించుకోవడానికి ఏపీతో పాటు కర్ణాటక, తమిళనాడు భక్తులు తరలివస్తారు. ఆలయానికి ఏటా రూ.12 కోట్ల పైబడి ఆదాయం సమకూరుతోంది. ప్రస్తుతం కొండ కింద నుంచి వాహనాల ద్వారా, కాలినడకన ఆలయానికి చేరుకోవడానికి మార్గాలు ఉన్నాయి. కింద ఉన్న గాలి గోపురం నుంచి కొండపైనున్న ప్రధాన ఆలయం వరకు 2.5 కి.మీ. మేర రోప్ వే వేయాలని గతంలోనే అంచనాలు వేశారు. తర్వాత విషయం మరుగున పడింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రోప్ వే నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చజెండా ఊపాయని ఈవో ఏకాంబరం పేర్కొన్నారు.

# ఖాళీ స్థలమా.. కబ్జా చేద్దామా!



గుత్తి : గుత్తిలో ఖాళీస్థలం కనిపిస్తేచాలు కబ్జా చేస్తున్నారు. అది ప్రైవేట్‌దా? లేక ప్రభుత్వానిదా అని చూడటం లేదు. ముందు కబ్జా చేసి ఆ తరువాత నకిలీ పట్టాలు చూపుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ రూ.కోట్లు విలువైన స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. వాటిని దర్జాగా క్రయవిక్రయాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

గతంలో వివేకానంద నగర్‌లో కొందరు స్థలాలు తమవని నకిలీ పత్రాలతో వచ్చి నిజమైన వారితో గొడవకు దిగారు. నిజమైన లబ్ధిదారులు పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం బయట పడింది. తాడిపత్రిరోడ్డులోనూ ఓ వ్యక్తి పదేళ్ల కిందట 3 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అది ఖాళీగా ఉండటంతో కొందరు ఆక్రమించారు. చివరకు నకిలీ పట్టా చూపించి, యజమానితోనే రూ.30వేలు దండుకున్నారు.

**పథకం ప్రకారమే...**

ఖాళీస్థలాన్ని పథకం ప్రకారం ఆక్రమించి తరువాత నకిలీ పట్టాలతో నిజమైన పట్టాదారులను బుకాయించి సొమ్ములు దుండుకుంటున్నారు. ఇలా గుత్తి పురపాలికలో అడ్డూ అదుపులేకుండా ఆక్రమణలు సాగుతున్నాయి.

**క్షేత్రస్థాయిలో కొన్ని ఇలా..**గుత్తిలో కొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటూ శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. మరికొందరు తాత్కాలికంగా షెడ్లు వేసుకోగా మరికొందరు శాశ్వతంగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్, కోర్టు పరిసరాల్లో సుమారు 17 మంది ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారు. తాజాగా ఓ ప్రభుత్వ ఉద్యోగి సుమారు మూడు సెంట్ల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. ఆ నిర్మాణాలు రాత్రికి రాత్రే కొనసాగుతున్నాయి. ఆక్రమణలను తహసీల్దారు ఓబిలేసు గత గురువారం రాత్రి చూసి పనులు అడ్డుకున్నారు. నీ లచ్చానిపల్లి జగనన్న లేఅవుట్ సమీపంలో సర్వేనంబర్ 644–3లోని 4.60 ఎకరాలు మార్కెట్‌లో రూ.10కోట్లు విలువ పలుకుతోంది. దీన్ని వైకాపా నాయకులు ఆక్రమించగా వరుస కథనాలతో రెవెన్యూ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గుత్తిశివారులోని కొత్తపేట జగనన్న లేఅవుట్‌లోని సర్వేనంబర్ 431లో వైకాపాకు చెందిన ఓ నాయకుడు ఏకంగా ఎకరా ప్రభుత్వ భూమిని ఆక్రమించాడు. మొత్తం 200 ఎకరాల ప్రభుత్వ భూమి అక్కడ ఉండగా కొందరు ఆక్రమించుకుంటున్నారు.

**నోటీసులతో సరిపెడుతూ..**రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి మిన్నకుండిపోయారు. కొత్తపేట లేఅవుట్‌లో కూడా సుమారు 60 మందికి నోటీసులిచ్చారు.

**పరిశీలించి చర్యలు– ఓబిలేసు, తహసీల్దారు, గుత్తి**

ప్రభుత్వ స్థలాలు, భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం. ఆక్రమణదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. దీనిపై పూర్తి నివేదికను ఆర్డీవోకు పంపుతాం.

# ఎప్పుడొచ్చేనో వన్యప్రాణి బోర్డు అనుమతులు?



తిరుపతి: మదనపల్లె– తిరుపతి జాతీయ రహదారి (ఎన్‌హెచ్– 71) కొన్నేళ్లుగా కాగితాలకే పరిమితమైన ఈ ప్రాజెక్టు.. ఇప్పుడు దాదాపు తుది దశకు చేరింది. మదనపల్లె– పీలేరు మధ్య సుమారు 80 శాతం పనులు పూర్తి కాగా కీలకమైన భాకరాపేట కనుమలో రోడ్డు నిర్మాణానికి జాతీయ వన్యప్రాణుల బోర్డు నుంచి ఇంకా అనుమతులు రాలేదు. ఒక్కసారి ఆమోదం లభిస్తే ఏడాదిలోపు పనులు పూర్తయి తిరుపతికి వేగంగా చేరుకోవచ్చు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వేగంగా అనుమతులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలి.

ఎన్‌హెచ్– 71ను రెండు ప్యాకేజీలుగా విభజించారు. మదనపల్లె– పీలేరు ఒక ప్యాకేజీ కాగా, పీలేరు– కాలూరు (తిరుపతి గ్రామీణ మండలం) మరో ప్యాకేజీ. 103 కిలోమీటర్లుగా ఉన్న ఈ రహదారి నిర్మాణానికి రూ.1,877.47 కోట్ల వ్యయంతో ఆమోదం లభించింది. మొదటి భాగంలో రమారమి 82 శాతం పనులు పూర్తయ్యాయి. వాస్తవంగా తొలి ప్యాకేజీ ఈ ఏడాది సంక్రాంతికి ముందే అంటే జనవరి 12 నాటికి పూర్తి చేయాలని ఒప్పందం సందర్భంగా పేర్కొన్నారు. వేర్వేరు కారణాలతో జాప్యం జరుగుతూ వస్తోంది. తుదిగా ఆగస్టు 15వ తేదీని చివరి గడువుగా నిర్దేశించారు.

**112.97 ఎకరాలు అప్పగించాలని..**

మదనపల్లె– పీలేరు మధ్య పెద్దగా ఇబ్బందులు లేనందున సాఫీగానే పనులు సాగుతున్నాయి. చిక్కంతా పీలేరు– కాలూరు మధ్యే ఎదురైంది. ఈ మార్గంలో రక్షిత అటవీ ప్రాంతం ఉం ఉండటంతో అటవీ శాఖ, జాతీయ వన్యప్రాణి బోర్డు అనుమతులు తీసుకోవాల్సిందే. 112.97 ఎకరాలు తమకు అప్పగించాలని ఎన్‌హెచ్ అధికారులు అటవీ శాఖను కోరారు. అక్కడి నుంచి అనుమతులు వచ్చినా వన్యప్రాణి బోర్డు కూడా అంగీకరించాలి. జంతువులు స్వేచ్ఛగా తిరిగేందుకు అండర్‌పాస్‌లు నిర్మించాలని సూచించగా అందుకు ఎన్‌హెచ్ యంత్రాంగం అంగీకరించింది. మూడు ప్రాంతాల్లో రెండు కి.మీ మేర వీటిని కడతారు. ఇటీవల కలెక్టర్ వెంకటేశ్వర్ సైతం కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు వద్ద ఈ అంశాన్ని ప్రస్తావించారు.

# అనుమితికి మించి బాణసంచా తయారీ?

అనకాపల్లి: కోటవురట్ల మండలంలో అనుమతికి మించి బాణసంచా తయారీ వల్లే భారీ విస్ఫోటనం జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విజయలక్ష్మి గణేష్ ఫైర్ వర్క్స్ పేరుతో ఇక్కడ 15 కేజీలలోపు మందుగుండు సామగ్రి తయారీకే లైసెన్స్ తీసుకున్నారు. ఈ కేంద్రంలోజరిగిన పేలుడు ధాటికి కాంక్రీట్ కట్టడాలు నేలమట్టమయ్యాయి. అందులో పనిచేసే ఎనిమిది మంది కార్మికులు అల్లంతదూరాన ఎగిరిపడి చనిపోయారు. మరో ఎనిమిది మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. భారీ స్థాయిలో మందుగుండు పేలడంతోనే ఇంత విధ్వంసం జరిగింది. ప్రమాద పరిసరాల్లో ఇంకా వేలసంఖ్యలో పెద్ద తారాజువ్వలు, తాటాకు టపాసుల కట్టలు, సల్ఫర్, బొగ్గు, పొటాషియం నైట్రేట్, ఎలక్ట్రిక్ పౌడర్, బేకింగ్ సోడా నిల్వలున్నాయి. వీటన్నింటిని చూస్తే అనుమతికి మించే బాణసంచా తయారవుతున్నట్లు పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు ఓ అంచనాకు వస్తున్నారు. 15 కేజీలకు మించి మందుగుండు తయారీ చేయాలంటే చెన్నైలోని ఎక్స్‌ప్లోజివ్ డిపార్ట్‌మెంట్ నుంచి అనుమతులు తీసుకోవాలి. అలా చేయకుండా స్థానికంగా తక్కువ మోతాదుకు లైసెన్స్ తీసుకుని భారీగా ఉత్పత్తి చేస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి.

ప్రమాద స్థలం నుంచి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) సేకరించిన నమూనాలను విశ్లేషించిన తరవాతే అక్కడ ఎంత నిల్వలు ఉండే అవకాశం ఉంది. ఏయే రకాల రసాయన మిశ్రమాలను వినియోగించారనేది తెలుస్తుందని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఆ దిశగానూ దర్యాప్తు చేయిస్తున్నామని కోటవురట్ల పోలీస్‌స్టేషన్‌లో భారత న్యాయసంహిత సెక్షన్ 105, 125(ఎ), 125(బి), రెడ్‌విత్ 3(5), ఎక్స్‌ప్లోజివ్ సబ్‌స్టేన్స్ యాక్ట్ సెక్షన్ 3, 5 కింద కేసు నమోదు చేసి విచారణకు ఆరు బృందాలను నియమించినట్లు చెప్పారు. అప్పుడే సిఫార్స్ చేసినా.. ఈ బాణసంచా తయారీ కేంద్రంలో నిబంధనలు పాటించడం లేదని, రక్షణ ఏర్పాట్లు లేవని 2019లో కోటవురట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ ఫైర్‌వర్క్స్ లైసెన్స్ రద్దు చేయాలని ఎస్పీకి లేఖ



రాశారు. ఈ కేంద్రం నిర్వాహకుడు గతంలో కోర్టు తమకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును చూపించి లైసెన్స్ పునరుద్ధరించుకున్నారు. పోలీసులు సూచించినట్లు అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకున్నా విస్ఫోటనం జరిగిన సమయంలో అవేవీ ఇప్పుడు ఉపయోగపడనే లేదు. ఈ కేంద్రంలో సీజన్‌ను బట్టి 20 నుంచి 30 మందికి పైగా పని చేస్తుంటారు. వాస్తవానికి 20 మంది పనిచేస్తే కర్మాగారాల చట్టం ప్రకారం రిజిస్టర్ చేసుకోవాలి. కాని తక్కువ మంది పనిచేస్తున్నారని షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌లో వీరు అనుమతులు తీసుకున్నట్లు కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ రామారావు చెప్పారు.

**రైతులు అభ్యంతరం తెలిపినా..**

బాణసంచా కేంద్రంలో తయారైన తారాజువ్వలను ఎప్పటికప్పుడు పరీక్షించేవారు. ఆ సమయంలో కొన్ని నిప్పురవ్వలు సమీపంలోని సరుగుడు తోటల్లో పడేవి. వాటివల్ల పంటంతా దగ్ధమయ్యేదని ఓ రైతు చెప్పారు. లైసెన్స్ పునరుద్ధరణ సమయంలో అభ్యంతరం లేదంటూ సంతకాలు పెట్టమని తమను కోరేవారని.. తాము నిరాకరించినా వాళ్లకు తెలిసిన వాళ్లతో సంతకాలు చేయించుకునేవారని ఆరోపించారు. వీరి బాణసంచా మూలంగా సరుగుడు పంట వేయడం మానేసుకుని నష్టపోయినట్లు సమీప రైతు తెలిపారు.

# పలమనేరు గోశాలలోనూ అవకతవకలు!

తిరుపతి: తిరుపతిలోని ఎస్వీ గో సంరక్షణశాల తరహాలోనే వైకాపా హయాంలో పలమనేరులోని శ్రీవేంకటేశ్వర గోశాలలోనూ అవకతవకలు వెలుగు చూశాయి. మూడున్నరేళ్ల కిందట విజిలెన్స్ విభాగం వీటిని గుర్తించి తితిదేకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని సిఫార్సులు చేసినా వాటిని బుట్టదాఖలు చేశారు. ఇక్కడ తితిదేకు ఏకంగా 450 ఎకరాల భూమి ఉంది. దేశవాళీ ఆవుల సంరక్షణ ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశం. 1,038 గోవులుండగా సంరక్షణ బాధ్యతలు చూస్తోన్న సంస్థకు ఒక్కో ఆవుకు నెలకు తితిదే రూ.1,435 చెల్లించింది. నెలకు రూ.14.89 లక్షలు చెల్లింపులు చేశారు. ఇందుకు తగ్గట్టుగా సిబ్బందిని మాత్రం నియమించుకోలేదు. రికార్డుల ప్రకారం 33 మంది సిబ్బంది, ఇద్దరు సూపర్‌వైజర్లు ఉన్నా.. వేతనాలు మాత్రం 22 మందికి చెల్లించారు. 140 ఆవుల బాధ్యతను ఒక్క సిబ్బంది చూస్తున్నారని 2021 జులై 8న విజిలెన్స్ అధికారుల తనిఖీలో వెల్లడైంది. పరిసరాలు సైతం అపరిశుభ్రంగా ఉన్నాయని నివేదికలో పేర్కొన్నారు. పశుగ్రాసం కూడా సదరు గుత్తేదారుడే సరఫరా చేస్తున్నాడని.. భూమి, నీరు ఉచితంగా తీసుకుంటున్నారని, నెలకు తితిదే విద్యుత్తు బిల్లుకు రూ.90 వేలు చెల్లిస్తోందని అందులో ప్రస్తావించారు. గుత్తేదారుకు



నెలకు రూ.1.16 కోట్లు లాభం పొందుతున్నాడని వివరించారు. తితిదే ఈ విషయంలో పునరాలోచన చేయాలని సూచించారు. తిరుపతిలోని ఎస్వీ గోశాలలో 2021లో 2,071 గోవులుండగా పలమనేరులో 1,038 ఉన్నాయి. ఏడాదికి పలమనేరులో పశుగ్రాసానికి ఏకంగా రూ.1.01 కోట్లు చెల్లిస్తుండగా, తిరుపతిలో రూ.99.67 లక్షలు చెల్లిస్తున్నారు. ఆవుల సంఖ్య తక్కువగా ఉన్నచోట ఇంత వ్యయం చేయడాన్ని విజిలెన్స్ విభాగం అప్పట్లోనే అభ్యంతరం తెలిపింది. పలమనేరులో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే గతేడాది అగ్ని ప్రమాదం జరిగిందని తాజాగా సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో తితిదే ఈవో శ్యామలరావు వెల్లడించారు.

# కరిగిపోతున్న కొండ.. ఆగని దందా!

మునగపాక : అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు. ఇదే అదునుగా అక్రమార్కులుపాటిపల్లి కొండ చుట్టూ టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లు మోహరించారు. పొక్లెయిన్‌తో గ్రావెల్ తవ్వకాలు ముమ్మరంగా సాగించారు. పాటిపల్లి–తోటాడ రోడ్డులో గ్రావెల్ తరలింపులో వాహనాలు బారులుదీరాయి. ఈ తవ్వకాలతో మునగపాక మండలం పాటిపల్లి కొండ కరిగిపోతోంది. ఎత్తిపోతల పథకం సమీపాన అక్రమ గ్రావెల్ తవ్వకాలకు అడ్డూ అదుపులేని పరిస్థితి ఎదురైంది. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినాల్లో పట్టపగలే విచ్చలవిడిగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతూ పదుల సంఖ్యలో వాహనాల్లో తరలిస్తున్నారు. ఎత్తిపోతల పథకం మొదలుకొని పాటిపల్లి జగనన్న కాలనీ వరకు ప్రధాన రహదారి పక్కనే గ్రావెల్ తవ్వకాలు



సాగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు సాగుతున్నా అధికారులు నిలువరించే పరిస్థితి లేదు. లక్షలాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నా అధికారులు వీటివైపు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఆర్డీఓకు, కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్నట్టు స్థానిక నాయకులు తెలిపారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలపై మునగపాక తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. వెంటనే సిబ్బందిని పంపించి వాహనాలను సీజ్ చేయిస్తానన్నారు. ఇకపై ఆ ప్రాంతంలో పోలీస్ నిఘా ఏర్పాటు చేయిస్తానని చెప్పారు.

# గురుకులం.. భవిష్యత్తు బంగారుమయం

ఎమ్మిగనూరు : గురుకుల పాఠశాలలు.. పేద విద్యార్థులకు ఆశా కిరణాలు. వీటిల్లో సీటు సాధిస్తే భవిష్యత్తు బంగారుమయం కానుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ప్రవేశ పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేశారు. కర్నూలు జిల్లాలో పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పరీక్షలు రాసే అభ్యర్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కర్నూలు జిల్లాలో గురుకుల ప్రవేశ పరీక్షలు రాసేందుకు పాఠశాలకు 4,946, జూనియర్ కళాశాలకు 6,199, డిగ్రీ కళాశాలకు 211 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 25న కర్నూలులో నిర్వహించనున్నారు.

**పాఠశాలకు సిలబస్ :** పాఠశాల ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు 1 నుంచి 4వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లోని అన్ని సబ్జెక్టుల నుంచి 100 బిట్స్ వస్తాయి. కళాశాల సిలబస్ : పదో తరగతి గణితం, సైన్స్ నుంచి 150 బిట్లు ఉంటాయి.

**డిగ్రీ కళాశాలకు సిలబస్ :** ఆయా గ్రూప్‌లకు సంబంధించిన పాఠ్య పుస్తకాల నుంచి 150 బిట్లు వస్తాయి. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు ర్యాంకులు కేటాయిస్తారు. సదుపాయాలు : పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు భోజనంతోపాటు ఉచిత నోట్ పుస్తకాలు, టెక్స్ట్‌బుక్‌లు, పెట్టెలు, ఇతర వసతులు కల్పిస్తారు.

ప్రత్యేక తరగతులు: ఇంటర్ చదివే విద్యార్థులకు జేఈఈ మెయిన్స్, నీట్, అడ్వాన్స్ జేఈఈ పరీక్షలకు శిక్షణ ఇస్తారు.

**ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి - గీర్వాణి, ఏపీఆర్‌జేసీ డీసీ సెట్, కర్నూలు జిల్లా సమన్వయకర్త**

గురుకుల పాఠశాల, కళాశాలలో ఈ నెల 25న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. కర్నూలులో 46 కేంద్రాల్లో 11,356 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఆయా కేంద్రాలకు ప్రత్యేక సిబ్బందిని నియమించాం. ఏమైనా సమస్యలుంటే 87126 25079 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చు.




# సచిన్ కుమార్తెపై కన్నేసిన కరణ్!

ఇండస్ట్రీ వారసురాళ్లను వెండి తెరకు పరిచయం చేయడం అన్నది దర్శక-నిర్మాత కరణ్ జోహార్ కు ఓ హాబీ. పెద్ద పెద్ద హీరోలు..హీరోయిన్ల కూతుళ్లను తన నిర్మాణ సంస్థ ద్వారా పరిచయం చేసి క్రెడిట్ దక్కించుకుంటారు. ఇప్పటికే చాలా మంది వారసుల్ని పరిచయం చేసిన సంగతి తెలిసిందే. అతిలోక సుందరి శ్రీదేవి పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ ని ఆయనే పరిచయం చేసారు. చిన్న కుమార్తె ఖుషీ కపూర్ బాధ్యతలు కూడా ఆయనే తీసుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా కరణ్ కన్ను క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ కుమార్తె సారాపై పడినట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. సారా అందానికి బాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తే పెద్ద స్టార్ అవుతుందని భావిస్తు న్నాడుట. ఈ నేపథ్యంలోనే ఇటీవల సచిన్ ని కలిసి కుమార్తె విషయాలు



చర్చించారుట. అందుకు సచిన్ కూడా సానుకూలంగా స్పందించినట్లు బాలీవుడ్ మీడియాలో కథనాలొస్తున్నాయి.

సారాకి ఇప్పటికే సెల డ్రబిటీ స్టేటస్ ఆస్వాదిస్తోంది. సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్ ఉంది. సచిన్ కుమార్తె...డేటింగ్ చేసే భామగా వెలిగిపోతుంది. ఇన్ స్టాలో లక్షల మంది ఫాలో వర్స్ ఉన్నారు. బాలీవుడ్ సెలబ్రి టీలతో కలిసి నైట్ పార్టీలకు హాజరవుతుంది.క్రికెటర్ శుభ్‌మాన్ గిల్‌తో డేటింగ్ చేసిందనే ప్రచారం ఉండనే ఉంది. ఇప్పుడు గిల్ కి దూరంగా ఉంటూగల్లీ బాయ్ ఫేమ్ నటుడు సిద్ధాంత్ చతుర్వేది కొత్త ప్రేమాయణం మొదలు పెట్టిందని వార్తలొస్తున్నాయి. ఇలా సారా పేరు నిత్యం బాలీవుడ్ మీడియాలో హాట్ టాపిక్ గానే నలుగుతుంది. సరిగ్గా ఇదే సమయంలో హీరోయిన్ అంటూ సచిన్ ముందుకు కరణ్ వెళ్లడం ఇంట్రెస్టింగ్. మరో విషయం ఏంటంటే? కుమార్తెకు పెళ్లి కొడుకును వెతికే పనిలోనూ సచిన్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరి పెళ్లి చేసుకుంటుందా? హీరోయిన్ అవుతుందా? అన్నది క్లారిటీ రావాల్సిన అంశం.

# ప్రేమలు బ్యూటీకి మరో బంపర్ ఆఫర్..!

మలయాళ భామ మమితా బైజు ప్రేమలు సినిమాతో సౌత్ లో సూపర్ క్రేజ్ ని తెచ్చుకుంది. ప్రేమలు ఒక రెగ్యులర్ లవ్ స్టోరీనే కానీ అందులో నటించిన మమితా తన క్యూట్ లుక్స్, ఎక్స్ ప్రెషన్స్ తో యువత హృదయాలను దోచేసింది. ప్రేమలు బ్యూటీకి వచ్చిన ఈ క్రేజ్ ని క్యాష్ చేసుకోవాలని దర్శక నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా టాలీవుడ్ లో మమితా బైజుకి ఉన్న ఫ్యాన్స్ దృష్టిలో ఉంచుకుని ఆమెను ఇక్కడ సినిమాల్లో తీసుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే మాస్ మహరాజ్ రవితేజ సినిమాలో మమితా నటిస్తుందని తెలుస్తుంది. కిశోర్ తిరుమల డైరెక్షన్ లో చేస్తున్న అనార్కలి సినిమాలో మమితా బైజు నటిస్తుందని టాక్. ఈ సినిమాలో కయదు లోహార్ కూడా మరో హీరోయిన్ గా నటిస్తుందని చెబుతున్నారు. ఐతే ఈ సినిమాతో పాటుగా మమితా టాలీవుడ్ లో మరో బంపర్ ఆఫర్



అందుకుందని ఫిల్మ్ నగర్ టాక్. తెలుగులో ఒక క్రేజీ సినిమాలో హీరోయిన్ గా మమితాని ఓకే చేశారట. క్రేజీ హీరో స్టార్ డైరెక్టర్ కాంబినేషన్ లో రాబోతున్న ఈ సినిమాలో హీరోయిన్ పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని తెలుస్తుంది. మమితా కూడా స్టోరీ వినగానే కనెక్ట్ అయ్యిందట. తెలుగులో ఎప్పటి నుంచో నటించాలని ఉన్నా సరైన కథ దొరక్క సైలెంట్ గా ఉంది మమితా బైజు. ఐతే ఇప్పుడు అమ్మడు వరుస తెలుగు సినిమాలు చేసేందుకు రెడీ అయ్యింది. రవితేజ సినిమాలో మంచి రోల్ చేస్తుందని తెలుస్తుండగా ఈ సినిమాతో పాటు మరో కొత్త సినిమాకు లాక్ అయినట్టు తెలుస్తుంది. స్క్రీన్ మీద మమితా క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ కుర్రాళ్లను గిలిగింతలు పెట్టిస్తుంది. అందుకే యూత్ లో ఆమెకు ఉన్న ఈ క్రేజ్ ని పర్ఫెక్ట్ గా వాడుకోవాలని చూస్తున్నారు. మమితా బైజు తెలుగుతో పాటుగా తమిళ్, మలయాళ సినిమాల్లో రాణిస్తుంది. ప్రస్తుతం అమ్మడు దళపతి విజయ్ జన నాయగన్ లో కూడా ఇంపార్టెంట్ రోల్ చేస్తుంది. ఆ సినిమాలో పూజా హెగ్డే కూడా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. సౌత్ లో తన మార్క్ నటనతో ఆకట్టుకుంటున్న మమితా తెలుగులో బిజీ హీరోయిన్ గా ఛాన్స్ లు అందుకోవాలని చూస్తుంది. ప్రేమలుతో ఆల్రెడీ మమితాకు తెలుగు ఆడియన్స్ కనెక్ట్ అయ్యారు. సో రాబోయే సినిమాలు కూడా ఆమె అదరగొట్టేస్తుందని ఫిక్స్ అయ్యారు.

# సితారే జమీన్ పర్ ట్రైలర్




2007 క్లాసిక్ హిట్ 'తారే జమీన్ పర్' స్ఫూర్తితో, ఒక కొత్త కథను ఎంచుకుని ఇప్పుడు 'సీతారే జమీన్ పర్' చిత్రాన్ని రూపొందించాడు అమీర్ ఖాన్. ఇంతకుముందు కలర్‌ఫుల్ పోస్టర్ ని రిలీజ్ చేసి ఆసక్తిని పెంచిన అమీర్ తాజాగా ట్రైలర్ ని రిలీజ్ చేసాడు. భావోద్వేగం, హాస్యం కలబోతతో ఈ ట్రైలర్ ఆద్యంతం హృదయాలను టచ్ చేసింది. తన చిత్రాలతో చక్కని మెసేజ్ ఇచ్చే అలవాటు అమీర్ కి ఉంది. ఇప్పుడు "సబ్కా అప్నా అప్నా నార్మల్" అనే సందేశాన్ని ఈ సినిమా ద్వారా ప్రజలకు ఇస్తున్నాడు. ఈ చిత్రంలో అతడు పది మంది మానసిక వికలాంగుల టీమ్ కి బాస్కెట్‌బాల్ కోచ్‌గా నటించాడు. వైకల్యం ఉన్నవారితో ఆట ఆడించడంలో ఉన్న సవాళ్లను ఎంతో ఫన్నీగా, ఉద్విగ్నంగా దర్శకుడు తెరకెక్కించారని ట్రైలర్ చెబుతోంది. ఈ చిత్రం జూన్ 20న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రంతో ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ పది మంది నూతన నటీనటులను తెరకు పరిచయం చేస్తోంది. అరౌష్ దత్తా, గోపీ కృష్ణ వర్మ, సంవిత్ దేశాయ్, వేదాంత్ శర్మ, ఆయుష్ భన్సాలీ, ఆశిష్ పెండ్సే, రిషి షహాని, రిషబ్ జైన్, నమన్ మిశ్రా, సిమ్రాన్ మంగేష్కర్ ఈ చిత్రంలో నటించారు. శుభ్ మంగళ్ సావధాన్ ఫేం ఆర్.ఎస్. ప్రసన్న ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఇందులో జెనీలియా దేశ్‌ముఖ్ కోచ్ అమీర్ ఖాన్‌కి జంటగా నటించింది. పాటలను శంకర్-ఎహ్సాన్-లాయ్ స్వరపరిచారు. అమితాబ్ భట్టాచార్య పాటలు రాశారు. నేపథ్య సంగీతం: రామ్ సంపత్, స్క్రీన్‌ప్లే: దివి నిధి శర్మ. ఈ చిత్రాన్ని ఆమిర్ ఖాన్ - అపర్ణ పురోహిత్ సంయుక్తంగా నిర్మించారు.


# నవంబర్ వరకూ బన్నీ-అట్లీ అక్కడేనా?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 22వ చిత్రం ఇండియాస్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ గా మారుతోంది. అట్లీ 'జవాన్' తర్వాత టేకప్ చేసిన ప్రాజెక్ట్ కావడంతో బజ్ పీక్స్ కి చేరింది. సినిమా ప్రారంభోత్సావానికి ముందే ఓ రేంజ్ లో హైప్ క్రియేట్ అవుతుంది. దుబాయ్ లో స్టోరీ సహా ప్రీ ప్రొడక్షన్ పనులు జరగడం...న్యూయార్క్ స్టూడి యోలను ఇరువురు చుట్టేయడంతో ఇద్దరు ఏం చేస్తున్నారో? అర్దం కాని పరిస్థితి ఏర్పడింది. ఈసారి అట్లీ కథను టెక్నికల్ గా హైలైట్ చేస్తున్నట్లు ముందే క్లారిటీ వచ్చేస్తుంది. ప్రీ ప్రొడక్షన పనులే కొన్ని నెలలు పాటు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. చిత్రాన్ని నవంబర్ లో ప్రారంభోత్సవం చేయాలని ప్లాన్ అట. అప్పటి వరకూ ప్రీ ప్రొడక్షన్ తో పాటు అవసరమైన వర్క్ షాపులు కూడా నిర్వహిస్తారుట. వర్క్ షాపుల కోసమే నాలుగు నెలలు సమయం కేటాయిస్తున్నారుట. ఇంత వరకూ అట్లీ ఏ సినిమాకు వర్క్ షాపులు నిర్వహించలేదు. బాలీవుడ్ హీరో షారుక్ ఖాన్ తో 'జవాన్' తెరకెక్కించిన సమయంలో ఇలాంటి ఛాన్స్ తీసుకోలేదు. నేరుగా సెట్స్ కి వె ళ్లిపోయారు. చకాచకా ముగించి రిలీజ్ కు వచ్చేసారు. కానీ బన్నీ చిత్రం టెక్నికల్ గానూ కీలకం కావడంతో వర్క్ షాపులు ప్లాన్ చేసారు. ఇందులో బన్నీతో పాటు హీరోయిన్లు ఇతర టీమ్ అంతా పాల్గొంటుంది. అలాగే సినిమాలో అండర్ వాటర్ సీన్స్ కొన్ని ఉన్నాయట. సినిమాలో ఇవి చాలా కీలకమైన సన్నివేశాలని అంటున్నారు. అండర్ వాటర్ సీన్స్ మేకింగ్ అంటే అంత సులభం కాదు. అవసరం మేర విదేశీ బృందాన్ని దించాల్సి ఉంటుంది. ప్రఖ్యాత స్టూడియల్లో ఆ సన్నివే శాలకు సంబంధించి విఎఫ్ ఎక్స్ , సీజీ పనులు నిర్వహించాల్సి ఉంటుంది. చిత్రీకరణ అనంతరం సీజీ కోసమే ఆరేడు నెలలు సమయం తీసుకుంటారని సమాచారం. అలాగే సినిమాలో ముగ్గురు హీరోయిన్లు ఉంటారు? అన్న ప్రచారం ఇప్పటికే తారా స్థాయికి చేరింది.

# సింపుల్ ఫ్రాక్‌లో గుండెలు మరిగిస్తోంది


ఒకే ఒక్క పేరు.. ఇప్పుడు అన్ని ఇండస్ట్రీలను మరిగిస్తోంది. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ అన్ని చోట్లా ఈ నామధేయమే పదే పదే వినిపిస్తోంది. అంతగా తన ప్రతిభ, డ్యాన్సులతో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ బ్యూటీ పేరు శ్రీలీల. ఒక తెలుగమ్మాయి ఈ స్థాయిలో దూసుకెళ్లడం అన్నది మునుపెన్నడూ లేదు. కెరీర్ ప్రారంభించిన చాలా తక్కువ సమయంలో స్టార్ డమ్ అందుకున్న ఏకైక తెలుగు బ్యూటీగా గొప్ప గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం బాలీవుడ్ లో కార్తీక్ ఆర్యన్ సరసన రొమాంటిక్ కామెడీ చిత్రంలో నటిస్తోంది. ఆషిఖి ఫ్రాంఛైజీ సినిమా కాదు కానీ, ఇంచుమించు అదే షేడ్స్ తో కొత్త కథలో




నటిస్తోందని కథనాలొచ్చాయి. శ్రీలీలకు ఇది బాలీవుడ్ లో గేమ్ ఛేంజర్ గా మారుతుందని కూడా అంచనా వేస్తున్నారు. మొదటి సినిమా సెట్స్ లో ఉండగానే, బాలీవుడ్ లో మరో సినిమాకి సంతకం చేసిందని కథనాలొచ్చాయి. మాస్ జాతర, పరాశక్తి, లెనిన్ అనే మూడు చిత్రాల్లోను నటిస్తోంది. మరోవైపు సోషల్ మీడియా ఫోటోషూట్లు, మ్యాగజైన్ కవర్ షూట్లతోను శ్రీలీల దూసుకెళుతోంది. తాజాగా ఓపెన్ మ్యాగజైన్ శ్రీలీల ముఖ చిత్రంతో ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ ఫోటోషూట్ లో శ్రీలీల స్ట్రైకింగ్ ఫోజులతో కట్టి పడేసింది. సింపుల్ ఫ్రాక్ లో ఈ బ్యూటీ కట్టి పడేసింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ నుంచి యూనిక్ ఫోటోగ్రాఫ్ వైరల్ గా మారుతోంది.

# సీతమ్మ జీవితాన్నే మార్చేసిన ఘటన!

మృణాల్ ఠాకూర్ అలియాస్ సతీమ కెరీర్ దేదీప్యమానంగ సాగిపోతున్న సంగతి తెలిసిందే. 'సీతారామం' సక్సెస్ తర్వాత గ్యాప్ వచ్చినా? వరుస ప్రాజెక్ట్ లతో ఒక్కసారిగా బిజీ అయింది. ప్రస్తుతం బాలీవుడ్ లోనే ఐదారు సినిమాలు చేస్తోంది. ఇందులో 'డెకాయిట్' చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీలోనూ తెరకెక్కి స్తున్నారు. తెలుగులో అవకాశాలు వస్తున్నా? కథలు నచ్చకపోవడంతో అంగీకరించడం లేదు. అలా చాలా ప్రాజెక్టులే వదులుకుంది. పారితోషికంతో పనిలేకుండా కేవలం కథాబలం...సవాల్ విసిరే పాత్రలే కావాలం టోంది. కథల విషయంలో అంత బలంగా నిలబడింది కాబట్టే సక్సెస్ లు అందుకుంటుంది. అయితే నటిగా ఇంత బిజీ అవ్వడానికి కారణమైన కెరీర్ మూలాలను మృణాల్ మరోసారి గుర్తు చేసుకుంది. నటన పట్ల తనకు ఉత్సాహం ఉన్నా? దాన్ని ఎలా ఆచరణలో పెట్టాలో తెలియక చాలా ఇబ్బంది పడిందిట. తన కలను ఎలా స్వీకరిస్తారో తెలియక తనలో



ఫ్యాషన్ ను గురించి ఎప్పుడూ కుటుంబ సభ్యులతో పంచు కోలేదుట. అనుకోకుండా ఓ రోజు ఓ స్నేహితురాలు మరాఠీ షో ఆడిషన్ గురించి చెప్పడంతో అక్కడ పాల్గొందిట. మరాఠీ మాతృ భాష కావడంతో పెర్ఫార్మెన్స్ తో ఇరగదీసిందట. ఆ సక్సెస్ ఓపాత్రను తెచ్చి పెట్టిందదంది. నటన ప్రయాణంలో తొలి అడుగు పడేలా చేసిందదంది. కెరీర్ లో ఎంతో మంది ప్రేక్షకుల ప్రేమను పొందడానికి కారణమైన ఆ క్షణాలు ఎప్పటికీ ప్రత్యేకమని గుర్తు చేసుకుంది. మృణాల్ తొలు మరాఠీలో 'హలో నందన్' అనే చిత్రంలో నటించింది. ఆ సినిమా రిలీజ్ అయిన నాలుగేళ్లకు లవ్ సోనియాతో బాలీవుడ్ లో అడుగు పెట్టింది. తెలుగులో సీతారామంతో స్టార్ హీరోయిన్ గా వెలిగిపోయింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA. PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536